- మద్దతు ధర 17% వ్యవసాయ ఉత్పత్తులకే!
- యూఎస్‌లో రెండు ఇండియన్ వీసా సెంటర్లు
- 5 యూట్యూబ్ చానెళ్లను రద్దు చేయించిన 'మా'
- తోక చుక్కలు ఢీ కొట్టడంవల్లే భూమిపై నీరు
- ఇంకుడు గుంతలో కంద్దు చెదిరే గుప్తనిధి

..లోపలి పేజీల్లో

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..

ఆదివారం SUNDAY 14.7.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4+ 32 పేజీల ఆదివారం అనుబంధం Pages: 12+4+ 32 Pages SUNDAY supplement | సంపుటి (Volume): 14 | సంచిక (Issue): 39 | వెల (Price) రూ.8.00 | అష్టమి

ఆదివారం, సూర్యోదయం: 5-50, సూర్యాస్తమయం: 6-54. శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉత్తరాయణం గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం శుక్ల పక్షం తిథి: అష్టమి సాయంత్రం 5-27 వరకు. నక్షత్రం: చిత్త రాత్రి 10-07 వరకు. వర్జ్యం: తెల్లవారుజామున 4-16 నుంచి మర్నాడు ఉదయం 6-02 వరకు. రాహుకాలం: సాయంత్రం 5-15 నుంచి సాయంత్రం 6-53 వరకు. దుర్ముహూర్తం: సాయంత్రం 5-08 నుంచి సాయంత్రం 6-01 వరకు. అమృతకాలం: పగలు 2-28 నుంచి సాయంత్రం 4-44 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline





డీఎస్సీ, గ్రూప్ 2 పరీక్షలను వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ శనివారం రాత్రి హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో ఆందోళన చేస్తున్న నిరుద్యోగులు, గ్రూప్-2, గ్రూప్-3 పోస్టులు పెంచాలని నినదిస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న అభ్యర్థులు

ఏ పరీక్షా రాయనివారే దీక్ష చేస్తుండ్రు



దీక్ష చేస్తున్న ముగ్గురిలో ఏ ఒక్కరూ పరీక్ష రాయడం లేదు. ఏ పరీక్షరాయనోళ్లు, ఏ ఉద్యోగానికి పోటీ పడనోళ్లు పరీక్షలు వాయిదా కోసం దీక్ష చేస్తున్నరు. ఓ కోచింగ్ సెంటర్ యాజమానే నిరాహార దీక్షకు దిగిండు. ఆయన హాల్‌టికెట్ తీయుండ్రని అధికారులను అడిగితే ఆయనకో కోచింగ్ సెంటర్ ఉన్నది. రెండు నెలలు డీఎస్సీ వాయిదా వేస్తే వందల కోట్ల లాభం వస్తుంది.. 2 నెలల్లో కోట్ల ఆదాయం నిచ్చుకోవాలన్న ఆర్థ్యంతోనే దీక్షచేస్తున్నడని చెప్పిండ్రు. ఇంకొకాయన మొన్నటిదాక మన పార్టీలోనే ఉన్నాడు కదా? పార్టీలో పదవులు ఇవ్వలేదని వల్ల దీక్షకు కూర్చున్నడని తెలిసింది. ఇంకో పిలగాడు దీక్షకు కూర్చుండి గాంధీ దవాఖాన్ల చేరిండు. నాకు తెలిసిన వ్యక్తే కాలేజీ ఏం పరీక్షరాస్తుండు.. మంచి కోచింగ్ ఇప్పిద్దామని ఆరా తీస్తే ఓ లీడర్ దీక్షచేస్తే బాగా పేరొస్తదని చెబితే దీక్షకు కూర్చున్నడట.

- జేఎన్టీయూలో ముఖాముఖిలో రేవంత్

› 5

నిందలేసిన రేవంత్.. భగ్గుమన్న యూత్

రేవంత్ వ్యాఖ్యలపై ఆగ్రహం.. అర్ధరాత్రి అట్టుడికిన హైదరాబాద్

- అశోక్‌నగర్‌లో అభ్యర్థుల మెరుపు ధర్నా.. దిల్‌సుఖ్‌నగర్‌లో రోడ్డెక్కిన అభ్యర్థులు
- తక్షణమే గ్రూప్స్ పోస్టులు పెంచాలని డీఎస్సీ వాయిదా వేయాలని డిమాండ్
- ఆర్టీసీక్రాస్ రోడ్డు దిగ్బంధం.. ఆందోళనతో కిలోమీటర్ల మేర నిలిచిన ట్రాఫిక్
- గ్రూప్స్ అభ్యర్థి నిత్యమైత్ర ఆత్మహత్యాయత్నం.. గాంధీ దవాఖానకు తరలింపు
- సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు.. భారీగా మోహరించిన పోలీసు బలగాలు

హైదరాబాద్, జూలై13 (నమస్తే తెలంగాణ)/చిక్కడపల్లి: మొన్న తలకుమాసినోళ్లే ఆందోళన చేస్తున్నరని, నేను ఏ పరీక్ష రాయనోళ్లు.. ఏ ఉద్యోగానికి పోటీపడనోళ్లు దీక్షలు చేస్తున్నరని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై నిరుద్యోగులు భగ్గుమన్నారు. 'రాజకీయ పార్టీల ప్రోద్బలంతోనే ధర్నాలు చేస్తున్నారు.. నిరసన తెలిపేవాళ్లంతా అభ్యర్థులు కాదు' అని మాట్లాడడంపై మండిపడుతున్నారు. 'కొన్ని రాజకీయశక్తులు, కోచింగ్ సెంటర్ల యాజమాన్యాలే పరీక్షల వాయిదా కోరుతున్నయ్. నోటిఫికేషన్ ప్రకారమే పరీక్షలు నిర్వహిస్తాం.' అంటూ జేఎన్టీయూ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిందారోపణలు చేయడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ అభ్యర్థులు రోడ్డెక్కారు. గ్రూప్స్ పోస్టులు పెంచాలని, గ్రూప్-1మెయిన్స్‌లో 1:100 విధానం అమలు చేయాలని, గ్రూప్-2తోపాటు డీఎస్సీ వాయిదా వేయాలని కొన్నిరోజులుగా ఉద్యమిస్తున్నా పట్టించుకోకుండా నోటిఫికేషన్ ప్రకారమే పరీక్షలు నిర్వహిస్తామని మొండికి పోవడంపై కన్నెర్రజేశారు. సీఎం వ్యాఖ్యలకు నిరసనగా అశోక్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్,

› 2వ పేజీలో

ఎమ్మెల్యేలకు మీ రేటు ఎంత?



రాహుల్‌ను నిలదీసిన కేటీఆర్

- కర్ణాటకలో బీజేపీ చేస్తున్నదే ఇక్కడ మీరూ చేస్తున్నారా? అని ప్రశ్న
- రాష్ట్రంలో రేవంత్ ట్యాక్స్ సినిమా కలెక్షన్లను మించిపోతున్నదని ఆరోపణ

› 3

కాంగ్రెస్‌లా మనమూ తప్పులు చేస్తే ఎలా?

- అలాగైతే పవర్‌లోకి వచ్చి లాభముండదు
- బీజేపీకి కేంద్ర మంత్రి గడ్కరీ హెచ్చరికలు

› 7

యూపీ బీజేపీలో తిరుగుబాటు: అఖిలేశ్

మా భూమి మాకే!

కాదని గుంజుకుంటే భూమికి భూమి ఇవ్వాల్సిందే

- రీజినల్ రింగ్ రోడ్డుకు భూములిచ్చేది లేదు
- పాత అలైన్‌మెంట్ కాకుండా కొత్తది చేస్తుండ్రు
- ఉన్న భూమంతా పోతే మేమెట్ల బతకాలె?
- ఎంత భూమి పోతే అంతభూమి ఇవ్వండి
- 'ట్రిపుల్ ఆర్' వద్దని రైతుల ఆందోళన
- మెదక్ జిల్లా రెడ్డిపల్లి వద్ద ఎన్‌హెచ్‌పై రాస్తారోకో
- శివ్వంపేట మండలం రత్నాపూర్‌లో సర్వే అడ్డగింత
- అన్నదాతల ఆగ్రహంతో వెనుదిరిగిన అధికారులు
- ప్రభుత్వానికి నివేదిస్తామన్న నర్సాపూర్ ఆర్డీవో

"మాకున్న ఐదెకరాల భూమి ట్రిపుల్‌ఆర్ రోడ్డులో పోతున్నదని రందివట్టుకున్నది. మొత్తం పొలం రోడ్డులో పోతే మా గతి ఏంగా వాలె? మేమెట్ల బతకాలె? భూమికి భూమి ఇచ్చి న్యాయంజెయ్యిండ్రి సారూ

-కర్న కమలమ్మ, బాధితురాలు, రత్నాపూర్ (మెదక్ జిల్లా)



మెదక్ జిల్లా శివ్వంపేట మండలం రత్నాపూర్‌లో నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి కాళ్లపై పడి భూమికి భూమి ఇవ్వాలని వేడుకుంటున్న మహిళా రైతు కర్న కమలమ్మ

సిద్దిపేట, జూలై 13(నమస్తే తెలంగాణ ప్రతినిధి)/నర్సాపూర్/శివ్వంపేట : రీజినల్ రింగ్ రోడ్డు కోసం భూములు ఇచ్చేది లేదని, ఒకవేళ తప్పదంటే భూమికి భూమి ఇవ్వాలని రైతులు ఎదురుతిరిగారు. తమకు ఆధారంగా ఉన్న కొద్దిపాటి భూములను లాక్కుంటే ఎట్లా బతకాలి అని సర్కారును నిలదీశారు. మెదక్ జిల్లా నర్సాపూర్ మండల పరిధిలోని రెడ్డిపల్లి, చిన్నచింతకుంట గ్రామ రైతులు రెడ్డిపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం బైఠాయించి పెద్ద ఎత్తున రాస్తారోకో చేశారు. దీంతో రహదారిపై వాహనాలు పెద్దసంఖ్యలో నిలిచిపోయాయి. శివ్వంపేట మండలంలోని రత్నాపూర్‌లో ట్రిపుల్ఆర్ కోసం సర్వేకు వచ్చిన అధికారులను రైతులు అడ్డుకున్నారు. కొందరు అధికారుల కాళ్లపై పడి వేడుకున్నారు. 'మీ కాళ్ల

› 5వ పేజీలో

ఆ పింఛన్ వాపస్ ఇవ్వాల్సిందే



కొత్తగూడెం పట్టణంలోని బాబూక్యాంపునకు చెందిన దాసరి మల్లమ్మ

- ఆసరా సొమ్ము తిరిగివ్వాలని హుకుం
- 1,826 మందికి రికవరీ నోటీసులు
- ఆసరా పింఛన్ల తొలగింపు షురూ
- కొత్తగా ఇస్తామని పాతవాటికి పాతర
- అధికారుల నిర్లక్ష్యానికి వృద్ధులు బలి

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): వృద్ధులకు అండగా నిలిచేందుకు కేసీఆర్ ప్రభుత్వం అందజేసిన ఆసరా పింఛన్లను వెనక్కి తీసుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైంది. తాము అధికారంలోకి వస్తే పింఛన్ల మొత్తాన్ని రూ.రెండు వేల నుంచి రూ.నాలుగు వేలకు పెంచుతామన్న హామీని నెరవేర్చకపోగా, ప్రస్తుతం వస్తున్న పెన్షన్లకే ఎసరు పెడుతున్నదని పలువురు వృద్ధులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యంతో జరిగిన తప్పిదాలకు వారిని బాధ్యులను చేయకుండా పండుటాకులపై వివక్షచూపుతున్న తీరు విమర్శలకు తావిస్తున్నది. రెండేసి పింఛన్లు తీసుకుంటున్నారంటూ పలువురు వృద్ధులకు నోటీసులు జారీ చేస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా శనివారం

› 6వ పేజీలో

222 రోజులు 32 వేల కోట్లు

- రేవంత్ సర్కారు చేసిన అప్పు ఇదీ
- మంగళవారం మరో రూ. 2 వేల కోట్లు
- రిజర్వుబ్యాంకు నుంచి పొందే యత్నం
- 20 రోజుల క్రితమే రూ. 2,000 కోట్లు
- రోజుకు సగటుగా రూ.144 కోట్ల అప్పు

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో అధికారం చేపట్టిన నాటి నుంచి అప్పులతో నెట్టుకొస్తున్న కాంగ్రెస్ సర్కారు.. మరో రూ.2000 కోట్ల రుణం తీసుకోవడానికి చర్యలు చేపట్టింది. ఈ నెల 16న మరో రూ.2000 కోట్ల అప్పు సమీకరించుకునేందుకు కసరత్తు మొదలుపెట్టింది. వెయ్యి కోట్ల విలువైన బాండ్లను 12 ఏండ్లకాలానికి, మరో వెయ్యి కోట్ల విలువైన బాండ్లను 16 ఏండ్ల కాలానికి రాష్ట్ర ఆర్థికశాఖ ఆర్బీఐకి జారీచేసింది. ఈ బాండ్లను ఈ నెల 16న ఆర్బీఐ వేలం వేయనున్నది. అనంతరం ఆ మొత్తం

› 6వ పేజీలో

కరెంట్ కోతలపై గిరిజనుల కన్నెర్ర

- సబ్‌స్టేషన్ ఎదుట బైఠాయింపు
- మెదక్ జిల్లా అల్లాదుర్గంలో ఘటన
- పెద్దపల్లి జిల్లా మంథనిలో మహిళల ధర్నా

› 5



మెదక్ జిల్లా అల్లాదుర్గం సబ్‌స్టేషన్ వద్ద రాస్తారోకో చేస్తున్న గిరిజనుల వద్దకు వచ్చి విద్యుత్తు అధికారులతో మాట్లాడుతున్న [illegible]

నిరుద్యోగి కన్నెర్ర



గ్రూప్ 2,3 పోస్టులు పెంచాలని కోరుతూ ఆందోళన చేస్తున్న అభ్యర్థులు


శనివారం అర్ధరాత్రి అశోక్‌నగర్‌లో రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేస్తున్న నిరుద్యోగులు, వివిధ పరీక్షల అభ్యర్థులు

నిందలేసిన రేవంత్.. భగ్గుమన్న యూత్

> మొదటిపేజీ తరువాయి...

ఎల్బీనగర్‌తోపాటు, ఇతర అనేక చోట్ల వేలాది మంది ఉద్యోగార్థులు రోడ్డెక్కారు. కాంగ్రెస్ సర్కారు తీరుపై నిప్పులు చెరుగుతూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. అభ్యర్థుల ధర్నాలతో ఎక్కడికక్కడ గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోయింది. మరోవైపు భారీగా పోలీసులు మోహరించి అభ్యర్థులను పంపేసేందుకు యత్నించినా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది.

అశోక్‌నగర్‌లో అర్ధరాత్రి రోడ్డెక్కిన నిరుద్యోగులు

గ్రూప్ 2 పరీక్షలు యథావిధిగా నిర్వహిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి జేఎన్టీయూ వేదికగా శనివారం సాయంత్రం ప్రకటించారు. ఆ వెంటనే గంటలు వ్యవధిలోనే నిరుద్యోగులు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. గ్రూప్-2, గ్రూప్-3 పోస్టులు పెంచడంతో పాటు డిసెంబర్‌లో పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ శనివారం రాత్రి అశోక్‌నగర్ చౌరస్తాలో వేలాదిమంది సంఖ్యలో నిరుద్యోగులు మెరుపు ధర్నాకు దిగారు. పెద్దఎత్తున రాస్తారోకో చేశారు. చిక్కడపల్లి సిటీ సెంట్రల్ లైబ్రరీ నుంచి అశోక్‌నగర్ చౌరస్తా వరకూ భారీ ర్యాలీ తీశారు. చౌరస్తాలోనే రోడ్డుపైనే బైఠాయించారు. రాత్రి 9గంటల నుంచి అర్ధరాత్రి వరకూ అక్కడే రాస్తారోకో చేపట్టారు. ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిరుద్యోగుల దీక్షలపై సీఎం చేసిన అనుచిత వ్యాఖ్యలపై నిప్పులు చెరిగారు. 'సీఎం డౌన్ డౌన్' అంటూ అభ్యర్థులు చేసిన నినాదాలతో అశోక్‌నగర్ దద్దరిల్లిపోయింది. 'ఐదేండ్లు లెక్క.. గుంపు మేస్త్రీ లెక్క' అంటూ నినాదాలతో హోరెత్తించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు తామంతా కృషిచేశామని, తమ బాధను అర్థం చేసుకుని ప్రభుత్వం తక్షణమే తమ డిమాండ్లను అంగీకరించాలని డిమాండ్ చేశారు.

దిల్‌సుఖ్‌నగర్‌లో డీఎస్సీ అభ్యర్థులు..

అశోక్‌నగర్‌లో గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల అభ్యర్థులు ధర్నాకు దిగిన సమాచారం తెలుసుకున్న డీఎస్సీ అభ్యర్థులు క్షణాల్లో దిల్‌సుఖ్‌నగర్‌లో ధర్నాకు దిగారు. వెంకటాద్రి థియేటర్ నుంచి మెట్రో స్టేషన్‌వరకు ర్యాలీ తీశారు. రాజీవ్ చౌక్‌లో ధర్నాకు దిగారు. డీఎస్సీని తక్షణమే వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. "వుయ్ వాంట్ జస్టిస్.. కాంగ్రెస్ డౌన్ డౌన్.. సీఎం డౌన్ డౌన్" అంటూ నినదించారు. తమ సమస్యను రాజకీయ కోణంలో చూడవద్దని, రాష్ట్ర భవిష్యత్ దృష్టిలో చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. న్యాయమైన డిమాండ్లతో తాము చేస్తున్న ధర్నాలను బీఆర్ఎస్, బీజేపీలతో అంటగట్టి రాజకీయం చేయడం సమంజసం కాదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దిల్‌సుఖ్‌నగర్‌తో పాటు ఎల్బీనగర్ లోనూ అభ్యర్థులు ఆందోళనకు దిగడంతో పోలీసులు భారీగా మోహరించారు.

స్తంభించిన ట్రాఫిక్..

నిరుద్యోగుల మెరుపు ధర్నాతో అశోక్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్ రూట్లలో భారీగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. గంటల తరబడి వాహనాలు రోడ్లపైనే నిలిచిపోయాయి. మరోవైపు అశోక్‌నగర్‌లో ఏసీపీ రమేశ్ ఆధ్వర్యంలో దోమలగూడ, ముషీరాబాద్ సీఐలతోపాటు, అదనపు సీఆర్పీఎఫ్ బలగాలు రోడ్లపై మోహరించాయి. నిరుద్యోగులను బలవంతంగా పంపించేందుకు యత్నించాయి. అయినా అభ్యర్థులు తమ డిమాండ్లు నెరవేర్చేదాకా కదిలేది లేదని రోడ్లపైనే భీష్మించుకుని కూర్చున్నారు. దీంతో అర్ధరాత్రి దాటినా పరిస్థితి అదుపులోకి రాలేదు.

గ్రూప్స్ అభ్యర్థిని ఆత్మహత్యాయత్నం

ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై నిరుద్యోగులు మెరుపు ధర్నాకు దిగిన సమయంలోనే ఓ అభ్యర్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. అశోక్‌నగర్ ధర్నాలో ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం మొద్దులగూడెం గ్రామానికి చెందిన అభ్యర్థిని మదనం నిత్యమైత్రి పాల్గొన్నది. ఈ క్రమంలో ఒక్కసారిగా ఆవేదనకు గురై వెంటతెచ్చుకున్న గోలీలు మింగి రోడ్డుపైనే పడిపోయింది. సహచర అభ్యర్థులు వెంటనే గాంధీ దవాఖానకు తరలించారు. ప్రస్తుతం ఎమర్జెన్సీ ఏఎంసీ వార్డులో చికిత్స అందిస్తున్నారు. అభ్యర్థిని కిందపడిపోవడంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

- సార్‌కోదండం


ప్రొఫెసర్ కోదండరాం చిత్రపటాన్ని చెప్పుతో కొడుతున్న విద్యార్థులు

- ఆత్మహత్యాయత్నం


నిద్ర మాత్రలు మింగిన అభ్యర్థిని గాంధీ దవాఖానలో చికిత్స

దీక్షాపరులపై రేవంత్‌రెడ్డి హేళన

మోతీలాల్ సహా దీక్షాపరులు ఉద్యోగార్థులే కాదని వ్యాఖ్యలు

గ్రూప్స్ 1, 2, 4కు మోతీలాల్ దరఖాస్తు ● ఆధారాలతో బయటపెట్టిన అభ్యర్థులు

హైదరాబాద్, జూలై13 (నమస్తే తెలంగాణ): నిరుద్యోగుల డిమాండ్ల సాధన కోసం అభ్యర్థి మోతీలాల్ ఇటీవల దీక్ష చేపట్టిన విషయం తెలిసిందే. ఆయన దీక్షను భగ్నం చేస్తూ పోలీసులు అరెస్టు చేసినా గాంధీ దవాఖానలో దీక్ష కొనసాగించారు. అయితే తాజాగా జేఎన్టీయూలో జరిగిన ఓ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి నిరుద్యోగుల దీక్షను అపహాస్యం చేస్తూ మాట్లాడారు. మోతీలాల్ దీక్షపై విమర్శలు గుప్పించారు. దీక్ష చేస్తున్నవారెవరూ పరీక్షలు రాయడం లేదని ముందుగా మాట్లాడారు. నిరుద్యోగ దీక్షలను రాజకీయ దీక్షలుగా అభివర్ణించారు. వాస్తవానికి మోతీలాల్ జూన్ 2024లో గ్రూప్-1 పరీక్షకు హాజరయ్యారు. అతను గ్రూప్ 2, 3, 4 పరీక్షలకు కూడా దరఖాస్తు చేసుకున్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. అవేమీ తెలియకుండానే సీఎం రేవంత్‌రెడ్డి హేళన చేస్తూ మాట్లాడడంపై నిరుద్యోగులు మండిపడుతున్నారు. వివిధ పరీక్షలకు మోతీలాల్ చేసుకున్న దరఖాస్తులను ఆధారాలతో చూపిస్తూ సామాజిక మాధ్యమాల్లో నిప్పులుచెరిగారు.


మోతీలాల్ నాయక్ హాల్‌టికెట్


డీఎస్సీ వాయిదా వేయాలని దిల్‌సుఖ్‌నగర్‌లో ఆందోళన చేస్తున్న అభ్యర్థులు


గతేడాది తమ ఆందోళనకు మద్దతు పలికిన రాహుల్ ఫొటోను అశోక్‌నగర్‌లో ప్రదర్శిస్తున్న నిరుద్యోగులు

సీఎం అభాసుపాలుకాకండి

గ్రూప్స్ అభ్యర్థులు, నిరుద్యోగుల మొర ఆలకించాలి. సీఎం రేవంత్‌రెడ్డికి మరోసారి విజ్ఞప్తి చేస్తున్నా. భేషజాలకు పోకుండా గ్రూప్స్ అభ్యర్థులు, నిరుద్యోగులను చర్చలకు పిలిచి, డిమాండ్లను అర్థం చేసుకొనే ప్రయత్నం చేయండి. వారిని రెచ్చగొట్టేలా, కించపరిచేలా మాట్లాడి అభాసుపాలు కాకండి. వారు ధైర్యం కోల్పోయేలా వ్యవహరించకండి. పోలీసు బలగాలు, లాఠీలు, ఇనుప కంచెలు, బారికేడ్లతో విద్యార్థుల పోరాటాన్ని అణిచివేసే ప్రయత్నం ఫలించదు. అది మరింత ఉధృతంగా మారతుంది. గ్రూప్స్ అభ్యర్థులు, నిరుద్యోగులకు ఇబ్బందిపెట్టినా, లాఠీచార్జులకు పాల్పడినా మేము చూస్తూ ఊరుకోబోమని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాం.

- తన్నీరు హరీశ్‌రావు, మాజీ మంత్రి

రేవంత్ అబద్ధాలు సిగ్గుచేటు

రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి అబద్ధాలు చెప్తున్నారు. నిరుద్యోగులను కించపరుస్తున్నారు. మోతీలాల్ నాయక్ 2024 జూన్‌లో జరిగిన గ్రూప్-1 పరీక్ష రాసిండు. అతను గ్రూప్-2, 3, 4 పరీక్షలకు దరఖాస్తు కూడా చేసుకున్నడు. అతను సోషల్ మీడియాలో పెట్టిన హాల్‌టికెట్లే ప్రత్యక్ష సాక్ష్యం. నిరుద్యోగ యువకుల సమస్యలు పరిష్కరించకుండా సీఎం రేవంత్‌రెడ్డి కక్షపూరిత చర్యలకు దిగడం దారుణం.

- మన్నె క్రిశాంక్, బీఆర్ఎస్ నాయకుడు

ఏ పరీక్షకు అప్లై చేసినవ్ రేవంత్

ఏ పరీక్షకు అప్లై చేసిండని రాహుల్‌గాంధీ ఆ రోజు అశోక్‌నగర్ వచ్చి నిరుద్యోగుల గురించి మాట్లాడిండు. రేవంత్‌రెడ్డి నువ్వు ఏ పరీక్షకు అప్లై చేసినవ్ అని ఆ రోజు దీక్ష చేసినవ్. నిరుద్యోగ యువతను మంటన చేసి, అవహేళన చేస్తూ రేవంత్‌రెడ్డి మాట్లాడిన తీరు ఆయన అహంకారానికి నిదర్శనం. ముఖ్యమంత్రి వ్యాఖ్యలను బీఆర్ఎస్వీ తీవ్రంగా ఖండిస్తున్నది. వెంటనే డీఎస్సీ, గ్రూప్-2, 3 పరీక్షలు వాయిదా వేయాలి.

-తుంగ బాలు, బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ఏ పార్టీలతో సంబంధం లేదు

గ్రూప్-2 పోస్టులు పెంచి పరీక్షలు డిసెంబర్‌లో నిర్వహించాలి. మాకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదు. కష్టం వచ్చింది మాకు.. మేము నిరసనలు తెలుపుతుంటే మా వెనుక రాజకీయ పార్టీలు ఉన్నాయనడం సరికాదు. నిరుద్యోగులమైన మేము స్వతహాగా ఆందోళన చేస్తున్నాం. - నరసింహ, అభ్యర్థి

సీఎం మాటలు సరికాదు

నిరుద్యోగులను కించపరిచేలా సీఎం మాట్లాడడం సరికాదు. నిరుద్యోగులపై వివక్ష చూపుతున్నారు. గ్రూప్-1, డీఎస్సీలానే గ్రూప్ 2,3 పోస్టులు పెంచాలి. గ్రూప్స్ పరీక్షలు డిసెంబర్‌లో పెట్టాలి. - సుధీర్, అభ్యర్థి

రాజకీయ కోణంలో చూడొద్దు

పదేండ్లలో గ్రూప్-2 ఎగ్జామ్ ఒకేసారి జరిగింది. గ్రూప్-1,3 పరీక్షలు జరగలేదు. గ్రూప్ 2, 3 పోస్టులు పెంచి ప్రిపరేషన్ కోసం సమయమివ్వాలి. ఈ సమస్యను రాజకీయ కోణంలో చూడొద్దు. రాష్ట్ర భవిష్యత్ దృష్టితో చూడాలి.

- శ్రీకాంత్ రెడ్డి, అభ్యర్థి

రాహుల్ గాంధీ ఏ పరీక్ష రాస్తున్నడు?

- చిక్కడపల్లి లైబ్రరీలో మద్దతెందుకిచ్చారు?
- గాంధీభవన్‌లో రేవంత్ మౌనదీక్ష దేనికి?
- బల్మూరికి నీట్‌తో ఏం సంబంధం?
- మా కోసం మీరెందుకు పోరాడారు?
- సీఎం రేవంత్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్న నిరుద్యోగులు


సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ అశోక్‌నగర్‌లో ఆందోళన చేస్తున్న నిరుద్యోగులు

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): ఉద్యోగార్థుల ఆందోళనకు సంఘీభావంగా దీక్షలు చేస్తున్న వారిపై సీఎం రేవంత్‌రెడ్డి అనుచితవ్యాఖ్యలు చేస్తున్నారని నిరుద్యోగులు మండిపడుతున్నారు. పోటీ పరీక్షలు రాసేవారు మాత్రమే దీక్షల్లో పాల్గొనాలన్నట్టుగా మాట్లాడటం సమంజసం కాదని పేర్కొంటున్నారు. ముఖ్యమంత్రి వాదనే సరైనది అయితే.. ఏ సంబంధమున్నదని రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, హస్తం పార్టీ నేతలు నిరుద్యోగుల పక్షాన దీక్షల్లో కూర్చున్నారని నిలదీస్తున్నారు. నిరుడు నవంబర్‌లో రాత్రి 8.30 గంటలకు సిటీ సెంట్రల్ లైబ్రరీకి రాహుల్ గాంధీ అకస్మాత్తుగా వచ్చారని.. ఆయన ఏ పరీక్ష కోసం ప్రిపేర్ కావడానికి వచ్చారో చెప్పాలని నిరుద్యోగులు సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నిస్తున్నారు. రాహుల్‌గాంధీ లైబ్రరీ నుంచి నేరుగా అశోక్‌నగర్ చౌరస్తాకు వెళ్లి ఆందోళన చేస్తున్న విద్యార్థులతో కలిసి నిరసనకు దిగారని.. ఆయనను ఏ పరీక్షలో అన్యాయం జరిగిందని అక్కడికి వెళ్లారో సీఎం సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. 'రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం, జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తాం' అని రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీలు ఏమయ్యాయో.. ఆరు నెలలు గడిచినా ఒక్క ఉద్యోగానికి నోటిఫికేషన్ ఇవ్వని రేవంత్‌రెడ్డి తక్షణం స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థులకు అండగా ఉంటూ, పోరాటాలు చేస్తున్న విద్యార్థి ఉద్యమ నాయకులపై సీఎం రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని కోరుతున్నారు.

నీట్‌కు బల్మూర్‌కి ఏం సంబంధం?

విద్యార్థులను, విద్యార్థి ఉద్యమాలను హేళన చేస్తూ ముఖ్యమంత్రి మాట్లాడిన అహంకారపూరిత మాటలు తమను తీవ్ర మానసిక క్షోభకు గురిచేస్తున్నాయని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రతి తలమాసినోడు పరీక్ష రద్దు చేయాలని కోరుతున్నాడని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారని.. మరి ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌కు ఏం సంబంధమున్నదని నీట్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారని ప్రశ్నించారు. నీట్ పరీక్ష రద్దు కోరుతూ బల్మూరి వెంకట్ రాజభవన్‌ను ముట్టడించారని, ఆయనకు నీట్ హాల్ టికెట్ దొరికిందా? అని నిలదీస్తున్నారు. ప్రొఫెసర్ కోదండరాం కూడా గ్రూప్-1 పరీక్ష రద్దుకు ఉద్యమాలు చేశారని, కానీ ఆయన ఆ పరీక్ష రాయడానికి సిద్ధపడలేదు కదా అని గుర్తుచేస్తున్నారు. నిరుడు మార్చిలో నిరుద్యోగుల కోసం గాంధీ భవన్‌లోని గాంధీ విగ్రహం వద్ద పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి మౌన దీక్షకు కూర్చున్నారని, 'మీరు ఏ పరీక్ష రాయడం కోసం పోరాడారో వివరించాలి' అని డిమాండ్ చేస్తున్నారు.

నాడు మాకు ధైర్యం ఇచ్చిన రాహుల్ ఎక్కడ?

నిరుద్యోగులు ధైర్యం కోల్పోవద్దని, అండగా ఉంటామని కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్‌గాంధీ నాడు భరోసా ఇచ్చారని, ఇప్పుడు తాము అదే అశోక్‌నగర్ చౌరస్తాలో ధర్నా చేస్తుంటే రాహుల్‌గాంధీ ఏం చేస్తున్నారని నిలదీస్తున్నారు. ఇప్పుడు కూడా హైదరాబాద్ వచ్చి తమను ఓదార్చాలని డిమాండ్ చేస్తున్నారు. నాడు నిరుద్యోగులతో కలిసి చాయ్ తాగుతూ ముచ్చటించిన రాహుల్‌గాంధీ.. మళ్లీ తమ సమస్యలు వింటూ చాయ్ తాగేందుకు రావాలని కోరుతున్నారు. నాడు రాహుల్ గాంధీ ఇచ్చిన ధైర్యంతోనే నేటికీ జాబ్ క్యాలెండర్ కోసం ఎదురు చూస్తున్నామని పేర్కొన్నారు.

ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలిస్తాం

హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతను కలిశాను. తెలంగాణ వస్తే తమకు కొలువులు వస్తాయని ఆశించామని, రాష్ట్రం వచ్చి పదేండ్లయినా తమ ఆకాంక్షలు నెరవేరలేదని వారు ఆవేదన వ్యక్తం చేయడం నన్ను కలిచివేసింది. కేసీఆర్ పదేండ్ల పాలనలో తెలంగాణ యువతకు న్యాయం జరగలేదు. 30 లక్షల మంది నిరుద్యోగ యువత తీవ్రంగా నష్టపోయారు. వారు కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలోనే వారికి కొలువులు రాని దుస్థితి. అందుకే వారి కలలు సాకారం అయ్యేలా.. కాంగ్రెస్ పార్టీ రూపొందించిన జాబ్ క్యాలెండర్‌ను వారికి చూపించి వారిలో భరోసా నింపే ప్రయత్నం చేశాను. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోపే 2 లక్షల నియామకాలను పూర్తి చేసి యువతకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటాం.

-రాహుల్ గాంధీ

లోకం పోకడ


ఇది హాల్ టికెట్టా? బస్ టిక్కెట్టా?

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	37.3°c	24.6°c
మెదక్	36.1°c	23.0°c
రంగారెడ్డి	35.7°c	22.4°c
మహబూబ్‌నగర్	34.4°c	23.0°c
కరీంనగర్	32.0°c	25.0°c
నిజామాబాద్	31.2°c	24.4°c
వరంగల్	31.0°c	24.0°c
హైదరాబాద్	30.4°c	24.0°c
నల్లగొండ	29.5°c	21.4°c
ఖమ్మం	28.0°c	25.0°c

ఎల్లుండి సెక్రటేరియట్ ముట్టడి

10 డిమాండ్ల పరిష్కారమే
లక్ష్యం: నిరుద్యోగ యువత

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో నిరుద్యోగుల డిమాండ్ల పరిష్కారం కోరుతూ ఈ నెల 15న రాష్ట్ర సచివాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలంగాణ నిరుద్యోగ యువత పిలుపునిచ్చింది. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన 10 ప్రధాన డిమాండ్లను పరిష్కరించాలని ఈ ఆందోళన చేపడుతున్నట్టు తెలిపారు. గ్రూప్-1 మెయిన్స్‌కు 1:100 నిష్పత్తి అమలు, రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్, మూడు నెలలు డీఎస్సీ పరీక్షల వాయిదా, గ్రూప్ 2, 3 పరీక్షల వాయిదా, పోస్టుల సంఖ్య పెంపు తదితర హామీలను నెరవేర్చాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి నిరుద్యోగ యువత, వివిధ పరీక్షల అభ్యర్థులు పెద్ద ఎత్తున తరలివస్తారని పేర్కొన్నారు. ముట్టడి కార్యక్రమానికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ నేత ఆర్ కృష్ణయ్య, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, నిరుద్యోగ సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు రాజారాం‌యాదవ్ తదితరులు సెక్రటేరియట్ గేటు వద్ద నిరుద్యోగులు నిర్వహించే శాంతియుత నిరసనకు మద్దతుగా రానున్నట్టు తెలిపారు.

ఆఖరు నిమిషంలో పరీక్షాకేంద్రాల మార్పు

అయోమయంలో ఏఈ, కెమిస్ట్ అభ్యర్థులు

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): ఆదివారం పరీక్ష. అది ఉదయం 9గంటలకే. ఈ సమయంలో శనివారం సాయంత్రం అకస్మాత్తుగా పరీక్షాకేంద్రాల మార్పు. ఒక సెంటర్‌కు బదులుగా మరో సెంటర్‌లో పరీక్ష. ఇది తెలంగాణ జెన్‌కో నిర్వహించే పరీక్షల్లో జరిగిన తంతు. జెన్‌కో పరిధిలోని ఏఈ, కెమిస్ట్ ఉద్యోగాల భర్తీకి ఆదివారం కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) నిర్వహించనున్నారు. హాల్‌టికెట్లనూ జారీచేశారు. సాంకేతిక కారణాలతో మూడు పరీక్షాకేంద్రాలను ఆకస్మికంగా మార్చారు. కేపీఎం టెక్నాలజీ సొల్యూషన్స్‌కు చెందిన మూడు సెంటర్ల స్థానంలో పోచిరెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో రెండు షిఫ్టులు, ఎంపీఎస్టార్ ఇంజినీరింగ్ కాలేజీలో ఒక షిఫ్ట్ పరీక్షరాసేలా సెంటర్లు మార్చారు. దీంతో ఆయా పరీక్షా కేంద్రాల్లో హాజరుకావాల్సిన వారు ఏం జరిగిందో తెలియక కంగారుపడ్డారు.

ఒకే రోజు.. ఒకే సెంటర్‌లో పరీక్ష

14 మంది డీఎస్సీ అభ్యర్థులకు కేటాయింపు

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): డీఎస్సీ పరీక్ష కేంద్రాలను అస్తవ్యస్తంగా కేటాయించిన పాఠశాల విద్యాశాఖ తాజాగా దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ఒకే రోజు పరీక్ష ఉన్న అభ్యర్థులకు దూరాన ఉన్న వేర్వేరు జిల్లాల్లో కేంద్రాలను కేటాయించింది. తాజాగా ఒకేరోజు పరీక్ష ఉన్నవారికి ఒకే సెంటర్‌లో పరీక్ష కేంద్రాలను కేటాయించింది. ఇలా 14 మంది అభ్యర్థులకు ఒకే కేంద్రంలో పరీక్ష రాసే అవకాశాలు ఇచ్చినట్టు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఈవీ నర్సింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 'డీఎస్సీ పరేషాన్' పేరుతో 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ప్రత్యేకించి స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులకు దరఖాస్తు చేసిన వారికి ఒక్కో పరీక్షను ఒక్కో జిల్లాలో అధికారులు కేటాయించారు. ఈ నెల 18, 20, 30 తేదీల్లో పరీక్షలు ఉన్నవారికి ఇలా కేంద్రాలను కేటాయించారు. దీంతో విద్యాశాఖ ఆ 14 మందికి ఒకే సెంటర్‌లో కేంద్రాన్ని కేటాయించింది. ఆయా అభ్యర్థులు ఊపిరి పీల్చుకున్నారు. ఆ 14 మంది ఆన్‌లైన్‌లో పొందుపరిచిన సమాచారం సరిగ్గా లేనందున ఆయా అభ్యర్థులకు కంప్యూటర్ సిస్టం ద్వారా దూరంకేంద్రాలను కేటాయించామని అధికారులు వివరణ ఇచ్చారు. ఇలాంటి లోపాల సవరణకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌లో డీఎస్సీ స్టేట్ సెల్ నిరంతరం అందుబాటులో ఉన్నదని తెలిపారు. డీఎస్సీ అభ్యర్థులు 91541 14982, 6309998812 నంబర్‌ను సంప్రదించి సందేహాలు, సమస్యలను పరిష్కరించుకోవచ్చని సూచించారు. శనివారం వరకు 1,64,852 అభ్యర్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నట్టు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.

బీఆర్ఎస్‌పీపీ విలీన వార్తలు అవాస్తవం

- బీఆర్ఎస్‌లోనే కొనసాగుతా
- ఎంపీ వద్దిరాజు స్పష్టీకరణ



హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): తాను బీజేపీలో చేరుతున్నట్టు వస్తున్న వార్తలను బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర శనివారం ఓ ప్రకటనలో ఖండించారు. బీజేపీలో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ విలీనమవుతున్నట్టు వస్తున్న కథనాల్లో నిజం లేదని, అవి అభూత కల్పనలని కొట్టిపారేశారు. బీఆర్ఎస్ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు, పార్టీని బలహీనపర్చేందుకు నిరాధారమైన, వాస్తవ విరుద్ధమైన కథనాలను కొన్ని మీడియాసంస్థలు ప్రచారం చేయడం విచారకరమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే ముందుకు సాగుతానని స్పష్టంచేశారు.

కేటీపీపీలో విద్యుత్తు ఉత్పత్తి నిలిపివేత

గణపురం, జూలై 13: జయశంకర్ భూపాలపల్లి జిల్లా చెల్పూరులోని కాకతీయ థర్మల్ విద్యుత్తు కేంద్రంలోని మొదటి దశ 500 మెగావాట్ల ప్లాంట్‌లో విద్యుత్తు ఉత్పత్తిని శుక్రవారం రాత్రి నిలిపివేశారు. జెన్‌కో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏటా ప్రాజెక్టులో ఓవరాలింగ్ పనులు చేయుతారు. ఈ నేపథ్యంలో 500 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తిని నిలిపివేసి మెయింటెనెన్స్ పనులు ప్రారంభించారు. నెల రోజులపాటు ఉత్పత్తి నిలిచిపోనున్నది.





మోహన్‌రుషి, పసునూరి శ్రీధర్‌బాబుకు మల్లావఝుల సదాశివుడు స్మారక పురస్కారాన్ని అందజేస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అయాచితం శ్రీధర్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్, మల్లావఝుల సదాశివుడి తనయుడు విజయానంద్ తదితరులు

ప్రజా గొంతుకగా సదాశివుడు పాటలు

మలి ఉద్యమంలో చైతన్యం కలిగించాయి: హరీశ్‌రావు

రవీంద్రభారతి, జూలై 13: మల్లావఝుల సదాశివుడు సాహిత్యం పాటలు తెలంగాణ ఉద్యమానికి, ఉద్యమ సారథి, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌కు ఎంతో స్ఫూర్తిని ఇచ్చాయని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. శనివారం రవీంద్రభారతిలో తెలంగాణ వికాస సమితి-చేతన సాహితీ ఆధ్వర్యంలో మల్లావఝుల సదాశివుడు స్మారక పురస్కార ప్రదానసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సదాశివుడు పురస్కారాన్ని మోహన్‌రుషి, పసునూరి శ్రీధర్‌బాబుకు బహూకరించారు. అనంతరం మాట్లాడుతూ.. సదాశివుడు పాట ఎంతో గొప్పదని, తెలంగాణ మలివిడ ఉద్యమానికి సదాశివుడి పాట చైతన్యం తీసుకొచ్చిందని తెలిపారు. ఆయన ఆశయాన్ని కేసీఆర్ కొనసాగించారని వెల్లడించారు. 'కష్టాల్లోంచి, రైతుల వెతల్లోంచి పాటలు వచ్చాయి. నీళ్ల కోసం పాటలు వచ్చాయి. తలాపున పారుతుంది గోదారి.. నీవు చెలక ఎడారి పాట తెలంగాణ నీళ్ల గోసను చూపెట్టింది. తెలంగాణ వచ్చాక ఎర్రటి ఎండలోనూ మత్తళ్లు దూకిన చెరువులు కనిపించాయి. సమైక్య పాలనలో రైతుల ఆత్మహత్యలపై సదాశివుడు పాడిన పాటలను విని కేసీఆర్ ఎంతో ఆవేదన చెందారు. అందుకే కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి తెలంగాణ రైతాంగం కండ్లలో ఆనందాన్ని చూశారు' అని గుర్తుచేశారు. ఏ ఉద్యమ స్ఫూర్తితో రాష్ర్టాన్ని సాధించామో అదే స్ఫూర్తితో తెలంగాణలో పని చేశామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక వర్షాభావ పరిస్థితులతో నీరు లేక తిరిగి పాత రోజులు వచ్చాయని, రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మేడిగడ్డలో నీళ్లు ఉన్నప్పటికీ రైతులకు ఆ నీటిని విడుదల చేయకపోవటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగులపై లాఠీచార్జి దురదృష్టకరమని అన్నారు. 'రోజా పేపర్లు చూడగానే రైతులు ఆత్మహత్యలు కనిపిస్తున్నయ్. కరెంట్ కోతలు మొదలైనయ్. కళాకారులకు మూడు నెలల నుంచి జీతాలు రావటం లేదని చెప్తున్నరు. ప్రతిపక్షంగా ప్రజల తరఫున మేము పోరాడుతాం. కవులు, కళాకారులు మళ్లీ తమ కలాలకు పని కల్పించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి' అని కోరారు. గత ప్రభుత్వంపై నిందలు వేయటం కాదు, రైతుల కన్నీళ్లు తుడవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నానని అన్నారు. ప్రముఖ కవి, సాహిత్య విమర్శకుడు, సిటీ కాలేజీలో తెలుగు శాఖ అధ్యక్షుడు కోయి కోటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. అణగారిన వర్గాల గుండెల్లో నిలిచిన వ్యక్తి సదాశివుడు అని కొనియాడారు. దళిత, బహుజన చైతన్యాన్ని పాటలో ఎలుగెత్తి చాటిచెప్పారని వెల్లడించారు. చాలామంది మంత్రులు ప్రోటోకాల్ ఎంజాయ్ చేస్తుంటారని, కానీ, కార్యకర్తలా పనిచేసే వ్యక్తి హరీశ్‌రావు అని తెలిపారు. దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ.. సదాశివుడు రాసిన పాటలు దళితుల్లో ఒకటిగా ఉండి రాసినవని అన్నారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ దేవీప్రసాదరావు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అయాచితం శ్రీధర్, మల్లావఝుల సదాశివుడు కుమారుడు విజయానంద్, వారి కుటుంబ సభ్యులు, తెలంగాణ వికాస సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలకు మీరిచ్చే రేటెంత?

- కాంగ్రెస్‌లో చేరేందుకు ఎంతమొత్తం ఇస్తున్నారు?
- కర్ణాటకలో బీజేపీ ప్రలోభ పెడుతున్నదంటున్నారు..
- తెలంగాణలో ఎమ్మెల్యేలకు మీరెంత ఇస్తున్నారు?
- రాహుల్‌గాంధీకి బీఆర్ఎస్ నేత కేటీఆర్ సూటి ప్రశ్న



హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ఇతర పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలను చేర్చుకోవడానికి కాంగ్రెస్ పార్టీ ఎంత ఆఫర్ చేస్తున్నదని ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు ప్రశ్నించారు. ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు మీరు నిర్ణయించిన రేటెంత రాహుల్‌జీ అని ఎక్స్ వేదికగా కేటీఆర్ అడిగారు. కర్ణాటకలో అధికార కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టేందుకు బీజేపీ ఒక్కొక్కరికి రూ.50 కోట్లు ఆఫర్ చేస్తున్నదని ఆ రాష్ట్ర సీఎం సిద్దరామయ్య ఆరోపించిన వార్తను కేటీఆర్ ట్యాగ్ చేశారు. కర్ణాటకలో బీజేపీ 'ఆపరేషన్ కమల'ను అమలు చేస్తున్నదని, అందులో భాగంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలను రాజీనామా చేసి రమ్మంటున్నదని, ఉప ఎన్నికల్లో వారికి నిధులను సమకూరుస్తామని హామీ ఇస్తున్నదని సిద్దరామయ్య ఆరోపించారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకుంటున్న కాంగ్రెస్ పార్టీ ఎంతమొత్తం ముట్టజెప్పున్నదని కేటీఆర్ పరోక్షంగా నిలదీశారు. తెలంగాణలో ఆర్ఆర్ (రేవంత్ రెడ్డి) ట్యాక్స్ కలెక్షన్లు త్రిబుల్ ఆర్, కల్కి2898 సినిమాల కలెక్షన్లు మించిపోయాయి కదా? అంటూ ఎద్దేవా చేశారు.

ఒకటిన జీతాలు ఉత్తదే!

- 13 రోజులైనా మోడల్ స్కూళ్ల టీచర్లకు అందని జీతాలు
- ఔట్‌సోర్సింగ్, హావర్లీ బేస్ట్ టీచర్స్ పరిస్థితి కూడా అంతే..
- ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో గెస్ట్ లెక్చరర్లకు మాట తప్పారు
- వారి ఉద్యోగాల పొడిగింపు జూలై 31 వరకే ఇవ్వడం దుర్మార్గం
- రూ.42 వేల వేతనం చెల్లించాలి
- మాజీమంత్రి హరీశ్‌రావు డిమాండ్

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): ఒకటో తేదీనే ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు చెల్లిస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఆచరణలో మాత్రం అలసత్వం ప్రదర్శిస్తున్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తున్నామనే మాటలు కేవలం పత్రికా ప్రకటనలకు మాత్రమే పరిమితమవుతున్నాయని ఆరోపించారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మోడల్ స్కూల్ టీచర్లకు గత 7 నెలల నుంచి ఏ నెలలో కూడా ఒకటో తేదీన వేతనాలు చెల్లించకపోవడం కాంగ్రెస్ మోసపూరిత వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. ఈ నెలలో 13వ తారీఖు వచ్చినా మోడల్ స్కూల్స్ రెగ్యులర్ టీచర్స్‌కు జీతాలు అందక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ నెల 8వ తేదీన సగం మంది ఉద్యోగులకు మాత్రమే వేతనాలు చెల్లించిన సర్కారు.. రంగారెడ్డి, నిజామాబాద్, వనపర్తి, సూర్యాపేట, సంగారెడ్డి, సిద్దిపేట, సిరిసిల్ల, పెద్దపల్లి వంటి జిల్లాల్లో పనిచేస్తున్న వెయ్యి మందికి పైగా రెగ్యులర్ టీచర్స్‌కి ఇంకా జీతాలు చెల్లించలేదని పేర్కొన్నారు. వీరితో పాటు మోడల్ స్కూల్స్‌లో పనిచేసే ఔట్ సోర్సింగ్, హావర్లీ బేస్ట్ టీచర్స్ (హెచ్‌బీటీ) దాదాపు రెండు వేల మంది ఇంకా జీతాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ఉపాధ్యాయులను గౌరవించి ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

రూ.42 వేల వేతనం ఇవ్వాల్సిందే

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేసే గెస్ట్ లెక్చరర్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పడం బాధాకరమని హరీశ్‌రావు పేర్కొన్నారు. అధికారంలోకి రాగానే 42 వేల రూపాయల వేతనం చెల్లిస్తామని అభయ హస్తం మ్యానిఫెస్టోలో చెప్పిన కాంగ్రెస్ పార్టీ.. వారి ఉద్యోగ భవిష్యత్తును దెబ్బతీసేలా కేవలం మార్చి 31 నుంచి జూలై 31 వరకే కొనసాగింపు ఉత్తర్వులు ఇవ్వడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. ఇందులో ఏప్రిల్, మే నెలల్లో సెలవులే ఉండగా.. కేవలం జూన్, జూలై నెలకు మాత్రమే పొడిగింపు ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం వల్ల పదేండ్లుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న 1,654 మంది గెస్ట్ లెక్చరర్ల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని తెలిపారు. విద్యాసంవత్సరం మధ్యలో ఉద్యోగాలు నిలిపివేస్తే, ఎలా బతికేది అని లెక్చరర్లు, వారి కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయని తెలిపారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి విద్యాసంవత్సరానికి పొడిగింపు ఉత్తర్వులు ఇచ్చిందని గుర్తుచేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నదని తెలిపారు. గెస్ట్ లెక్చరర్ల వ్యవస్థను ఎత్తి వేసేందుకు కుట్ర జరుగుతున్నట్టు వారు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం తక్షణం స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అభయహస్తం మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చినట్టు గెస్ట్ లెక్చరర్లకు భరోసా ఇవ్వడంతో పాటు, నెలకు రూ.42 వేల వేతనం చెల్లించి, విద్యాసంవత్సరం చివరి వరకు ఉద్యోగకాలాన్ని పొడిగించాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన హరీశ్‌రావు డిమాండ్ చేశారు.



హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే సుంకెపల్లి రవిశంకర్, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి

కాజీపేటకు కోచ్‌ఫ్యాక్టరీ ఇవ్వాలి

బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ పెట్టాలి

- ఏపీకి 60 వేల కోట్ల ఆయిల్ రిఫైనరీ ఫ్యాక్టరీకి కేంద్రం లైన్ క్లియర్
- ఆంధ్రప్రదేశ్ ప్రజలు ప్రాంతీయ పార్టీకి ఓటేసి మంచి పనిచేశారు
- తెలంగాణ బీజేపీ ఎంపీలు ఏం చేస్తున్నారు?
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): విభజన చట్టం షెడ్యూల్ 13లో పేర్కొన్నట్టుగా కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ డిమాండ్‌చేశారు. విభజన చట్టంలో పేర్కొన్న విధంగా కేంద్ర ప్రభుత్వం ఏపీలో భారత్ పెట్రోలియం ఆధ్వర్యంలో ఆయిల్ రిఫైనరీ, పెట్రో కెమికల్ హబ్‌ను రూ.60 వేల కోట్లతో ఏర్పాటు చేయనుందని చెప్పారు. చంద్రబాబు విజ్ఞప్తికి కేంద్రం సానుకూలంగా స్పందించిందని, కేంద్ర నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. విభజన చట్టంలో ఉన్న ఆయిల్ రిఫైనరీని పదేండ్ల తర్వాత ఏర్పాటు చేస్తున్నారని గుర్తుచేశారు. శనివారం తెలంగాణభవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఏపీలో బీజేపీకి సొంతంగా సీట్లు వస్తే ఆ రాష్ర్టానికి ఏమీ ఇవ్వకపోయేదని, ఇప్పుడు బీజేపీ సర్కారు టీడీపీపై ఆధారపడి ఉన్నది కాబట్టే మోదీకి విభజనచట్టంలోని అంశాలు గుర్తుకు వస్తున్నాయని, అక్కడ ప్రాంతీయ పార్టీ గెలిచింది కాబట్టే చంద్రబాబు అడిగినవి మోదీ ఇస్తున్నారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు ప్రాంతీయ పార్టీకి ఓటేసి మంచి పని చేశారని పేర్కొన్నారు. 30 ఏండ్లుగా కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ కోసం పోరాటం కొనసాగుతున్నదని, పదేండ్లలో బీఆర్ఎస్ ఎంపీలు, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నిసార్లు అడిగినా తెలంగాణకు కేంద్రం ఏమీ ఇవ్వలేదని గుర్తుచేశారు. తెలంగాణ నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలున్నారని, కేంద్ర క్యాబినెట్ మంత్రి, సహాయ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్నారని, విభజన చట్టంలోని అంశాలపై వారు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. 8 మంది ఎంపీలను గెలిపించినా తెలంగాణ ప్రజలకు బీజేపీ మొండి చేయి చూపిస్తున్నదని విమర్శించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాజకీయాల గురించి తప్ప రాష్ట్ర అభివృద్ధిపై ఒక్క చర్చ కూడా జరగలేదని, విభజన హామీల గురించి ఒక్క మాటా మాట్లాడలేదని మండిపడ్డారు.

కేసీఆర్ కొత్త తరాన్ని తీసుకొస్తారు..

రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, మళ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బ్రహ్మాండమైన మెజార్టీతో గెలిచి అధికారంలోకి వస్తుందని వినోద్‌కుమార్ ధీమా వ్యక్తంచేశారు. నాడు అభివృద్ధి కోసమే బీఆర్ఎస్‌లో చేరామని చెప్పినవాళ్లంతా మళ్లీ అభివృద్ధి కోసమేనంటూ కాంగ్రెస్‌లో చేరారని అలాంటి వాళ్లు పార్టీ మారితే నష్టమేం లేదని స్పష్టంచేశారు. పార్టీలు మారే వారిపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారని, వాళ్లు మళ్లీ బీఆర్ఎస్‌లోకి వస్తామన్నా రానివ్వని చెప్పారు. కేసీఆర్ కొత్త తరాన్ని తీసుకొస్తారని, బీఆర్ఎస్‌ను ప్రజలు ఆదరిస్తారని, త్వరలోనే పార్టీ సమావేశాలు పెట్టుకుంటామని తెలిపారు. మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మాజీ ఎమ్మెల్సీ ఎం శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ లీగల్ సెల్ నాయకుడు కల్యాణ్ రావు పాల్గొన్నారు.



తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతున్న ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు మాజీ సభ్యుడు నక్క యాదగిరి

విద్యుత్తు కాంట్రాక్టర్లకు ని'బంధనాలు'

- స్టోర్స్‌లో అందుబాటులో లేని మెటీరియల్
- ఎల్‌సీలు ఇవ్వకపోవడంతో పెండింగ్‌లో పనులు
- ఇబ్బందులు పడుతున్న ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్లు
- ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు మాజీ సభ్యుడు యాదగిరి

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్తు శాఖలో కొత్తగా తీసుకొచ్చిన నిబంధనలతో విద్యుత్తు కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు మాజీ సభ్యుడు నక్క యాదగిరి తెలిపారు. రాష్ట్రంలో కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై శనివారం హైదరాబాద్‌లో తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రత్యేక సమావేశానికి జీపీ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ విద్యుత్తు శాఖ స్టోర్లలో మెటీరియల్స్ అందుబాటులో ఉండటం లేదని, క్షేత్రస్థాయిలో పనులు చేసినా ఎల్‌సీ(లైన్ క్లియరెన్స్)లు ఇవ్వకపోవడంతో వినియోగదారుల నుంచి తీవ్ర ఒత్తిడి ఉండడంతో కాంట్రాక్టర్లు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. గత ప్రభుత్వంలో ఇలాంటి ఇబ్బందులు తామెప్పుడూ చూడలేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ఎలాంటి సమస్యలు లేకుండా బిల్లులు ఇచ్చేదని చెప్పారు. కాంట్రాక్టర్లుగా మారిన వారంతా నిరుద్యోగులే అయినా ప్రోత్సాహించాల్సింది పోయి నిబంధనల పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న స్టోర్లలో ఒక సామగ్రి ఉంటే, మరొకటి ఉండటం లేదని తెలిపారు. దీని వల్ల కాంట్రాక్టర్లు సకాలంలో పనులను పూర్తి చేయకపోతున్నారని చెప్పారు. ఈ ప్రభుత్వం వచ్చాక ప్రైవేట్ కాంట్రాక్టర్లు విద్యుత్తు పనులను పూర్తి చేయాలంటే ఎల్‌సీ(లైన్ క్లియరెన్స్) అతి పెద్ద సమస్యగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై కాంట్రాక్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నా టీజీఎస్‌పీడీసీఎల్ యాజమాన్యం పట్టించుకోవడం లేదని చెప్పారు. చాలా చోట్ల విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నదని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం కాంట్రాక్టర్ల సమస్యలను గుర్తించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు సభ్యుడు నేమాల దేవేందర్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు అలూరు మహేందర్, ఉపాధ్యక్షుడు ఆర్ ప్రదీప్‌రెడ్డి, జీడిమెట్ల డివిజన్ అధ్యక్షుడు వెంకటరెడ్డి, సికింద్రాబాద్ డివిజన్ జనరల్ సెక్రటరీ అశోక్, కాంట్రాక్టర్లు జీ చక్రధర్‌రావు, వీ చిన్న పుల్లారావు, మాణిక్యాలరావు, రవీందర్‌గౌడ్, కనకాచారి, బాల్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, ఈశ్వర్‌రావు, శ్రీకాంత్, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘం నాయకురాలిపై రౌడీషీట్

- చెన్నూర్, కోటపల్లి స్టేషన్లలో 8 కేసులు నమోదు
- మొదటిసారిగా మంచిర్యాల జిల్లాలో మహిళపై రౌడీషీట్

చెన్నూర్ టౌన్, జూలై 13 : మంచిర్యాల జిల్లాలో పలు భూ వివాదాలతోపాటు ఇతర గొడవల్లో నమోదైన కేసుల్లో నిందితురాలైన ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) నాయకురాలు మద్దెల భవానిపై శనివారం రౌడీ షీట్ తెరిచినట్టు చెన్నూర్ పట్టణ సీఐ రవీందర్ తెలిపారు. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌కు చెందిన మద్దెల భవాని కొన్నేండ్లుగా పలు భూములు, ఇతర వివాదాల్లో తలదూర్చి గొడవలకు పాల్పడుతున్నట్టు పేర్కొన్నారు. ఈ మేరకు ఆమెపై చెన్నూర్ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 7, కోటపల్లి పరిధిలో ఒక కేసులు నమోదైనట్టు వివరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆమెపై రౌడీ షీట్ తెరిచినట్టు పేర్కొన్నారు. ఇప్పటి నుంచి ఆమె కదలికలపై నిత్యం నిఘా ఉంటుందని, ప్రవర్తన మార్చుకోకుండా మళ్లీ భూ వివాదాల్లో తలదూరిస్తే పీడీ యాక్ట్ కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. మంచిర్యాల జిల్లాలో మహిళపై రౌడీ షీట్ ఓపెన్ చేయడం ఇదే మొదటిసారి అని తెలిపారు. కాగా మద్దెల భవానికి ప్రగతి శీల మహిళా సంఘంతో ఎలాంటి సంబంధం లేదని పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ స్పష్టంచేశారు. మహిళల హక్కుల కోసం పోరాడుతున్న తమ సంఘం పేరుతో భవానీ అవినీతి అక్రమ దందాలు చేయడాన్ని ఖండిస్తున్నట్టు ఆమె పేర్కొన్నారు.



సమస్యల పరిష్కారం కోసం సైకిల్ యాత్ర

పారిశుద్ధ్య కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి: వంగపల్లి శ్రీనివాస్

ముషీరాబాద్, జూలై 13: పారిశుద్ధ్య కార్మికుల న్యాయమైన హక్కుల సాధన కోసం రాష్ట్ర వ్యాప్తంగా సైకిల్ యాత్ర చేపట్టనున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ తెలిపారు. గ్రామాలు, నగరాలను పరిశుభ్రంగా ఉంచుతూ స్వచ్ఛ భారత్‌కు కారణమవుతున్న పారిశుద్ధ్య కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. శనివారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో పారిశుద్ధ్య కార్మికుల సేవలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మెచ్చుకున్నా, వారి జీవన విధానం మారడానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

ఉద్యమ నాయకుల కార్ఖానా బీఆర్ఎస్

ప్రజా ఉద్యమం నాయకత్వాన్ని అన్వేషిస్తుంది. నాయకత్వం ఉద్యమాన్ని నిర్మిస్తుంది. ఈ రెండింటికీ పరస్పరపూరకమైన బంధాన్ని తెలంగాణ ఆవిష్కరించింది. దేశంలో తక్కిన రాజకీయ పార్టీలకు లేని ప్రత్యేకత బీఆర్ఎస్ పార్టీకి ఉన్నది. ప్రజా ఆకాంక్షల ఉద్యమాన్ని పార్లమెంటరీ రాజకీయాలకు అనుగుణమైన రీతిలో తీర్చిదిద్ది, తెలంగాణ రాష్ర్టాన్ని సాధించిన పార్టీగా బీఆర్ఎస్‌కంటూ ఒక చరిత్ర ఉన్నది. ఇది ఎవరూ కాదనలేని సత్యం.



నూర శ్రీనివాస్

భారత స్వాతంత్రోద్యమానికి కాంగ్రెస్ పార్టీ నాయకత్వం వహించిందని ఎలా అంటున్నామో..., 1975లో ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా సాగిన ఉద్యమం దేశానికి కొత్త నాయకత్వాన్ని అందించిందని ఎలా చెప్పుకుంటున్నామో.. అలాగే బీఆర్ఎస్ పార్టీ స్థాపన కొత్త నాయకత్వాన్ని ఉత్పత్తి చేసిందని కూడా చెప్పుకోవాలి. తెలంగాణ నేల మీద ఆ మాటకొస్తే ఉమ్మడి రాష్ట్రంలో రెండున్నర దశాబ్దాలుగా బీఆర్ఎస్ పార్టీ ప్రస్తావన లేకుండా, కేసీఆర్ పేరు ఎత్తకుండా రాజకీయాలు చేయలేని వాతావరణం నెలకొన్నది. 2001 నుంచి ఇప్పటిదాకా ఆ పార్టీ గెలిచినా, ఓడినా... అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా... ఉద్యమంలో ఉన్నా, ఉద్యమం స్తబ్దుగా సాగినా... ఏ దశలోనూ ఉమ్మడి రాష్ట్రంలో కేసీఆర్ పేరు లేకుండా రాజకీయాలు సాగని కాలమొకటి సృష్టించబడింది. అలా సృష్టించటం బీఆర్ఎస్‌కు ఒకవైపు అదృష్టం, మరోవైపు దురదృష్టం. అదృష్టం క్షేత్రస్థాయిలో చెప్పుకోదగిన కేడర్ ఉండటే, దురదృష్టం ఇతర పార్టీల నుంచి వచ్చిన నాయకులు ఇప్పుడు ఇతర పార్టీలకు మారటం.

తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగుతున్న క్రమంలో బీఆర్ఎస్ నుంచి గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారు. పార్టీని చీల్చటం ద్వారా ఉద్యమాన్ని చీలగొట్టవచ్చని 2004 ఎన్నికల్లో గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీ చేర్చుకున్నది. అది కుట్రలని తెలంగాణ సమాజం అర్థం చేసుకున్నది. ఇప్పుడు జరుగుతున్న పరిణామాలను అదే కోణంలో తెలంగాణ విశ్లేషించుకుంటున్నది. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ ఉనికే లేకుండా చేసి తద్వారా తమకు అనుకూల రాజకీయాలు చేయటం సాధ్యమా? కాదా? కాలమే నిర్ణయిస్తుంది. అలా కాకుండా ఒక రాజకీయ పార్టీ స్పేస్‌ను మరో రాజకీయ పార్టీ భర్తీచేయాలను కుంటే ఆ పార్టీ అనుసరించి, ఆదరించిన విధానాలను అధ్యగుర్తించినట్టు చేయాలి. అలా చేయటం సాధ్యమా? అంటే చరిత్ర అసాధ్యమనే చెప్తున్నది. కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీని ఒక ఎమోషన్‌తో నిర్మించారు. కేసీఆర్ ఉద్యోగాన్ని, అట్టి ఉద్యమాన్ని ఎట్లా నిర్మించారో... పార్టీని కూడా అట్లాగే నిర్మించారని కేసీఆర్ బద్ధ విరోధులు సైతం అంగీకరించే సత్యం. కాంట్రాక్టు ఇవ్వాళ బీఆర్ఎస్‌ను వీడిన ప్రజాప్రతినిధులు, ఇంకా వీడాలనుకునేవాళ్లు తెలంగాణతో కేసీఆర్‌కు ఉన్న ఉద్వేగాన్ని విడదీయలేరు. ఆ ఉద్వేగ సత్తువ బీఆర్ఎస్‌లోనే ఉన్నదని వారి నిశ్చితాభిప్రాయం. కేసీఆర్ విరోధులు ఈ నిర్ణయానికి రావటానికి ప్రధాన కారణం బీఆర్ఎస్ ఉత్పత్తి చేసిన నాయకత్వం.

> తెలంగాణ నవతరం నాయకత్వాన్ని ఉత్పత్తి చేసిన కర్మాగారంగా కేసీఆర్ బీఆర్ఎస్‌ను తీర్చిదిద్దారు. రాష్ట్ర సాధనే ధ్యేయంగా ఏర్పడిన బీఆర్ఎస్ రాష్ర్టాన్ని సాధించి, తెలంగాణ పునర్నిర్మాణంలో నవతరాన్ని భాగస్వామ్యం చేసింది. ఉద్యమ శక్తులకూ సమ్మిళితం చేసింది. తెలంగాణలో 60 లక్షల మంది సభ్యులున్న పార్టీ బీఆర్ఎస్.

ఈ పార్టీ 'విద్యార్థి' శిక్షణా శిబిరాలు నిర్వహించింది తెలంగాణ ఉద్యమానికి మెరికల్లాంటి నాయకులను ఉత్పత్తి చేసింది. 2001 నుంచి ఇప్పటిదాకా ఎదిగిన ఎంతోమంది నాయకులు స్వరాష్ట్రంలో తమ బుద్ధికుశలతను ప్రదర్శించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, ఈటల రాజేందర్ (ప్రస్తుతం బీజేపీ ఎంపీ) వంటి ఎంతో మంది నాయకులు తమ తమ ప్రతిభాపాటవాలతో తెలంగాణ రాజకీయాలను సుసంపన్నం చేశారు. బాల్క సుమన్, గాదరి కిశోర్ వంటి విద్యార్థి నాయకులు ప్రజాప్రతినిధులుగా తమ ప్రాంతానికి వన్నె తెచ్చారు. ఉద్యమ మార్గాన్ని తమ ఆటపాటలు, అక్షరాసగతో అలరించిన గోరటి వెంకన్న, రసమయి బాలకిషన్, దేశపతి శ్రీనివాస్ వంటి వారెందరినో శాసనసభ్యులుగా చేసిన ఘనత బీఆర్ఎస్‌ది. ఇప్పటిదాకా కొన్నివర్గాలకే రాజకీయ ప్రాతినిధ్యం కల్పించిన కాంగ్రెస్ పార్టీ వ్యూహాన్ని బద్దలు కొడుతూ ఉమ్మడి రాష్ట్రంలో ఎన్టీ రామారావు టీడీపీ ద్వారా కొత్తతరం నాయకత్వాన్ని రాజకీయాల్లోకి ఆహ్వానిస్తే.. అంతకు పది రెట్లు కేసీఆర్ మారుమూల పల్లెలు, పట్టణాల్లోని యువతను నాయకులుగా మలిచి తెలంగాణ ప్రయోజనాల రక్షణ కవచంగా తీర్చిదిద్దారు. ఆ నాయకత్వమే నేడు తెలంగాణ రాజకీయాలను శాసిస్తున్నది. పార్లమెంట్ నుంచి పంచాయతీ దాకా ప్రజా ప్రతినిధులుగా ఎన్నో వేల మందిని పార్టీ శ్రేణులు ఉంచుకోవటం కాపాడుకుంటూ రావడం చాలా సహజమైంది.

భౌగోళిక, ఆర్థిక, సాంస్కృతిక, వారసత్వం, రాజకీయం నుంచి సామాజిక వర్గాల వరకు అనేకానేక అంశాలలో బీఆర్ఎస్ పార్టీ తనను తాను తీర్చిదిద్దుకున్నది. పంచాయతీ నుంచి పార్లమెంట్ దాకా అన్ని స్థాయిల్లో నాయకత్వం తయారైంది. తెలంగాణ విషయంలో మిగతా పార్టీల నాయకులు వ్యవహరిస్తున్న తీరును ప్రశ్నిస్తూ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు వ్యవహరించిన తీరు ఉద్యమానికి సరిపోయే సందర్భాలు రుజువు చేశాయి. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉమ్మడి రాష్ట్ర అసెంబ్లీలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు తమ వాదనా పటిమతో సభను ఉర్రూతలూగించిన సందర్భాలున్నాయి. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఈటల సహా పలువురు నేతలు విషయ జ్ఞానాన్ని చూసి తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ కీర్తించి ఆశీర్వదించిన సందర్భాలనేకం. రాష్ట్ర ఆవిర్భావ అనంతరం బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు ఇటు అసెంబ్లీ, అటు పార్లమెంట్ ఉభయ సభల్లోనూ కాకుండా అనేక అంతర్జాతీయ వేదికలపై తెలంగాణ గౌరవాన్ని ఇనుమడింపజేశారు. రాజకీయ వారసత్వం లేని బీఆర్ఎస్ పార్టీలోని కార్యకర్తలు, నాయకులను ఎదిగిన పార్టీగా తక్కువ కాలంలోనే బీఆర్ఎస్ రికార్డు నెలకొల్పింది.



ఉస్మానియా, కాకతీయ, శాతవాహన, తెలంగాణ సహా వివిధ విశ్వవిద్యాలయాలు కేంద్రంగా సాగిన ఉద్యమంలో విద్యార్థులు కీలక భూమికను పోషించారు. పార్టీ వ్యవస్థాపక సభ్యులుగా ఉన్న బోయినపల్లి వినోద్‌కుమార్, విద్యార్థి నాయకుడు బాల్క సుమన్‌ను పార్లమెంట్‌కు పంపిన చరిత్ర బీఆర్ఎస్‌ది. తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించిన మనుమరి దయాకర్‌ను, తెలంగాణ జాగృతి ద్వారా తెలంగాణ సంస్కృతికి ప్రతీకలైన బతుకమ్మను ప్రపంచవ్యాప్తం చేసిన కల్వకుంట్ల కవితను పార్లమెంట్‌కు పంపిన రికార్డు బీఆర్ఎస్‌ది. పార్టీ ఇండస్ట్రీలో ఉన్న రంజిత్ రెడ్డి (ఇప్పుడు కాంగ్రెస్‌లో), తాత వారసత్వాన్ని పుణికి పుచ్చుకొన్నవాడిగా సూర్యాదిని నింపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి (ప్రస్తుత బీజేపీ ఎంపీ), వైద్యుడిగా ఉండి ఉద్యమంలో పాల్గొన్న బూర నర్సయ్యగౌడ్, ఉద్యోగ సంఘాల నేతగా ఉన్న వెంకటేశ్ నేత, న్యాయవాది మదనమోహన్ రెడ్డి, జోగినపల్లి సంతోష్‌కుమార్, దీవకొండ దామోదర్ రావు, వద్దిరాజు రవిచంద్ర, పార్థసారథిరెడ్డి, బీబీ పాటిల్, ప్రసిద్ధ సీతారాంనాయక్‌ను పార్లమెంట్‌కు పంపింది బీఆర్ఎస్సే.

> ఉద్యమంలో తనతో నడిచిన బీఆర్ఎస్ నాయకులను, ఉద్యమకారులను, బుద్ధిజీవులను కేసీఆర్ తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములను చేశారు. ఇందులో బీఆర్ఎస్ పార్టీతోనే రాజకీయ రంగప్రవేశం చేసినవారు, వివిధ ప్రజా ఉద్యమాలు, ఉద్యోగ ఉద్యమాలతో సంబంధం ఉన్నవారెందరికో కేసీఆర్ అవకాశాలు కల్పించారు.

వారిలో మంత్రులుగా కేటీఆర్, హరీశ్‌రావు, ఈటల రాజేందర్, కొప్పుల ఈశ్వర్, జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, పద్మారావుగౌడ్, నిరంజన్‌రెడ్డి, ప్రజాప్రతినిధులుగా పెద్ది సుదర్శన్‌రెడ్డి, దాస్యం వినయ్‌భాస్కర్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, గొంగిడి సునీత, మత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, గాదరి కిశోర్, రసమయి బాలకిషన్, చంటి క్రాంతికిరణ్, డాక్టర్ ఆనంద్, దివాకర్ రావు, కాపు సహా ఎందరో... డాక్టర్ మెతుకు ఆనంద్, ఆరూరి రమేశ్, నోముల భగత్, డాక్టర్ సంజయ్, కోవా లక్ష్మి, బోడిగె శోభ, నల్లాల ఓదేలు, వేముల వీరేశం, నన్నపునేని నరేందర్, శంకర్‌నాయక్, పైలెట్ రోహిత్ రెడ్డి, మధు జనార్దన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి ఇలా ఎంతోమంది యువతీ యువకులు చట్టసభల్లో తమ వాణిని వినిపించారు.

ఇక తెలంగాణ ఉద్యోగ సంఘాల నుంచి ఎదిగిన స్వామిగౌడ్ మండలి చైర్మన్, శ్రీనివాస్‌గౌడ్ మంత్రిగా పనిచేశారు. ఎమ్మెల్సీలుగా ఆర్ సత్యనారాయణ, నారదాసు లక్ష్మణ్‌రావు, గోరటి వెంకన్న, దేశపతి శ్రీనివాస్, సురభి వాణిదేవి (పీవీ కుమార్తె), పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, నవీన్‌కుమార్, కుర్మయ్యగారి నవీన్, ఎమ్మెల్సీలుగా, గ్యాదరి బాలమల్లు, ఆంజనేయగౌడ్, రాజారాం యాదవ్, ఆమీర్, మీర్ ఇనాయత్ అలీ, మందుల సామేలు, నారాయణ వెంకటేశ్వర్‌రావు, వివేకానంద, మేడే రాజీవ్‌సాగర్, తాడూరి శ్రీనివాస్, పిడమర్తి రవి, ఎర్రోళ్ల శ్రీనివాస్, దేవీప్రసాద్, గాండ్రనాయక్, వాల్యా నాయక్, కుడుతల సతీష్, మఠం భిక్షపతి, మన్నె క్రిశాంక్, వాసుదేవ రెడ్డి, ఇంతియాజ్ అహ్మద్, జోగి ఇలా ఎంతోమంది రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్లుగా బీఆర్ఎస్ పార్టీ నుంచి ఉత్పత్తి అయిన నైపుణ్య వీరితోపాటు జీహెచ్ఎంసీ మేయర్, డిప్యూటీ మేయర్లుగా బొంతు రామ్మోహన్, బాబా ఫసియుద్దీన్ సహా వేలాది మందిని స్థానిక సంస్థల ప్రతినిధులుగా ఎదిగేలా చేసిన ఘనత బీఆర్ఎస్ పార్టీ. అలాగే జర్నలిజం నుంచి కుసుమ జగదీశ్, పాశం సంపత్‌రెడ్డి సహా జర్నలిస్టులుగా, నర్సింహా సంఘ చైర్మన్లుగా, మన్నె వివిధ స్థాయిల్లో చాలామంది వ్యవహరించారు.

ఉద్యమకారులను అక్కున చేర్చుకోలేదు. అవకాశాలు ఇవ్వలేదు. పాలనలో భాగస్వామ్యం చేయలేదనే ఆరోపణ పూర్తిగా సత్యం కాదని వివేకంతో కేసీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ పాలన స్పష్టం చేస్తున్నది. తెలంగాణ ఉద్యమంలో తనతో మమేకమైన అనేకమంది మేధావులు, బుద్ధిజీవులు సేవలను కేసీఆర్ వినియోగించుకున్నారు. ఉద్యమ, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, మీడియా వర్గాల నుంచి ఎదిగివచ్చిన అనేకమంది వారి వారి ఆలోచనలను, అనుభవాలను అనుగుణంగా ఆయా రంగాల్లో సేవలందించారు. వారి సేవలకు బీఆర్ఎస్ పార్టీ తగిన గుర్తింపును, గౌరవాన్ని ఇవ్వటం తెలిసిందే. టీఎస్‌పీఎస్సీ తొలి చైర్మన్‌గా ఘంటా చక్రపాణి, టీఎస్ కమిషన్ తొలి, మలి కమిషన్ చైర్మన్లుగా బీఎస్ రాములు, వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా అల్లం నారాయణ, సాహిత్య అకాడమీ చైర్మన్లుగా నందిని సిధారెడ్డి, జూలూరు గౌరీశంకర్, వి.ప్రకాశ్, ఆయాచితం శ్రీధర్, దుంకలా అశోక్, దేవులపల్లి ప్రభాకర్‌రావు, సమాచార హక్కు కమిషనర్లుగా బుద్దా మురళి, కట్టా శేఖర్‌రెడ్డి, నారాయణరెడ్డి సహా ఎంతోమంది బీఆర్ఎస్ సర్కార్‌లో భాగమయ్యారు.

ఉపసంహారం... గతం గుణకీర్తి అని చెప్పుకొని మురిసిపోతూ.. కష్టకాలం వర్తమానం అని మనసుకు సర్దిచెప్పుకోవటం కాకుండా క్షేత్రం నుంచి బలమైన పునాది నిర్మించుకోవాల్సి ఉన్నది. తెలంగాణ పేగు బంధాన్ని తిరిగి పునర్ నిర్మించుకోవలసి ఉన్నది. తనను తాను తప్పు తల్లి వేరును కనుగొనవలసి ఉన్నది.

కొలువు కొట్టేసి, నిరుద్యోగులను నెట్టేసి..

నిరుద్యోగుల పోరాట పునాదుల మీద ముఖ్యమంత్రి కొలువును కొట్టేసిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు అదే నిరుద్యోగుల కన్నీటి ఆవేదనను కనీసం అర్థం చేసుకోవడం లేదు. హైదరాబాద్ యూత్ డిక్లరేషన్‌లో ప్రకటించిన ఐదు అంశాలలో కూడిన 17 హామీల్లో ఇప్పటి వరకు ఒక్కటి కూడా నెరవేర్చలేదు. అంతేకాదు, అమావాస్య అర్ధరాత్రి ఆడుగుడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకోవడమే కాకుండా, ఏడు నెలల్లో సుమారు 17 సార్లు హస్తినకు వెళ్లిన రేవంత్.. నిరుద్యోగుల గోసను వినేందుకు కనీసం ఒక అరగంట సమయం లేకపోవటం శోచనీయం.



నరేష్ పాపట్ల
95054 75431

అధికారమే పరమావధిగా హైదరాబాద్ యూత్ డిక్లరేషన్‌ను ప్రకటించిన కాంగ్రెస్ రాష్ట్రంలో తొలిసారిగా అధికార పీఠమెక్కింది. ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన రేవంత్ నిరుద్యోగుల హామీలను అధిలోనే అటకెక్కించారు. 'ఏరు దాటిన తర్వాత తెప్ప తగలేసిన' చందంగా ప్రభుత్వం వ్యవహరిస్తుండటంతో నిరుద్యోగ యువత తీవ్ర ఆగ్రహానికి గురవుతున్నది. ఏడు నెలలుగా పాలకుల నిర్లక్ష్య వైఖరి పెరుగుతుండటంతో... మన్నులుగుతున్న ప్రశ్నలతో కుర్చీ పట్టేసిన నిరుద్యోగులు రోడ్డెక్కి ఎదురేయిల చందంగా కదులుతున్నారు. వారి న్యాయమైన డిమాండ్లపై స్పందించకపోతే మంటేబడి తెలిపేటోళ్లు ప్రభుత్వాన్ని ముట్టుముడికావాని హెచ్చరిస్తున్నారు.

సరూర్‌నగర్‌లో గతేడాది మేలో జరిగిన సభలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ స్వయంగా హైదరాబాద్ యూత్ డిక్లరేషన్‌ను ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగులకు నెలకు రూ.4 వేల భృతి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, తొలి, మలి ఉద్యమ అమరుల కుటుంబాలకు నెలకు రూ.25 వేల పింఛన్, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, 18 ఏండ్లు నిండిన విద్యార్థినులకు ఉచితంగా ఎలక్ట్రిక్ స్కూటర్ల పంపిణీ వంటి హామీలను గుప్పించారు. ఆ తర్వాత నవంబర్‌లో అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఏకంగా ఊరేగింపు నిర్వహించి అశోక్‌నగర్‌లోని సిటీ సెంట్రల్ లైబ్రరీని సందర్శించి నిరుద్యోగులతో భేటీ అయ్యారు. 2 లక్షల ఉద్యోగాల భర్తీపై ఆయన కూడా బహిరంగంగా హామీ ఇచ్చారు. ఈ హామీలను నమ్మిన నిరుద్యోగులు గత ప్రభుత్వ మార్పులో కీలక భూమిక పోషించారు. తీరా అధికారంలోకి వచ్చాక 'ప్రజా పాలన' అంటూ బీరాలు పలుకుతున్న ముఖ్యమంత్రి రేవంత్ వ్యవహారశైలితో క్రమంగా 'మాట్లు' కనిపిస్తున్నది. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఇటు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. రాబడిక భోరతితో యువతను మరోమారు దగా చేస్తున్నారు.

జాబ్ క్యాలెండర్ రూపకల్పనలో ఎందుకింత అలసత్వం? రెండు రోజుల వ్యవధిలో డీఎస్సీ అభ్యర్థులు గ్రూప్-2 పరీక్షను ఎలా రాయగలరు? ప్రభుత్వ ఉద్యోగాలు ఆదికారిగా ఉండలేదు. కనీసం రెండు నెలల సమయం ఉండాలన్న న్యాయమైన అభ్యర్థనను పట్టించుకోవడం లేదు. అంతేకాదు, గ్రూప్-2లో రెండు వేలు, గ్రూప్-3లో మూడు వేల పోస్టులు పెంచుతామని మాట ఇచ్చి, ఇప్పుడు మాట మార్చారు. జీవో 46 బాధితుల మొర ఆలకించడం లేదు. గురుకుల ఉద్యోగుల నియామక ప్రక్రియ ఆలస్యం కారణంగా వారికి ఆ పట్టని ఉద్యోగాల పోస్టులు అలాగే ఉండిపోయాయి. ఇప్పటి వరకు వారికి న్యాయం చేయలేదు. దీంతో ఆ పోస్టులు తిరుగుబాటు అయ్యాయి. కానీ, పక్కదోవ పట్టించడంలో ఎక్కువ ప్రభుత్వం సాకులు చెప్ప కాలయాపన చేస్తున్నది. ఈ నేపథ్యంలో పుట్టలుగొండ నిరుద్యోగులు మూగబోయారు. ప్రొఫెసర్ కోదండరాం రెడ్డి గద్దర్ పాటలతో తీవ్రంగా తగ్గించి, ఉద్యమకారుల వెంట ఉద్యమించిన అశోక్‌నగర్ నిరుద్యోగులు వ్యక్తం చేస్తున్నది. వివిధ యువజన సంఘాలు సైతం నిరుద్యోగుల కోసం పోరాడటానికి సిద్ధమయ్యారు.



> నాడు మహిళలకు న్యాయం చేసే 'హిందూ కోడ్ బిల్లు విషయంలో జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ ఏకంగా కేంద్ర మంత్రి పదవికి అంబేద్కర్ రాజీనామా చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు హామీని మరుగున పడేసే కుట్రలను యూపీఏ ప్రభుత్వం తెరలేపిందని తన పదవికి, నాడు కేంద్ర మంత్రి పదవికి కేసీఆర్ రాజీనామా చేశారు. కోట్లాది ప్రజల పొదు దశాబ్దాల ఆకాంక్షకు అండగా నిలిచారు.

చీదరవర్గాల తరఫున పోరాడే ఓయూ విద్యార్థుల ఆత్మగౌరవం దెబ్బతీసేలా గతంలో రేవంత్ మాట్లాడినప్పుడే ఆయనను నిలువరించాల్సింది. అలా చేయకపోవడం వల్ల ఆయన ఇప్పుడు ఓయూ గడ్డపై పోలీసులతో కవాతు చేయిస్తున్నారు. అన్యాయాన్ని ఎదిరించిన వారిని నిర్బంధిస్తున్నారు. ఆకారో మనకు నవుతు.. అర్థరాత్రితో అక్రమ అరెస్టులు చేస్తున్న నిరుద్యోగులను కించపరుస్తున్న అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఇప్పటికైనా ఆక్షణ విరుగుడు చేయటంలేదు.

ఆ సందర్భం ఈతరం కండ్లముందే చరిత్రగా నిలిచింది. తెలంగాణ ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని నిరుద్యోగులు చేస్తున్న పోరాటం న్యాయమైనది. అందుకే బుద్ధిజీవులు, ఉద్యమకారులు, ప్రజా గొంతుకలు వారికి అండగా నిలవాలి.



ప్రపంచవ్యాప్తంగా కమ్యూనికేషన్ వ్యవస్థలో సెల్‌ఫోన్ల ఆగమనం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. దీనికి మన దేశమేమీ మినహాయింపు కాదు. సెల్‌ఫోన్లు అనేక ప్రయోజనాలను అందిస్తున్నప్పటికీ, బాల్యంపై పడుతున్న వాటి ప్రభావం ఆందోళన కలిగిస్తున్నది.

చరవాణి చెరలో బాల్యం



డాక్టర్ కొల్లు శ్రీనివాస్
80089 44045

ఫోన్లకు సంబంధించిన అతిపెద్ద మార్కెట్లలో మన దేశం కూడా ఒకటి. నానాటికీ పెరుగుతున్న యువ జనాభా అందుకు కారణం. టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) ప్రకారం.. దేశంలో 2023 నాటికి 100 కోట్లకు పైగా ఫోన్ వినియోగదారులు ఉన్నారు. వీరిలో అత్యధికులు యువకులే. ఇంటర్నెట్, మొబైల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఐఏఎంఏఐ) 2022లో నిర్వహించిన సర్వే ప్రకారం.. దేశంలోని ఇంటర్నెట్ వినియోగదారుల్లో 40 శాతం మంది 12-29 ఏండ్ల మధ్య వయస్సువారే. ఇక పిల్లలు, యుక్తవయస్కులలో మొబైల్ ఫోన్ల వాడకాన్ని నొక్కి చెప్తున్నది. నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ (ఎన్‌సీపీసీఆర్) 2023 నాటి సర్వే ప్రకారం.. పట్టణాలకు చెందిన తక్కువ వయసున్న పాఠశాల పిల్లల్లో 42.9 శాతం మంది సోషల్ మీడియా ఖాతాలను కలిగి ఉన్నారు. 79 శాతం మంది రోజులో కనీసం రెండు గంటలు ఫోన్లలో గడుపుతున్నారు. అంతే కాదు, 62.6 శాతం మంది తమ తల్లిదండ్రుల ఫోన్లను ఉపయోగిస్తుండగా.. 30.2 శాతం మంది ఇంటర్నెట్ ఆధారిత సొంత ఫోన్లను ఉపయోగిస్తున్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్ వంటి మాధ్యమాల్లో చాటింగ్ చేయడానికి 52.9 శాతం మంది పిల్లలు స్మార్ట్‌ఫోన్ వీరర్లను ఉపయోగిస్తున్నారని సర్వేలో తేలింది.

సెల్‌ఫోన్ల వినియోగం అనేది ముఖ్యంగా విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. వివిధ ఆన్‌లైన్ విద్యా వనరులను అందుబాటులోకి తీసుకొచ్చాయి. అలాగే పట్టణ, గ్రామీణ విద్య మధ్య అంతరాన్ని తగ్గించాయి. మరీ ముఖ్యంగా కొవిడ్ సమయంలో అన్ని పాఠశాలలు, శిక్షణ కేంద్రాలు ఆన్‌లైన్ బోధనకు మారడంతో ప్రతి ఒక్కరికి ఫోన్ అనివార్యమైంది. 2021లో యూనిసెఫ్ జరిపిన ఒక అధ్యయనం ప్రకారం.. దేశంలోని 67 శాతం మంది పిల్లలు లాక్‌డౌన్ సమయంలో ఆన్‌లైన్ లెర్నింగ్ కోసం మొబైల్ పరికరాలను ఉపయోగించారు.

విద్యాపరమైన ప్రయోజనాలు ఉన్నప్పటికీ ఫోన్‌ను అతిగా వాడటం వల్ల పిల్లల్లో అనేక మానసిక సమస్యలు వస్తున్నాయి. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరోసైన్సెస్ 2020లో నిర్వహించిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. సోషల్ మీడియా, గేమింగ్ యాప్‌లకు వ్యసనపరులు అవుతున్న పిల్లలు ఆందోళన, కుంగుబాటు, నిద్రలేమి వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. కంటి అలసట, నిద్రలేమి వంటి సమస్యలు సర్వసాధారణంగా మారాయి. శారీరక, మానసిక దుష్ప్రభావాలతో పాటు సామాజిక అభివృద్ధిని కూడా ఫోన్లు ప్రభావితం చేస్తున్నాయి. ఒంటరితనానికి అలవాటు పడి సామాజిక నైపుణ్యాలను కోల్పోతుండటం ఆందోళనకరం. ఈ తరహా మార్పులు భావితరాల అభివృద్ధిని నిరోధించగా మారే ప్రమాదం లేకపోలేదు.

> తల్లిదండ్రులు కూడా దీని గురించి ఆందోళన చెందుతున్నారు. కొంతమంది తల్లిదండ్రులు సమయపాలనను సంబంధించి కొన్ని నిబంధనలు విధిస్తున్నప్పటికీ, వాటిని అమలు చేయడం సవాలుగా మారుతున్నది. బాలలను ఆన్‌లైన్‌లో అభ్యసన మాటున అశ్లీలం వీక్షించి, బంగారు భవితను అదిలోనే సమాధి చేసుకుంటున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నది.

ఈ వ్యసనానికి అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులతో పాటు సమాజంపై ఉన్నది. అందుకు పిల్లల విద్య వేళలతో రోజు 2 గంటలకు మించి ఫోన్లు వాడకుండా చూడాలి. దాంతో పాటు పిల్లలు ఆటలో నిమగ్నమయ్యేలా చేయడం ద్వారా వారిని యాంత్రిక జీవిత విధానం నుంచి బయటకు తీసుకురావచ్చు. ఆటల ద్వారా వారిలో మానసిక సౌకర్యాలను కలిగించవచ్చు.

సవాల్‌గా మారుతున్న ఈ సమస్యను పరిష్కరించడానికి తల్లిదండ్రులు, విద్యావేత్తలు, ఆరోగ్య సంరక్షణ నిపుణులు, విధాన రూపకర్తలతో కూడిన బహుముఖ విధానం అవసరం. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమతుల్యంగా, బాధ్యతాయుతంగా ఉపయోగించడాన్ని ప్రోత్సహించడం ద్వారా పిల్లల అభ్యున్నతిపై ప్రతికూల ప్రభావాలను తగ్గించవచ్చు. డిజిటల్ యుగంలో అభివృద్ధి చెందడానికి దేశంలో పోటీ పడటంతో పాటు యువ జనాభా ఆరోగ్యం, శ్రేయస్సు, సమగ్రాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడం కూడా తప్పనిసరి.

మనీ పవర్‌కు, పీపుల్ పవర్‌కు మధ్య పోరు!



మహారాష్ట్రలో ఎమ్మెల్సీ ఎన్నికల పోరు మనీ పవర్‌కు, పీపుల్ పవర్‌కు మధ్య జరిగాయి. చిన్న పార్టీల ఎమ్మెల్యేలు, స్వతంత్ర ఎమ్మెల్యేల రేట్ స్కామ్‌ను గ్రైటిలా చూసుకుపోయింది. ఒక్కో ఎమ్మెల్యేకు రూ.20 కోట్ల నుంచి రూ.25 కోట్ల వరకు ముట్టజెప్పారు. కొంతమందికి రెండెకరాల భూమి కూడా ఇచ్చారు.

- సంజయ్‌రౌత్, శివసేన (యూబీటీ) నేత



గంజాయి పొగకు దాడుల సెగ!

తమిళనాడు ఘటనతో రంగంలోకి రాష్ట్ర ఆబ్కారీ శాఖ

- పెరుగుతున్న కేసులు.. అదుపులోకి తెచ్చేందుకు యత్నాలు
- ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులతో కొంతమేర తగ్గుముఖం
- 500 డ్రగ్స్ కేసుల్లో 2,680 కిలోల గంజాయి స్వాధీనం

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోకి దొడ్డిదారిలో డ్రగ్స్ చొరబడుతున్నాయి. మారుమూల గ్రామాల్లోనూ గంజాయి పాతుకుపోతున్నది. దీనికితోడు తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో గుడుంబా వాసన మళ్లీ గుప్పుమంటున్నది. ఇటీవల తమిళనాడులో కల్తీసారా తాగి 50 మంది వరకు చనిపోయారు. దీంతో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ రంగంలోకి దిగింది. డ్రగ్స్, సారా రహిత తెలంగాణ కోసం నిఘా మరింత పెంచింది. ఎక్కడికక్కడ ముమ్మర దాడులు చేస్తున్నది. క్షేత్రస్థాయి నుంచి సమాచార వ్యవస్థను పటిష్టం చేస్తూ డ్రగ్స్, సారా విక్రేతలను గుర్తించి కేసులు నమోదు చేస్తున్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగం జరుగుతున్నా, నాటు సారా తయారీ జరుగుతున్నా సమాచారం తెలుసుకోగలుగుతున్నారు. పట్టుబడిన మాదకద్రవ్యాలు, నాటు సారా తయారీదారులపై ఉక్కుపాదం మోపుతున్నారు.



తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి

గంజాయి బ్యాచ్‌లపై నిఘా

పట్టణ, పల్లెల్లోని యువతను గంజాయి నిర్వీర్యం చేస్తున్నది. రాష్ట్రంలో ఏ గ్రామంలో చూసినా ఇప్పుడు ఐదారు గంజాయి బ్యాచ్‌లు దర్శనమిస్తున్నాయి. వీటిపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంటర్, డిగ్రీ విద్యార్థులే గంజాయికి అలవాటు పడుతుండటం ఆందోళన కలిగించే అంశం. దీంతో ఎక్సైజ్‌శాఖ గ్రామాల్లో సైతం గంజాయి బ్యాచ్‌లపై నిఘా పెట్టింది. కేవలం ఆరు నెలల్లో సుమారు 2,680 కిలోల గంజాయి, 92 కిలోల గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నది. 440 గంజాయి మొక్కలు ధ్వంసం చేసింది. 2 కిలోల హాష్‌ఫ్ ఆయిల్, కేజీన్నర గంజాయి లిక్విడ్, 117 గ్రాముల చరాస్, 1,236 కేజీల పప్పీస్ట్రా, 6 కేజీల ఓపీఎం, 101 కేజీల ఎంఎంఏ, 348 గ్రాముల ఎండీఎంఏ, 37 ఎల్‌ఎస్‌డీ బ్లాట్స్, 10 కేజీల ఆల్ప్రాజోలం, 10 కేజీల ఆల్ప్రాజోలం ట్యాబ్లెట్లను అధికారులు పట్టుకున్నారు. మొత్తం 500 కేసులు నమోదు చేసి, 725 మందిని అదుపులోకి తీసుకున్నారు.

మత్తు మహమ్మారిని పారదోలుదాం



ఎక్సైజ్‌శాఖ చేపడుతున్న వినూత్న కార్యక్రమాలతో ప్రజల్లో అవగాహన పెరిగింది. వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మాదకద్రవ్యాల అక్రమ రవాణా, సారాతయారీపై సమాచారం ఇస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచనల మేరకు పోలీసులు, ఎక్సైజ్ సిబ్బంది సమన్వయంతో అన్ని గ్రామాల్లో డ్రగ్స్ నిర్మూలన కమిటీలు ఏర్పాటు చేయాలనుకుంటున్నాం. సమాచారం ఇచ్చేవారి సంఖ్య మరింత పెరగాలి. అప్పుడే డ్రగ్స్, సారా, మత్తు రహిత తెలంగాణను చూడగలం. ఎక్సైజ్‌శాఖ మాదకద్రవ్యాల వినియోగాన్ని, అక్రమ రవాణాను అరికట్టేందుకు దృఢనిశ్చయంతో ఉన్నది. అందరం కలిసి మత్తు మహమ్మారిని పారదోలుదాం.

– వీబీ కమలాసన్‌రెడ్డి, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్

సాంకేతికత వినియోగంతో పెరిగిన అరెస్టులు

మాదక ద్రవ్యాల అక్రమ రవాణా అడ్డుకట్టకు ఎక్సైజ్ శాఖ సాంకేతికతను ఉపయోగించుకుంటున్నది. అక్రమ రవాణా దారుల ఆచూకీ తెలుసుకొని, వారిని అరెస్టు చేస్తున్నది. దీంతో మాదకద్రవ్యాల అక్రమ రవాణాదారులు, నాటు సారా తయారీదారులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. వచ్చే ఆగస్టు నాటికి రాష్ట్రం నుంచి సారా మహమ్మారిని పారదోలాలన్న లక్ష్యంతో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నది. ఆసిఫాబాద్, నిర్మల్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట, నల్లగొండ, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని మారుమూల ప్రాంతాల్లో చాటుమాటుగా తయారు చేస్తున్న వ్యక్తులపై నిఘా పెట్టింది. ఈ ఏడాది మే నాటికి 12,734 నాటుసారా కేసులు నమోదు కాగా, 5,398 మంది తయారీదారులను అరెస్ట్ చేసింది.

ఆ పింఛన్ వాపస్ ఇవ్వాల్సిందే

> మొదటిపేజీ తరువాయి...

నాటికి 1,826 మందికి రికవరీ నోటీసులు జారీ చేసినట్టు ప్రభుత్వమే అధికారికంగా ప్రకటించింది. పింఛన్లు తొలగించనున్న 1,826 మంది జాబితాను ఇప్పటికే రాష్ట్రస్థాయి అధికారులు జిల్లాలకు పంపించారు. ఇప్పటివరకు పొందిన పింఛన్ మొత్తాన్ని తిరిగి ప్రభుత్వానికి చెల్లించాలని, లేదంటే ప్రభుత్వ పథకాలన్నింటినీ నిలిపివేస్తామని అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. దీంతో పూట గడవడమే కష్టంగా ఉన్న తాము ఈ వయస్సులో డబ్బులు తిరిగి ఎలా చెల్లించగలమని నోటీసులు అందుకున్న వృద్ధులు లబోదిబోమంటున్నారు. ఎవరికైనా నిబంధనలకు విరుద్ధంగా రెండేసి పింఛన్లు వస్తున్నట్టయితే వాటిని గుర్తించి నిలిపివేయాల్సిన అధికారులు ఇన్నాళ్లు నిర్లక్ష్యంగా వ్యవహరించి, ఇప్పుడు హఠాత్తుగా నోటీసులు జారీ చేయడం ఏమిటని సామాజికవేత్తలు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి వాటికి అధికారుల పొరపాటు, నిర్లక్ష్యం కారణమని, మొదట వారిపై చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

రెండు పింఛన్లు ఇవ్వం : మంత్రి సీతక్క

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం మున్సిపాలిటీకి చెందిన దాసరి మల్లమ్మకు 2014 నుంచి ఆసరా పింఛన్ అందుతున్నది. అయితే, ఆమె కూతురు డీ రాజేశ్వరి వైద్య ఆరోగ్యశాఖలో ఏఎన్ఎంగా పనిచేస్తూ మరణించడంతో మల్లమ్మకు ఫ్యామిలీ పెన్షన్ కింద నెలకు రూ.24,073 వస్తున్న దని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకే వ్యక్తి రెండు రకాల పెన్షన్లు తీసుకోవడానికి నిబంధనలు అంగీకరించవని స్పష్టంచేశారు. రాష్ట్రవ్యాప్తంగా వృద్ధాప్య, ఫ్యామిలీ పెన్షన్ రెండింటినీ 1,826 మంది పొందుతున్నట్టు ట్రెజరీ శాఖ ఈ మధ్యనే గుర్తించి వారందరికీ రికవరీ నోటీసులు అందజేసిందని తెలిపారు. ప్రభుత్వం మీద బురద చల్లడమే పనిగా పెట్టుకున్న కొందరు ప్రభుత్వానికి దురుద్దేశాలను ఆపాదిస్తూ తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి సీతక్క ఆరోపించారు. తమ ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచిస్తున్నదని, అర్హులందరికీ పెన్షన్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. అందులో భాగంగానే లీకేజీలను అరికట్టడంతోపాటు ఎప్పటికప్పుడు లబ్ధిదారుల జాబితాను అప్‌డేట్ చేస్తున్నట్టు వెల్లడించారు.

మంచానపడిన మల్లమ్మ

- కేటీఆర్ ట్వీట్‌తో మల్లమ్మ ఇంటికి అధికారులు

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 13 (నమస్తే తెలంగాణ): 'పింఛన్ల రికవరీ' పేరుతో 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురించడం, దానిపై స్పందించి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్వీట్ చేసిన నేపథ్యంలో అధికార యంత్రాంగంలో కదలిక మొదలైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధికారులు దాసరి మల్లమ్మ పరిస్థితిపై విచారణ జరిపారు. జిల్లా కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ ఆదేశాల మేరకు ఆదనపు డీఆర్‌డీవో రంగారావు సిబ్బందితో మల్లమ్మ ఇంటికి వెళ్లి విచారణ చేపట్టారు. అసలు మల్లమ్మ ఎందేస్తున్నది? ఆమెకు అండగా ఎవరున్నారు? వారి కుటుంబ పరిస్థితి ఏమిటి? అని ఆరా తీశారు. మల్లమ్మ మంచాన ఉండటం గమనించారు. ఉలుకూపలుకూ లేని పరిస్థితిని పరిశీలించి నివేదిక తయారుచేశారు. పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్టు డీఆర్‌డీవో విద్యాచందన 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. వాస్తవంగా తన కూతురు ఉద్యోగు చేసి మరణించడంతో మల్లమ్మకు ఫ్యామిలీ పెన్షన్ వస్తున్నది. ఇలాంటి కేసులు జిల్లాలో 200 వరకూ ఉన్నట్టు అంచనా. మల్లమ్మ ఏడాది క్రితం పక్షవాతంతో దవాఖానలో చేరడంతో వైద్యానికి రూ.2 లక్షల వరకు ఖర్చు అయిందని, దీనికి నెలనెలా పరీక్షలు చేయించుకోవడంతో గతంలో వచ్చిన పింఛన్ పూర్తిగా ఖర్చు అయిపోయిందని కుటుంబసభ్యులు చెప్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆసరా పింఛన్ మందులకే సరిపోతున్నదని వాపోతున్నారు. పక్షవాతం, చెవుడు, వయోభారంతో బాధపడుతున్న మల్లమ్మకు రికవరీ నోటీసులు జారీ చేయడంతో కుటుంబసభ్యులు ఆవేదన చెందుతున్నారు.



మంచంలో కదలలేని స్థితిలో ఉన్న మల్లమ్మ

పింఛన్ రికవరీ దుర్మార్గపు చర్య



రాష్ట్రంలో వృద్ధులకు ఇచ్చిన పింఛన్ పైసలను రేవంత్‌రెడ్డి సర్కార్ తిరిగి రికవరీ చేయాలనుకోవడం దుర్మార్గపు చర్య. కొత్తగూడెం మున్సిపాలిటీలో 42 మందికి ఇచ్చిన నోటీసులను వెంటనే వెనక్కి తీసుకోవాలి. నోటీసు అందించిన ఏడురోజుల్లో తీసుకున్న పింఛన్ మొత్తం చెల్లించకపోతే ప్రభుత్వం నుంచి పొందుతున్న అన్నిరకాల లబ్ధిని నిలిపివేస్తామని ఆదేశాలు జారీ చేయడం నిరంకుశ పాలనకు నిదర్శనం.

–కాపు సీతాలక్ష్మి, కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్

'ఫీజు రీయింబర్స్‌మెంట్' పాయే!

- బకాయిలు వన్‌టైం సెటిల్మెంట్..
- తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన
- మంత్రి దుద్దిళ్లకు బాధ్యత అప్పగింత
- నిరుపేద విద్యార్థులపై పెనుభారం
- ఉన్నతవిద్యకు దూరమయ్యే ప్రమాదం
- ఫీజుల కోసం విద్యార్థులపై ఇప్పటికే కాలేజీ యాజమాన్యాల ఒత్తిడి
- సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధింపులు

హైదరాబాద్, జూలై13 (నమస్తే తెలంగాణ) : 'ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈడబ్ల్యూఎస్ వర్గాల విద్యార్థులందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్‌తోపాటు పాత బకాయిలు పూర్తిగా చెల్లిస్తం'.. ఇది ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ చేసిన వాగ్దానం. కానీ, ఇప్పుడు ఆర్థిక భారం సాకుతో బకాయిల చెల్లింపునకు ఎగనామం పెట్టాలని నిర్ణయించింది. పూర్తి బకాయిలు ఇవ్వకుండా వన్ టైం సెటిల్‌మెంట్ కింద కాలేజీ యాజమాన్యాలకు ఎంతోకొంత ముట్టజెప్పేందుకు సిద్ధమైంది. ఈ విషయాన్ని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డియే జేఎన్‌టీయూ వేదికగా శనివారం ప్రకటించారు. వన్‌టైం సెటిల్‌మెంట్ బాధ్యతను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు అప్పగిస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వ నిర్ణయం యాజమాన్యాల సంగతేమోగానీ పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు శాపంగా మారనున్నదనే ఆందోళన వ్యక్తమవుతున్నది. వీరు ఉన్నతవిద్యకు దూరమయ్యే ప్రమాదం ఏర్పడుతుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్న బీసీ, విద్యార్థి సంఘాలు తాజాగా సీఎం చేసిన ప్రకటనపై మండిపడుతున్నాయి.



దాదాపు 7వేల కోట్ల బకాయిలు

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను మూడు నెలలకోసారి వాయిదాల పద్ధతిలో చెల్లించేలా ప్రభుత్వం గతంలో మార్గదర్శకాలు తీసుకొచ్చింది. దాని ప్రకారం విద్యా సంవత్సరం ప్రారంభంలో 25శాతం, మధ్యలో 50శాతం, చివర్లో మరో25 శాతం చెల్లించాల్సి ఉంటుంది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విధానాన్ని పాటించడం లేదు. బకాయిల చెల్లింపుల కోసం కళాశాలలకు ఏడాది క్రితం నిర్దేశిత మొత్తాలతో ప్రభుత్వం టోకెన్లు జారీ చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులే దాదాపు రూ.6200కోట్లకు పైగా బకాయి ఉన్నట్టు తెలుస్తున్నది. ఇక ఉపకారవేతనాలు కలుపుకొంటే సుమారు రూ.8వేల కోట్లకు పైనే పేరుకుపోయాయని అధికారవర్గాలు, విద్యార్థిసంఘాలు వెల్లడిస్తున్నాయి.

సెటిల్‌మెంట్‌తో బడుగు విద్యార్థులకే నష్టం

వన్‌టైం సెటిల్‌మెంట్ అంటే కాలేజీలవారీగా బకాయి ఉన్న నిధుల్లో ఎంతోకొంత మాత్రమే ఏకమొత్తంగా చెల్లించే అవకాశమున్నట్టు తెలుస్తున్నది. ఇది బడుగు, బలహీనవర్గాల విద్యార్థులకే గుదిబండగా మారే ప్రమాదముంది. ఫీజులు వసూలుచేసేందుకు ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించవు. ప్రభుత్వం నయానో భయానో ఒప్పించినా పేద విద్యార్థుల ముక్కుపిండి వసూలు చేస్తాయనేది బహిరంగ రహస్యం. ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా దాదాపు రాష్ట్రవ్యాప్తంగా ఏటా 10లక్షల మందికిపైగా విద్యార్థులు లబ్ధి పొందుతున్నారు. రీయింబర్స్‌మెంట్‌పై నమ్మకంతో ఉన్నత విద్యాభ్యాసానికి ముందుకొచ్చి ప్రైవేట్ కాలేజీల్లో కోర్సులు పూర్తిచేస్తున్నారు. ఇప్పటికే రీయింబర్స్‌మెంట్ నిధులు రాక కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఫీజులు చెల్లించనిదే పరీక్షలు రాయనివ్వని దుస్థితి నెలకొన్నది. కొందరు అప్పులుచేసి, కొందరు సొంతంగా ఫీజులు చెల్లిస్తున్న పరిస్థితి కనిపిస్తున్నది. ఇక ఎలాంటి అవకాశం లేని నిరుపేద విద్యార్థులు ఉన్నత విద్యకు మధ్యలోనే స్వస్తిపలుకుతున్నారని విద్యార్థిసంఘాలు వివరిస్తున్నాయి. కొందరు పూర్తిచేసినా యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో ఉద్యోగావకాశాలు పొందలేకపోతున్నారని వాపోతున్నాయి. ప్రభుత్వ నిర్ణయంతో భవిష్యత్‌లో పేద విద్యార్థులెవరూ ఉన్నత విద్యాకోర్సుల్లో చేరేందుకు ముందుకు రారని, కాలేజీలు కూడా అడ్మిషన్స్ ఇవ్వవని విద్యార్థి సంఘాలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాల నేతలు వాదిస్తున్నారు. వన్‌టైం సెటిల్‌మెంట్ కింద కాకుండా, బకాయిలను పూర్తిగా చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

222 రోజులు 32 వేల కోట్లు

> మొదటిపేజీ తరువాయి...

రాష్ట్ర ఖజానాకు చేరనున్నది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలనాపగ్గాలు చేపట్టిన నాటి నుంచి ఇప్పటివరకు రూ.30 వేల కోట్ల అప్పు చేసింది. మంగళవారం నాడు వచ్చే అప్పుతో అది రూ.32 వేల కోట్లకు చేరనున్నది. 20 రోజుల క్రితమే బ్యాంకుల నుంచి రూ.2000 కోట్ల రుణం తీసుకున్నది. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన 222 రోజుల్లో రోజుకు రూ.144 కోట్ల చొప్పున రుణాలు సేకరించింది. ఇన్ని అప్పులు చేసినా సరే.. అప్పుల కల్పన ఏమైనా జరిగిందా? అంటే అదీ లేదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచిందని తీవ్రంగా విమర్శించిన కాంగ్రెస్.. ఇప్పుడు తాను చేస్తున్నదేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలో ఆస్తులను సృష్టించడంపై రేవంత్‌రెడ్డి సర్కారు శ్రద్ధ పెట్టడం లేదని ఆర్థికరంగ నిపుణులు, రాజకీయవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ అప్పులతో ఒక భారీ ప్రాజెక్టు కానీ, ప్రజల జీవితాలను మార్చే ఒక భారీ పథకంగానీ చేపట్టిన దాఖలాలు లేవని పెదవి విరుస్తున్నారు.



రుణమాఫీ కోసం అప్పులు

అలవికాని హామీలు ఇచ్చి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వాటి అమలుకు అవస్థలు పడుతున్నది. తెలంగాణ ప్రజలపై మరింత రుణభారాన్ని మోపుతున్నది. రుణమాఫీ, రైతు భరోసా, రైతుబీమా పథకాల అమలుకు భారీగా రుణాలను సమీకరిస్తున్నది. ఆగస్టు 15లోగా రూ.2 లక్షలలోపు పంట రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించిన రేవంత్ సర్కారు.. ఇందుకోసం సుమారు రూ.31 వేల కోట్లు అవసరమని ప్రాథమికంగా అంచనా వేసింది. వానాకాలం పంటల సాగు సీజన్ ప్రారంభమై నెలగడిచింది. సెప్టెంబర్ వరకు ముగిసే ఈ సీజన్‌లో రైతు భరోసా (గతంలో రైతుబంధు) పథకం కింద ఎకరానికి రూ.7,500 చొప్పున రైతుల బ్యాంకు అకౌంట్లలో జమ చేయాల్సి ఉన్నది. ఈ పథకానికి కనీసం రూ.5 వేల కోట్లయినా తక్షణం అవసరమని అంచనా. 18 నుంచి 59 ఏండ్లలోపు రైతులకు జీవిత బీమా పథకం కిందరూ.1500 కోట్ల ప్రీమియాన్ని ఎల్‌ఐసీ సంస్థకు ముందాగస్టులోగా సర్కారు చెల్లించాల్సి ఉన్నది.

బాండ్ల ద్వారా రూ.15 వేల కోట్లకుపైగా

ప్రతి నెలా రూ.5 వేల కోట్ల నుంచి 6 వేల కోట్ల విలువైన బాండ్లను విక్రయించడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రిజర్వ్ బ్యాంకు నుంచి అప్పులు తీసుకుంటున్నది. జూలై, ఆగస్టు నెలల్లో బాండ్ల విక్రయం ద్వారా రూ.15 వేల కోట్ల నుంచి రూ.18 వేల కోట్ల వరకు తీసుకునేందుకు అవకాశాలు ఉన్నట్టు మీడియాలో వార్తలు వస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వ భూములతోపాటు తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీజీఐఐసీ) ద్వారా బ్యాంకుల్లో తాకట్టు పెట్టి రూ.10 వేల కోట్లకుపైగా రుణాలను సేకరించేందుకు ఉన్న అవకాశాలను కూడా ప్రభుత్వం పరిశీలిస్తున్నట్టు తెలిసింది. బాండ్ల విక్రయం, భూముల తనఖా, రైతు సంక్షేమ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం ద్వారా కూడా రుణాలు తీసుకోవడంపై ఆలోచిస్తున్నట్టు సమాచారం. అయితే, బీఆర్‌ఎస్ ప్రభుత్వం కార్పొరేషన్ల ఏర్పాటుచేసి రుణాలు సేకరిస్తున్నదంటూ ప్రతిపక్షంలో ఉండగా గగ్గోలు పెట్టిన కాంగ్రెస్.. ఇప్పుడు అందినకాడల్లా తీసుకొస్తున్న రుణాలను మౌలిక వసతుల కల్పనకు, ఆస్తుల సృష్టికి వినియోగిస్తారా? లేదా ఇతర పథకాలకు మళ్లిస్తారా? అని రాజకీయవేత్తలు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు.

పాఠశాలల్లో ప్రహరీ క్లబ్‌లు

డ్రగ్స్ కట్టడికి ప్రభుత్వం సరికొత్త వ్యూహం

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): విద్యాలయాల్లో డ్రగ్స్ కట్టడికి తెలంగాణ సర్కారు సరికొత్త వ్యూహంతో ముందుకెళుతుంది. పాఠశాలల్లో డ్రగ్స్‌ను అరికట్టేందుకు ప్రహరీ క్లబ్‌లను ఏర్పాటుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం శనివారం జీవో -205 జారీచేశారు. తల్లిదండ్రులు, పోలీసులు, ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు గల విద్యార్థులతో కలిపి ఈ క్లబ్‌ను ఏర్పాటు చేస్తారు. హెచ్ఎం, ప్రిన్సిపాల్ క్లబ్‌కు అధ్యక్షుడిగా వ్యవహరిస్తారు. ఉపాధ్యక్షుడిగా సీనియర్ టీచర్ లేదా హైస్కూల్ ఫ్రెండ్లీ టీచర్ ఉంటారు. 6 నుంచి 10వ తరగతి వరకు క్లాసుకు ఇద్దరు చొప్పున విద్యార్థులుంటారు. పేరెంట్ టీచర్ అసోసియేషన్ నుంచి ఒకరు ప్రతినిధిగా, పోలీస్‌స్టేషన్ నుంచి ఒకరు సభ్యుడిగా ఉంటారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పరిధిలో పోలీసుశాఖ, ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సహకారం తీసుకోవాలని సూచించారు.

రేవంత్ సర్కారు చీకటి ఒప్పందాలు

టెండర్లు రద్దు చేయకుంటే ఉద్యమం

- పాలనలో లోపించిన పారదర్శకత
- 40 శాతం ఎక్కువతో మేఘాకు రూ.4 వేల కోట్ల ప్రాజెక్టు పనులు
- బీజేపీఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చీకటి ఒప్పందాలు చేసుకుంటూ అవినీతిమయంగా మారిందని బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. జవాబుదారీతనం, పారదర్శకత లోపించిందని, ప్రజాపాలన పేరుతో రాక్షస పాలన సాగిస్తున్నదని ధ్వజమెత్తారు. 40 శాతం ఎక్కువతో మేఘా కృష్ణారెడ్డికి రూ.4 వేల కోట్ల విలువైన పనులను అప్పగించారని, వీటిని రద్దు చేసి గ్లోబల్ టెండర్లు పిలిస్తే 30 శాతం తక్కువకే పనులు చేపట్టేందుకు అనేక కంపెనీలు ముందుకొస్తాయని, తద్వారా రాష్ట్ర ఖజానాకు రూ.1,200 కోట్లు మిగులుతాయని చెప్పారు. వారం రోజుల్లో పాత టెండర్లను రద్దుచేసి గ్లోబల్ టెండర్లు పిలవాలని, లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అసెంబ్లీ ప్రాంగణంలోని మీడియా పాయింట్ వద్ద శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గతంలో మేఘా కృష్ణారెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేసి ఆయనను జైలు పంపిస్తానని చెప్పిన రేవంత్‌రెడ్డి తిరిగి ఆయనకే 40 శాతం ఎక్కువతో టెండర్లు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. కేంద్ర అమృత్ పథకం నిధులకు సంబంధించిన పనులను గ్లోబల్ టెండర్లు లేకుండా ఇచ్చారని, ఇందులో రూ.1200 కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. కాంగ్రెస్ సర్కార్ అవినీతిని బయటపెట్టే ప్రజాక్షేత్రంలో నిలబెడతామని హెచ్చరించారు. ఈ అవినీతి టెండర్లు రద్దు చేసి గ్లోబల్ టెండర్లు పిలవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఖజానాను దోస్తున్న వారు సీఎం దోస్తులా? రాష్ట్ర ప్రభుత్వ ఆస్థాన గుత్తేదారులా? అని నిలదీశారు. సమాధానం చెప్పకుంటే వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు. వారం రోజుల్లో టెండర్లు క్యాన్సిల్ చేయకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కొడంగల్ ఎత్తిపోతల పథకం కాంట్రాక్టుకు కూడా గ్లోబల్ టెండర్ వేయాల్సిందేనని స్పష్టంచేశారు. దొంగలు దొంగలు కలిసి ఊళ్లు పంచుకున్నట్టు ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు.

ఆగస్టు 3న అమెరికాకు ముఖ్యమంత్రి

- వారం రోజులపాటు పర్యటన

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగస్టులో అమెరికాలో పర్యటించనున్నారు. ఆగస్టు 3 నుంచి 10 వరకు వారంపాటు ఆయన పర్యటన కొనసాగనున్నది. ఇందుకోసం ఆయన శుక్రవారం తన పాస్‌పోర్ట్‌ను రెన్యువల్ చేయించుకున్నారు. అయితే అధికారిక పర్యటనా? వ్యక్తిగత పర్యటనా? అనే అంశంపై ఇంకా ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉన్నది. పర్యటనలో భాగంగా ఎన్నారై పారిశ్రామికవేత్తలతో సమావేశాలు నిర్వహిస్తారని, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా ఆహ్వానిస్తారని సమాచారం. దీంతోపాటు కాంగ్రెస్ అనుబంధ ఎన్నారైలతోనూ సమావేశం అవుతారని తెలిసింది.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

'ఔట్‌సోర్సింగ్'కు ఉద్యోగ భద్రత కల్పించాలి

- ప్రభుత్వోద్యోగులతో సమానంగా గుర్తించాలి
- ఎంపీలు ఈటల, ఆర్ కృష్ణయ్య

ఖైరతాబాద్, జూలై 13: ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వోద్యోగులతో సమానంగా గుర్తించాలని ఎంపీలు ఈటల రాజేందర్, ఆర్ కృష్ణయ్య ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటుచేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. అడ్డా మీద కూలీలకు రూ.600 నుంచి రూ.800 వస్తుంటే, చదువుకున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రూ.400 మాత్రమే వస్తున్నాయని ఈటల రాజేందర్ తెలిపారు. ప్రభుత్వ సీనియర్ ఉద్యోగులకు లక్షకు పైగా వేతనాలు ఉంటే, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో పీహెచ్‌డీ చేసిన వారున్నా రూ.12 వేల జీతం తీసుకొని పనిచేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకొని పీఆర్సీ పద్ధతిలోనే వేతనాల పెంపు వంటి చర్యలు చేపట్టాలని కోరారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల డిమాండ్లకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్టు ప్రకటించారు. ప్రైవేట్ ఏజెన్సీల చేతుల్లో శ్రమదోపిడీకి గురవుతున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల డిమాండ్లు న్యాయమైనవేనని కృష్ణయ్య తెలిపారు. సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉన్నదని గుర్తు చేశారు. ఖాళీల ఆధారంగా అర్హులైన వారిని రెగ్యులర్ చేయాలని కోరారు. పులి లక్ష్మయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోల గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ ఏజెంట్ అరెస్టు

- యువతను కంబోడియాకు పంపుతున్న బీహారీ
- సైబర్ సెక్యూరిటీ అదుపులో మహ్మద్ షాదాబ్ ఆలం

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): ఉద్యోగాల పేరుతో తెలంగాణ నుంచి యువతను కంబోడియాకు పంపి, సైబర్ నేరాల్లోకి దింపుతున్న మహ్మద్ షాదాబ్ ఆలం అనే పాస్‌పోర్టు ఏజెంట్‌ను రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు అరెస్టు చేశారు. బీహార్‌కు చెందిన అతను దుబాయ్ నుంచి వస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం అందడంతో ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో వలపన్ని అదుపులోకి తీసుకున్నారు. అతనిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్టు సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయెల్ వెల్లడించారు. తన కుమారుడిని అక్రమంగా కంబోడియాకు పంపినట్టు మే 16న సిరిసిల్లకు చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేయడంతో షాదాబ్ ఆలంను అరెస్టు చేసినట్టు తెలిపారు. ఈ వ్యవహారంలో జగిత్యాలకు చెందిన కే సాయిప్రసాద్, పుణెకు చెందిన మహ్మద్ అబిద్ హుస్సేన్ అన్సారీ పాత్ర కూడా ఉన్నట్టు గుర్తించామని, వీరిద్దరూ గతంలో కూడా ఇలాంటి కేసులో అరెస్టయ్యారని వివరించారు. ఉపాధి నిమిత్తం ఎవరైనా విదేశాలకు వెళ్లాలనుకుంటే తప్పనిసరిగా సైబర్ సెక్యూరిటీ బ్యూరోను సంప్రదించాలని శిఖాగోయెల్ సూచించారు.



తన నివాసంలో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న రేవంత్‌రెడ్డి

కాంగ్రెస్ గూటికి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

- కండువా కప్పి ఆహ్వానించిన సీఎం రేవంత్‌రెడ్డి
- ముఖ్యమంత్రిని కలిసిన పటాన్‌చెరు ఎమ్మెల్యే
- 'గూడెం' చేరికపైనా జోరుగా ఊహాగానాలు

హైదరాబాద్, జూలై 13(నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. శనివారం మధ్యాహ్నం సీఎం రేవంత్‌రెడ్డి తన నివాసంలో కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇప్పటివరకు బీఆర్‌ఎస్ నుంచి ఎనిమిది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరగా, అరికెపూడి గాంధీ చేరికతో ఆ సంఖ్య తొమ్మిదికి చేరింది. ఇక రాత్రి 8.30 ప్రాంతంలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పటాన్‌చెరు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సీఎం నివాసానికి వెళ్లడం రాజకీయవర్గాల్లో కలకలం సృష్టించింది. ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి వెళ్లిపోయినా, ఆయన చేరికకూ ముహూర్తం కుదిరినట్టు జోరుగా ఊహాగానాలు వస్తున్నాయి.

పార్ట్‌టైమ్ జాబ్ ఫ్రాడ్

- దేశంలో టాప్ ట్రెండింగ్ మోసం ఇదే
- ఇంటి నుంచే ఉద్యోగమంటూ ఎర
- అప్రమత్తంగా ఉండాలన్న ఏడీజీ శిఖాగోయెల్

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. 'ఇంట్లోనే ఉండి జాబ్ చేసుకోవచ్చని, కేవలం యూట్యూబ్ వీడియోలకు లైకులు కొడితే చాలని అమాయకులను ముగ్గులోకి దింపుతున్నారు. అనంతరం కొన్ని లింకులను పంపి, లైకులు కొట్టిస్తున్నారు. ఆపై వారి ఖాతాల్లో కొంత నగదు జమ చేసి, అధిక లాభాల పేరుతో ఎర వేస్తున్నారు. టెలిగ్రామ్ గ్రూపులు ఏర్పాటు చేసి, వాటి ద్వారా టాస్క్‌లు ఇస్తున్నారు. అనంతరం పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టించి నిలువు దోపిడీ చేస్తున్నారు. దేశంలో జరుగుతున్న టాప్ ట్రెండింగ్ మోసాల్లో పార్ట్‌టైమ్ జాబ్ ఫ్రాడ్ అగ్రస్థానంలో ఉన్నట్టు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయెల్ వెల్లడించారు. ఇలాంటి మోసాల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలను చూసి మోసపోవద్దని తెలంగాణ యువతకు సూచిస్తూ 'ఎక్స్' వేదికగా ఆమె ఓ ఆడియో సందేశాన్ని విడుదల చేశారు.



మోసం ఎలా జరుగుతుందంటే..

పార్ట్‌టైమ్ ఉద్యోగాలు ఇస్తామంటూ కేటుగాళ్లు తొలుత సోషల్ మీడియాలో పోస్టు పెడతారు. ఆ లింకును ఎవరైనా క్లిక్ చేసినా, రిప్లై చేసినా వెంటనే వాట్సాప్, టెలిగ్రామ్ చాట్‌లు ఓపెన్ అవుతాయి. తర్వాత రిజిస్ట్రేషన్ కోసం కొన్ని లింకులు పంపి, దానిలోనే ఆన్‌లైన్ అకౌంట్ క్రియేట్ చేస్తారు. వెంటనే ఆయా కంపెనీల ప్రతినిధులమంటూ కొందరు చాట్‌లోకి వస్తారు. మొదట వారే ఆ అకౌంట్లో కొంత డబ్బులు వేసి నమ్మిస్తారు. ఆ తర్వాత రూ.100 నుంచి రూ.500 వరకు పెట్టుబడి పెట్టించి, ఆ సొమ్మును విత్‌డ్రా చేసుకునేందుకు కొత్త టాస్క్ ఇస్తారు. ఆ టాస్క్ పూర్తిచేస్తే వారి ఆన్‌లైన్ అకౌంట్‌లో ఆ డబ్బులకు సంబంధించిన కమీషన్ యాడ్ అవుతుంది. ఆ సొమ్మును విత్‌డ్రా చేసుకోవాలంటే మరో కొత్త టాస్క్ పూర్తి చేయాల్సిందే. ఇలా రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టిస్తారు. కానీ, ఆ సొమ్మును విత్‌డ్రా చేసుకునేందుకు వీలు కల్పించకుండా మొత్తం దోచేస్తారు.

యూఎస్‌లో రెండు ఇండియన్ వీసా అప్లికేషన్ సెంటర్లు

సియాటిల్: అమెరికాలోని సియాటిల్, బెల్లెవ్యూలలో ఇండియన్ వీసా అప్లికేషన్ సెంటర్ (ఐవీఏసీ)లను శుక్రవారం ప్రారంభించారు. సియాటిల్‌లోని ఐవీఏసీని మేయర్ బ్రూస్ హారెల్, కాన్సుల్ జనరల్ ప్రకాశ్ గుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా హారెల్ మాట్లాడుతూ... భారత్, అమెరికా మధ్య స్నేహ బంధాన్ని పటిష్ఠం చేయడంలో భారతీయులు విశేష కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ప్రకాశ్ గుప్తా మాట్లాడుతూ, కొత్తగా ఐవీఏసీలను ప్రారంభించడం ద్వారా పసిఫిక్ వాయవ్య రాష్ట్రాలతో సంబంధాలను పెంపొందించుకోవడంలో భారతదేశ నిబద్ధత స్పష్టమవుతున్నదని చెప్పారు.

ఫ్రంట్ లైన్‌లో పోరాడండి

భారత యోధులపై రష్యన్ సైన్యం ఒత్తిడి

మాస్కో: ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధంలో నిర్బంధంగా రష్యా సైన్యంలో పనిచేస్తున్న భారతీయులకు ఇప్పటికీ ఉపశమనం దొరకడం లేదు. ప్రధాని మోదీ ఇటీవల రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో జరిపిన చర్చల్లో, బలవంతంగా రష్యన్ సైన్యంలో చేరిన భారతీయులను విడుదల చేయాలని పుతిన్‌ను కోరినట్టు, అందుకు ఆయన అంగీకరించినట్టు వార్తలు వచ్చాయి. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు మారలేదు. ఓ పత్రిక కథనం ప్రకారం.. పంజాబ్‌కు చెందిన గగన్‌దీప్ అనే వ్యక్తి ఉన్న యూనిట్‌ను ఉక్రెయిన్‌తో యుద్ధంలో ఫ్రంట్ లైన్‌లో పోరాడానికి వెళ్లాలని రష్యన్ ఆర్మీ కమాండర్ ఆదేశించారు.

పింఛనుగా చివరి జీతంలో 50 శాతం!

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం బడ్జెట్‌లో ప్రతిపాదన!

న్యూఢిల్లీ: ఎన్డీయే ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి పూర్తి స్థాయి బడ్జెట్‌ను మరికొన్ని రోజుల్లో ప్రవేశపెట్టబోతున్నది. దీనిలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) కింద పింఛనుపై భరోసా కల్పించబోతున్నది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి తీసుకునే చిట్టచివరి జీతంలో 50 శాతం సొమ్మును పింఛనుగా చెల్లించే విషయం పరిశీలనలో ఉంది. ఫైనాన్స్ సెక్రటరీ టీవీ సోమనాథన్ నేతృత్వంలో ఏర్పాటైన కమిటీ పలు విధానాలు, ఏపీ ప్రభుత్వం అమలు చేసిన సర్దుబాట్లను కూడా పరిశీలించింది. చిట్టచివరి జీతంలో 50 శాతం సొమ్మును పింఛనుగా చెల్లిస్తామనే హామీని ఇవ్వడంపై ఏకాభిప్రాయం వస్తున్నది.

రాజ్‌భవన్ ఉద్యోగిపై ఒడిశా గవర్నర్ కుమారుడి దాడి!

భువనేశ్వర్: ఒడిశా గవర్నర్ రఘుబర్‌దాస్ కుమారుడు లలిత్‌దాస్ తనపై దాడిచేశారని రాజ్‌భవన్‌లో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి బైకుంఠనాథ్ ప్రధాన్ ఆరోపించారు. గతవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పూరీ సందర్శించిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకుందని ఆయన తెలిపారు. గవర్నర్ సెక్రటరీ శాశ్వత్ మిశ్రాకు ఆయన ఫిర్యాదు చేస్తూ.. జూలై 7న రాత్రి 11.45 గంటల సమయంలో లలిత్ కోపంతో ఊగిపోతూ అసభ్యంగా తిడుతూ చెంపలు వాయించారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని బయటపెడితే చంపేస్తానని లలిత్‌కుమార్ హెచ్చరించారని ఆరోపించారు. అయితే, ఇదంతా కుట్ర అని గవర్నర్ సహాయకుడు ఒకరు కొట్టిపడేశారు.

జమ్ము కశ్మీర్‌లో ఎల్జీకి అదనపు అధికారాలు

2019 చట్టంలో కేంద్రం సవరణలు

న్యూఢిల్లీ, జూలై 13: జమ్ము కశ్మీర్‌లో లెఫ్టినెంట్ గవర్నర్‌కు కేంద్రం మరిన్ని అధికారాలను కల్పించింది. దీనిలో భాగంగా జమ్ము కశ్మీర్ పునర్ వ్యవస్థీకరణ చట్టం 2019లో కేంద్ర హోం శాఖ కొన్ని సవరణలు చేసింది. లెఫ్టినెంట్ గవర్నర్‌కు కొన్ని ముఖ్యమైన అధికారాలను అదనంగా చేర్చింది. ఈ సవరణలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేస్తూ నోటిఫికేషన్‌ను జారీ చేశారు. త్వరలో జమ్ము కశ్మీర్ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న క్రమంలో ఎలాగూ బీజేపీ అధికారంలోకి వచ్చే అవకాశం లేకుండున్న ముందు జాగ్రత్తగా ముఖ్యమైన పలు అధికారాలను ఎల్జీకి కట్టబెట్టే ఉద్దేశంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

బీజేపీకి భంగపాటు

ఏడు రాష్ట్రాల ఉప ఎన్నికల్లో ఘోర పరాజయం.. 13 అసెంబ్లీ సీట్లలో కేవలం రెండు చోట్లే గెలుపు

న్యూఢిల్లీ, జూలై 13: దేశవ్యాప్తంగా ఏడు రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఉప ఎన్నికల్లో బీజేపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అత్తెసరు మెజారిటీతో మూడోసారి కేంద్రంలో అధికారంలో చేపట్టిన బీజేపీకి కొద్ది రోజుల్లోనే మరోసారి భంగపాటు కలిగింది. మొత్తం 13 సీట్లకు జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ కేవలం రెండు చోట్ల మాత్రమే విజయం సాధించింది. దీంతో బీజేపీపై పెరిగిన ప్రజాగ్రహం ఉన్నప్రతికూలత మరోసారి ప్రస్ఫుటమైంది. చాలా స్థానాల్లో కనీస పోటీ ఇవ్వలేక ఆ పార్టీ చతికిలపడింది. బెంగాల్‌లో అధికార టీఎంసీ నాలుగింటికి నాలుగు స్థానాల్లో విజయం సాధించింది. హిమాచల్ ప్రదేశ్‌లో ఆ రాష్ట్ర సీఎం సుఖు భార్య, కాంగ్రెస్ అభ్యర్థి కమలేశ్ ఠాకూర్ బీజేపీ అభ్యర్థిపై 9,399 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. నాలాగఢ్‌లో కాంగ్రెస్, హమీర్‌పూర్‌లో బీజేపీ నెగ్గాయి. ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథ్, మంగ్లౌర్‌లోని మంగళూరు స్థానాలు రెండింటినీ కాంగ్రెస్ కైవసం చేసుకుంది. పంజాబ్‌లోని జలంధర్ వెస్ట్‌ను అధికార ఆప్, బీహార్‌లోని రూపౌలిలో స్వతంత్ర అభ్యర్థి శంకర్ సింగ్ గెలుపొందారు.



బెంగాల్‌లోని రాణాఘాట్‌లో టీఎంసీ కొత్త ఎమ్మెల్యే ముకుత్ మణి సంబరాలు

యూపీ బీజేపీలో తిరుగుబాటు: అఖిలేశ్

లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి తర్వాత యూపీ బీజేపీ నేతలు తమ సొంత పార్టీపై తిరుగుబాటు చేశారని, అందులో చాలామంది నేతలు పీపుల్స్ డెమోక్రాటిక్ అలయెన్స్ (పీడీఏ)లో చేరడానికి సిద్ధంగా ఉన్నారని యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమంలో వీడియో పోస్ట్ చేశారు. ప్రస్తుతం యూపీ బీజేపీ ఒక విచిత్రమైన నిరాశ, నిస్పృహలతో నిండి ఉందని, వారికి అలాంటి పరిస్థితి ఏర్పడటానికి పీడీయే కూటమే కారణమని అన్నారు. దాంతో ఆ పార్టీ నేతలు బయటకు రావాలని అనుకుంటున్నారన్నారు. దీనిలో భాగంగానే ఇప్పటికే పలువురు నేతలు పార్టీకి వ్యతిరేకంగా ప్రకటనలు ఇస్తుండగా, మరికొందరు పార్టీ వేదికలపై తమ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని అన్నారు. బీజేపీ 2027 ఎన్నికల్లోనే కాదు, భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లోనూ ఓడిపోవడం ఖాయమని అఖిలేశ్ యాదవ్ పేర్కొన్నారు.



సీఎంకు ఇచ్చిన వినతులు చెత్తకుప్పలో..

సిద్ధరామయ్య తీరుపై విమర్శలు

బెంగళూరు, జూలై 13: ముఖ్యమంత్రిని కలిసి కష్టాలు చెప్పుకుంటే తీరుతాయని భావించిన కర్ణాటక రైతులకు చేదు అనుభవం ఎదురైంది. స్వయంగా సీఎంకు ఇచ్చిన వినతిపత్రాలు చెత్తకుప్పలో కనిపించాయి. ఈ ఘటన కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై విమర్శలకు కారణమైంది. రామనగరలో జూలై 10న సిద్ధరామయ్య ఓ బహిరంగ సభకు హాజరు కాగా, రైతులు, స్థానికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రాలను సమర్పించారు. అయితే, ఈ వినతిపత్రాలు తాజాగా ఓ చెత్తకుప్పలో పడి ఉన్న వీడియోలు వైరల్ అయ్యాయి. దీంతో సిద్ధరామయ్య తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై సీఎం నైతిక బాధ్యత తీసుకొని, ప్రజలకు జవాబు చెప్పాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌లా కమలమూ

తప్పులు చేస్తే ఎలా?

అలాగైతే పవర్‌లోకి వచ్చి లాభముండదు

బీజేపీకి కేంద్ర మంత్రి గడ్కరీ హెచ్చరికలు



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో భంగపాటుకు గురై, మిత్రపక్షాల సాయంతో అధికారంలోకి వచ్చిన బీజేపీపై సొంతపార్టీ నేతలే విమర్శలు ఎక్కుపెడుతున్నారు. ఈ జాబితాలో తాజాగా కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కూడా చేరారు. ఇటీవల పనాజీలో జరిగిన గోవా బీజేపీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మిగతా పార్టీలతో పోలిస్తే, బీజేపీ భిన్నమైన పార్టీ అని, గతంలో కాంగ్రెస్ చేసిన తప్పులనే ఇప్పుడు బీజేపీ చేస్తున్నదంటూ పరోక్షంగా ఎత్తిచూపారు.

తప్పులు చేయొద్దు

'బీజేపీ భిన్నమైన పార్టీ. మిగతా వాటితో పోలిస్తే, బీజేపీకి చాలా ప్రత్యేకత ఉన్నదని నా గురువు, బీజేపీ అగ్రనేత అద్వానీ చెప్పేవారు. కాంగ్రెస్ గతంలో అధికారంలో ఉన్నప్పుడు చేసిన తప్పుల కారణంగానే ఎన్నికల్లో ఓడిపోయింది. ఇప్పుడు బీజేపీ కూడా అటువంటి తప్పులే చేస్తే లాభమేంటి? అలాంటప్పుడు అధికారంలో ఉన్నా ప్రయోజనమేంటి? కాబట్టి, బీజేపీ అలాంటి తప్పిదాలకు దూరంగా ఉండాలి' అని గడ్కరీ అన్నారు. సామాజిక, ఆర్థిక సంస్కరణలు తీసుకురావడానికి రాజకీయాలే సాయపడుతాయన్నారు. తన స్వరాష్ట్రం మహారాష్ట్రలో కుల రాజకీయాలకు చోటు లేదని, వాటిని ప్రోత్సహించేవారికి గట్టి దెబ్బ తగులుతుందని హెచ్చరించారు.



కేజ్రీవాల్ ప్రాణాలతో బీజేపీ చెలగాటం

ఆయన షుగర్ లెవెల్స్ పడిపోయాయని ఆప్ ఆరోపణ

న్యూఢిల్లీ, జూలై 13: ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఆరోగ్యంతో కేంద్రంలోని బీజేపీ చెలగాటం ఆడుతున్నదని ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్రంగా ఆరోపించింది. మార్చి నుంచి తీహార్ జైలులో ఉంటున్న కేజ్రీవాల్ బ్లడ్ షుగర్ లెవెల్స్ 50 ఎంజీ/డీఎల్ కన్నా తక్కువకు ఐదుసార్లు పడిపోయాయని, ఆయన బరువు సుమారు 8.5 కేజీలు తగ్గిందని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ తెలిపారు. కేజ్రీవాల్‌కు నిర్బంధం నుంచి విముక్తి కల్పించి సరైన చికిత్స అందించకపోతే ఆయన ఆరోగ్యానికి తీవ్ర ముప్పు వాటిల్లే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. కేజ్రీవాల్ అభిమానులు, పార్టీ కార్యకర్తలు, కుటుంబ సభ్యులు ఆయన ఆరోగ్యంపై తీవ్రంగా కలత చెందుతున్నారని, ఆయన ఎందుకు బరువు తగ్గిపోతున్నారో కారణాలు తెలియడం లేదన్నారు.



తోక చుక్కలు ఢీ కొనడం వల్లే భూమిపైకి నీరు

అస్టరాయిడ్ బెల్ట్ నుంచి..

మిషిగన్ వర్సిటీ పరిశోధకుల తాజా అధ్యయనంలో వెల్లడి

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): సకల జీవజాలానికి నీరే ఆధారం. సౌర కుటుంబంలో నీళ్లు ఉన్నట్టు గుర్తించిన ఏకైక గ్రహం భూమి మాత్రమే. అయితే, భూమి మీద నీరు ఏర్పడటానికి గల కారణమేంటన్న అంశంపై ఏండ్లుగా పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. అయితే, ఇప్పటివరకూ ఏ ఒక్క అధ్యయనమూ కచ్చితమైన అభిప్రాయాలను వెల్లడి చేయలేదు. అయితే, అమెరికాలోని మిషిగన్ యూనివర్సిటీ పరిశోధకులు మాత్రం భూమి మీద నీళ్లు ఏర్పడటానికి గల ప్రాథమిక కారణాలను వెల్లడించారు.

అంగారకుడు(మార్స్), బృహస్పతి గ్రహాల మధ్య గ్రహశకలాల గొలుసు (అస్టరాయిడ్ బెల్ట్) ఒకటి ఉంటుంది.

ఆ బెల్ట్‌లో డార్క్ కామెట్స్ (ప్రత్యేకమైన తోకచుక్కలు), 60 శాతం మేర భూమిని పోలిన కొన్ని ఆస్టరాయిడ్లు తిరుగుతూ ఉంటాయి.

వీటిలో మంచు రూపంలో భారీ నీటి నిల్వలు ఉన్నట్టు పరిశోధకులు భావిస్తున్నారు.

వేల ఏండ్ల కిందట ఈ డార్క్ కామెట్స్, ప్రత్యేక ఆస్టరాయిడ్లు భూమిని ఢీకొట్టడంతో కాలక్రమంలో భూమిపై నీరు ఏర్పడిందని, సన్-వాటర్ సైకిల్‌లో భాగంగా బ్రహ్మాండమైన వానలు పడటంతో నదులు, సముద్రాలు ఏర్పడినట్టు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. దీనిపై మరింత సమాచారం రాబట్టాలంటే లోతైన పరిశోధనలు చేయాల్సి ఉన్నదని పరిశోధనకు నేతృత్వం వహించిన అస్టర్ టేలర్ తెలిపారు. ఈ వివరాలు 'ఇకారస్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

కెనడాలో వలసదారులకు ఉపాధి కరువు!

టొరంటో, జూలై 13: కెనడాలో శాశ్వత నివాస హోదా అందుకుంటున్న వలసదారుల్లో అగ్రస్థానంలో ఉన్న భారతీయులు, ఆ దేశంలో ప్రస్తుతం నెలకొన్న ఉపాధి సంక్షోభానికి విలవిల్లాడుతున్నారు. గత 10 ఏండ్లలో ఎన్నడూ లేనంతగా ఉపాధి, ఉద్యోగ సంక్షోభం భారతీయుల్ని, అక్కడి వలసదారుల్ని వేధిస్తున్నది. ఐదేండ్లుగా ఆ దేశంలో ఉంటున్న వలసదారుల్లో నిరుద్యోగ రేటు జూన్ 2024 నాటికి 12.6 శాతం నమోదుకాగా, భారతీయ వలసదారుల్లో నిరుద్యోగ రేటు 30 శాతానికి చేరుకుందని 'గ్లోబ్ అండ్ మెయిల్' తాజా నివేదిక పేర్కొన్నది.

17% ఉత్పత్తులకే ఎమ్మెస్పీ

- 83% వ్యవసాయ ఉత్పత్తులకు ప్రత్యామ్నాయ సాయం అవసరం
- 94 శాతం వ్యవసాయ, అనుబంధ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరలు దక్కడం లేదు
- ప్రైవేటు వ్యక్తులూ ఎమ్మెస్పీకి పంటలను కొనేలా చూడాలి
- కీలక అంశాలు సిఫారసు చేసిన ఎస్బీఐ నివేదిక



న్యూఢిల్లీ, జూలై 13: దేశంలో 94 శాతం వ్యవసాయ, అనుబంధ రంగాల ఉత్పత్తులకు కనీస మద్దతు ధరలు వర్తించడం లేదని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) ఆర్థిక పరిశోధన బృందం నివేదిక పేర్కొన్నది. కనీస మద్దతు ధర వర్తించని పంటలకు మద్దతుగా ప్రత్యామ్నాయ విధానం అమలు చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉందని సూచించింది. కేవలం వ్యవసాయ ఉత్పత్తులను మాత్రమే పరిగణలోకి తీసుకుంటే.. 17 శాతం ఉత్పత్తులకే ఎమ్మెస్పీ వర్తిస్తున్నదని, మిగతా 83 శాతం ఉత్పత్తులకు ప్రభుత్వం సహకారం అందించాలని అభిప్రాయపడింది. ప్రస్తుతం ఉన్న కనీస మద్దతు ధరల విధానంలో అనేక సమస్యలు ఉన్నాయని పేర్కొన్నది.

ప్రభుత్వ కొనుగోళ్లు అరకొర

ప్రభుత్వం 22 పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించినప్పటికీ కేవలం వరి, గోధుమ, పప్పుధాన్యాలు వంటి ఆరేడు పంట దిగుబడులను మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నట్టు పేర్కొన్నది. మొత్తం వ్యవసాయ, అనుబంధ రంగాల ఉత్పత్తిలో ప్రభుత్వం కొనుగోలు చేసేది కేవలం 6 శాతం మాత్రమేనని తెలిపింది. 2023 ఆర్థిక సంవత్సరంలో రూ.56.1 లక్షల కోట్ల విలువైన ఉత్పత్తులకుగానూ ప్రభుత్వం రూ.3.4 లక్షల కోట్ల విలువైన దిగుబడులను మాత్రమే కొనుగోలు చేసిందని పేర్కొన్నది. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో 71 శాతం వాటా కలిగి ఉన్న కూరగాయలు, పండ్లు, మత్స్య సంపద, లైవ్‌స్టాక్, అటవీ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర వర్తించడం లేదని పేర్కొన్నది.

ఎమ్మెస్పీ దక్కకపోతే పరిహారం ఇవ్వాలి

పంట దిగుబడులను ప్రైవేటు వ్యక్తులు సైతం ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకు లేదా అంతకంటే ఎక్కువకే కొనుగోలు చేసేలా కచ్చితంగా నిబంధన విధించాలని ఎస్బీఐ బృందం సూచించింది. ఒకవేళ ఎమ్మెస్పీ కంటే తక్కువ ధరకు పంటను విక్రయించినప్పుడు నష్టపోయే మొత్తాన్ని రైతులకు నేరుగా ప్రభుత్వం పరిహారంగా ఇచ్చే విధానాన్ని ఈ నివేదిక సిఫారసు చేసింది.



ప్రాంతీయ భాషల్లో న్యాయ విద్యను బోధించాలి

సీజేఐ చంద్రచూడ్

లక్నో, జూలై 13: న్యాయ విద్యను ప్రాంతీయ భాషల్లో బోధించాల్సిన అవసరం ఉన్నదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ఉద్ఘాటించారు. సరళమైన భాషలో న్యాయ విద్యను ఎలా బోధించాలన్న అంశంపై విద్యావేత్తలతో తరచూ చర్చిస్తున్నట్టు తెలిపారు. సామాన్య ప్రజలకు సరళమైన భాషలో న్యాయ సూత్రాలను వివరించలేకపోతే న్యాయ వృత్తికి, న్యాయ విద్యకు మధ్య లోటు ఏర్పడుతుందని అన్నారు. లక్నోలో శనివారం ఆయన రామ్ మనోహర్ లోహియా న్యాయ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో మాట్లాడుతూ.. 'న్యాయ విద్యా బోధనలో మనం ప్రాంతీయ భాషలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ప్రాంతీయ సమస్యలకు సంబంధించిన న్యాయ సూత్రాలను కూడా మనం బోధించాలి.' అని పేర్కొన్నారు.

ఏఐతో పర్యావరణానికి ప్రమాదం


- పొదుపుగా వాడకపోతే మానవాళికి కష్టమే
- భారీగా నీటిని తాగేస్తున్న డాటా సెంటర్లు
- శిలాజ ఇంధనాలతో నడుస్తున్న సూపర్ కంప్యూటర్లు
- పెద్ద ఎత్తున వెలువడుతున్న కార్బన్ డయాక్సైడ్
- కృత్రిమ మేధను పొదుపుగా వాడటమే పరిష్కారం

న్యూయార్క్, జూలై 13: కృత్రిమ మేధ(ఏఐ) రంగంలో పైచేయి సాధించేందుకు బహుళజాతి సంస్థలు పోటీ పడుతున్నాయి. వందల కోట్లు ఖర్చు చేసి కొత్త ఫీచర్లతో ఉచితంగా ఏఐ చాట్‌బోట్‌లను అందుబాటులోకి తెస్తున్నాయి. వినియోగదారులు కూడా ఏఐని ఇష్టారీతిన వాడేస్తున్నారు. చిన్న మెయిల్ చేయడానికి కూడా ఏఐపైనే ఆధారపడుతున్నారు. ఫొటోలను, వీడియోలను సృష్టిస్తున్నారు. చిత్రవిచిత్రమైన ప్రశ్నలు అడుగుతూ టైమ్‌పాస్ చేస్తున్నారు. అయితే, ఏఐ కూడా అమూల్యమైన వనరేనని, దీనిని బాధ్యతగా, పొదుపుగా వాడుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఏఐ ఉచితంగానే సేవలు అందిస్తున్నప్పటికీ పర్యావరణంపై మాత్రం భారం వేస్తున్నదని చెప్తున్నారు.

పర్యావరణానికి ప్రమాదమేంటి?

డాటా సెంటర్లలోని సూపర్ కంప్యూటర్ల ద్వారా ఏఐ పని చేస్తుంది. మనం ఏఐని అడిగే ప్రతి ప్రశ్నను ప్రాసెస్ చేసి సమాధానం ఇచ్చేది సూపర్ కంప్యూటర్లే. సూపర్ కంప్యూటర్లు పర్యావరణానికి హానికరంగా మారిన శిలాజ ఇంధనాలతో పని చేస్తున్నాయి. వీటి కోసం అణు ఇంధనాన్ని కూడా వినియోగిస్తుంటారు. దీనిపై ఇటీవల హగ్గింగ్ ఫేస్ అనే ఓ సంస్థ అధ్యయనం చేసింది. కేవలం చాట్‌జీపీటీకి చెందిన జీపీటీ3 మోడల్‌కు శిక్షణ ఇచ్చే క్రమంలో 500 మెట్రిక్ టన్నుల కార్బన్ డయాక్సైడ్ ఉత్పత్తి అయ్యిందని ఈ అధ్యయనంలో తేలింది. ఒక పెట్రోల్ కారు 10 లక్షల కిలోమీటర్లు నడిస్తే ఉత్పత్తయ్యే కార్బన్ డయాక్సైడ్‌కు ఇది సమానం.





నీటి కొరత తప్పదా?

డాటా సెంటర్లు, సూపర్ కంప్యూటర్లు పని చేసేటప్పుడు విపరీతమైన వేడి ఉత్పత్తి అవుతుంది. ఈ వేడిని తగ్గించేందుకు భారీగా మంచినీరు అవసరమవుతుంది. దీంతో ఏఐ వినియోగం ఎంతగా పెరిగితే నీటి కొరత కూడా అంతగా పెరిగే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. డాటా సెంటర్లలో వినియోగించే నీటిపై అనేక విమర్శలు ఉన్నాయి. ఏ కంపెనీ కూడా డాటా సెంటర్లకు ఎంత నీటిని వినియోగిస్తున్నాయని వెల్లడించడం లేదు. అయితే, అమెరికాలోని ఒరెగాన్ రాష్ట్రంలో ఉన్న డలేస్ పట్టణంలో గూగుల్‌కు ఒక డాటా సెంటర్ ఉంది. ఈ మొత్తం పట్టణానికి సరఫరా అవుతున్న నీటిలో పావు వంతు ఈ డాటా సెంటర్‌కు అవసరమవుతున్న విషయం ఓ కేసు ద్వారా వెలుగులోకి వచ్చింది. ఏఐ అందుబాటులోకి రావడం వల్ల సాంకేతికంగా కొన్ని లాభాలు ఉన్నాయి. ఇదే సమయంలో పర్యావరణానికి ఏఐ మరింత భారంగా మారింది. సాంకేతికతను బాధ్యతాయుతంగా వినియోగించుకోవడం వల్ల డాటా సెంటర్లు, సూపర్ కంప్యూటర్లపై భారం తగ్గుతుందని, ఇది పర్యావరణానికి మరో నష్టం చేసేదిగా మారకుండా ఉంటుందని పర్యావరణవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

ప్లాంట్‌జ్మా.. ఎరువు అవసరాన్ని తగ్గిస్తుంది

ఎరువు ప్రభావాన్ని తగ్గించే పరికరాన్ని అభివృద్ధి చేసిన టర్కియే విద్యార్థులు



న్యూఢిల్లీ: పంటలపై ఎరువు, కాలుకాల ప్రభావాన్ని తగ్గించే డివైస్‌ను టర్కియేలోని హైస్కూల్ స్టూడెంట్స్ అభివృద్ధి చేశారు. టీమ్ సెరెస్ అనే ఐదుగురు విద్యార్థుల బృందం తమ స్వస్థలాల్లోని పరిస్థితుల నుంచి స్ఫూర్తి పొంది, ప్లాంట్‌జ్మా అనే పరికరాన్ని తయారు చేశారు. ఈ బృందంలోని స్టూడెంట్ బెయ్జా తెలిపిన వివరాల ప్రకారం, ఈ పరికరం తక్కువ ఉష్ణోగ్రతలోని ప్లాస్మాను ఉపయోగించుకుని, పంటలు నిలదొక్కుకునే సామర్థ్యాన్ని పెంచుతుంది. సాగునీటిని మెరుగుపరుస్తుంది. సాగుకు ముందు విత్తనాలపై ప్లాస్మా ప్రభావం పడటం వల్ల అవి మొలకెత్తే రేటు, ఎదిగే సామర్థ్యం మెరుగుపడతాయి. అంతేకాకుండా తెగుళ్లు, పర్యావరణ ఒత్తిడిని తట్టుకునే సత్తా పెరుగుతుంది. సాగు నీటిని ప్లాస్మాతో శుద్ధి చేయడం వల్ల పర్యావరణ హితకరమైన, నైట్రోజన్ పరిపుష్టమైన ఎరువుగా తయారవుతుంది. ఫలితంగా మొక్కల ఎదుగుదలకు అవసరమైన పోషకాలు లభిస్తాయి. తక్కువ ఉష్ణోగ్రత ప్లాస్మా పవర్‌ను ఈ ప్లాంట్‌జ్మా పరికరం రెండు విధాలుగా ఉపయోగించుకుంటుంది. అవి.. విత్తనాలను నేరుగా శుద్ధి చేయడం. సాగు నీటిని పరోక్షంగా శుద్ధి చేయడం. దీనివల్ల రసాయన ఎరువులపై ఆధారపడటం 40 శాతం వరకు తగ్గుతుంది. పంట ఉత్పత్తులు పెరుగుతాయి. నిలకడైన సాగు పద్ధతులకు ప్రోత్సాహం లభిస్తుంది. గ్రామీణ రైతులు సులువుగా ఉపయోగించేవిధంగా ఈ ప్లాంట్‌జ్మా డివైస్ దాదాపు రూ.16,000కు అందుబాటులో ఉంటుంది.



కుటుంబ సభ్యులు, ఆత్మీయులు, సెలబ్రిటీ అతిథుల సమక్షంలో యువ పారిశ్రామిక వేత్తలు అనంత్ అంబానీ-రాధిక మర్చంట్ వివాహ బంధంతో ఒక్కటయ్యారు. శుక్రవారం అర్ధరాత్రి ముంబైలో జరిగిన పెండ్లి వేడుకలో సెలబ్రిటీలు ఆటపాటలతో సందడి చేశారు.

షెకావత్ స్కైడైవింగ్ సాహసం!



కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్(56) లేటు వయసులో పెద్ద సాహసానికి ఒడిగట్టారు. 14 వేల అడుగుల ఎత్తులో ఆకాశంలో వేగంగా ప్రయాణిస్తున్న విమానం నుంచి ప్యారాచూట్ సహాయంతో కిందకు దూకి థ్రిల్ అనుభవించారు. ప్రపంచ స్కైడైవింగ్ దినోత్సవం సందర్భంగా హర్యానాలోని నార్నౌల్‌లో ఆయన ఈ ఫీట్ చేశారు.

ఉష్ణతాపంతో 'పిడుగుల' వాన

వాతావరణ మార్పులతో పెరుగుతున్న తుఫానులు



న్యూఢిల్లీ, జూలై 13: ప్రపంచ వ్యాప్తంగా వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా వేడి పెరుగుతున్నది. ఈ పెరిగిన వేడి మరింత ఉరుములతో కూడిన తుఫానులకు దారి తీస్తున్నది. తత్ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా ఎక్కువగా 'మెరుపు' దాడులు సంభవిస్తున్నాయని సీనియర్ సైంటిస్టులు తెలిపారు. శుక్రవారం పిడుగుపాటుకు బీహార్‌లో 21 మంది, యూపీలో గురువారం 43 మంది మరణించారు. ప్రస్తుతం పెరుగుతున్న భూతాప పరిస్థితులను పరిశీలిస్తే.. భవిష్యత్తులో తుఫానులు, దాని ద్వారా సంభవించే పిడుగుపాటులు అధికం అవుతాయని భూ విజ్ఞాన శాఖ మాజీ కార్యదర్శి మాధవన్ నాయర్ రాజీవన్ అభిప్రాయపడ్డారు. వాతావరణంలో ఏర్పడిన మార్పుల కారణంగా ఉష్ణ ప్రసరణ లేదా ఉరుములతో కూడిన మేఘాల ఏర్పాటు జరుగుతున్నదని తెలిపారు. గ్లోబల్ వార్మింగ్ పరిణామాలే వీటికి కారణమని అన్నారు. వాతావరణ మార్పులతో గాలిలో తేమశాతం అధికమవుతుందని, దీంతో దట్టమైన మేఘాలు ఎక్కువగా ఏర్పడతాయని అన్నారు. ఐఎండీ మాజీ చీఫ్ కేజే రమేశ్ మాట్లాడుతూ.. ఆకాశంలో నల్లటి మేఘాలు ఏర్పడి కమ్ముకొస్తున్నట్టు గమనించిన వెంటనే ఆరు బయట ఉన్నవారు వెంటనే సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని, పరిష్వంగా ఉన్న భవనాలు, గట్టి పైభాగం ఉండి కిటికీలు పైకి మూసి ఉన్న వాహనాలలోకి చేరుకోవాలని ఆయన సూచించారు.

శ్రీవారి సర్వదర్శనానికి 30 గంటలు

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): వారాంతం కావడంతో తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. శ్రీవారి సర్వదర్శనానికి 30 గంటలకు పైగా సమయం పడుతున్నది. క్యూలైన్లను టీటీడీ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

విదేశాల్లో భర్త.. గర్భం దాల్చిన భార్య!

వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డిపై భర్త అనుమానం

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): తాను విదేశాల్లో ఉండగా తన భార్య, ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి గర్భం దాల్చిందని ఆమె భర్త మదన్ మోహన్ ఆ శాఖ కమిషనర్ సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. తన భార్య అక్రమ సంతానానికి తండ్రి ఎవరో తేల్చాలని కోరుతూ కమిషనర్‌కు లేఖ రాశారు. ఆమె గర్భానికి వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి, గవర్నమెంట్ ప్లీడర్ సుభాష్ కారణమనే అనుమానం వ్యక్తం చేశారు. కాగా ఇటీవలే ఏసీ శాంతిని దేవాదాయశాఖ కమిషనర్ సస్పెండ్ చేశారు.

ఏపీలో కొత్త మద్యం పాలసీకి శ్రీకారం

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): ప్రస్తుత మద్యం పాలసీని రద్దు చేస్తున్నట్టు చంద్రబాబు ప్రభుత్వం శనివారం ప్రకటించింది. ఈ మేరకు ఆదివారం ఉత్తర్వులు జారీ చేయనున్నది. అన్ని డిస్టిలరీస్ లైసెన్సులను రద్దు చేయనున్నట్టు స్పష్టంచేసింది. 3,600 మద్యం దుకాణాలకు టెండర్ విధానంలో లైసెన్సులను కేటాయించనున్నట్టు ప్రకటించింది.

మొహర్రం, బోనాలకు యాంత్రిక ఏనుగు!

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): మొహర్రం, బోనాల ఊరేగింపునకు యాంత్రిక ఏనుగును అందిస్తామని పీపుల్ ఫర్ ది ఎథికల్ ట్రీట్‌మెంట్ ఆఫ్ యానిమల్స్ 'పెటా' రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించింది. దీంతో కర్ణాటక నుంచి సహజ ఏనుగు (రూపవతి)ను తీసుకొచ్చే ప్రక్రియకు తాత్కాలిక బ్రేక్ వేసినట్టు తెలిసింది.

కన్నకొడుకే కాలయముడు

- రియల్టర్ కృష్ణ హత్య కేసును ఛేదించిన షాద్‌నగర్ పోలీసులు
- మూడో భార్యకు ఆస్తులు ఇస్తున్నాడని మొదటి భార్య కొడుకు కోపం
- తండ్రి హత్యకు రూ. 25 లక్షలు, ఓ ఇల్లు సుపారి
- కమ్మరి కృష్ణ కుమారుడు శివతో పాటు మరో ముగ్గురి రిమాండ్
- వివరాలు వెల్లడించిన శంషాబాద్ డీసీపీ రాజేశ్


శనివారం షాద్‌నగర్ ఏసీపీ కార్యాలయ ఆవరణలో రియల్టర్ కమ్మరి కృష్ణ హత్య కేసు వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ రాజేశ్

షాద్‌నగర్, జూలై 13: నాలుగు రోజుల క్రితం సంచలనం రేపిన రియల్టర్ కమ్మరి కృష్ణ హత్య కేసును షాద్‌నగర్ పోలీసులు ఛేదించారు. శనివారం షాద్‌నగర్ ఏసీపీ కార్యాలయ ఆవరణలో శంషాబాద్ డీసీపీ రాజేశ్ కేసు వివరాలను వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం బండ్లగూడ జాగీర్, రఘురాంనగర్ కాలనీకి చెందిన కమ్మరి కృష్ణ (63) రియల్ ఎస్టేట్‌తో పాటు ఇతర వ్యాపారాలు చేసేవారు. మొదటి భార్య, పిల్లలను పట్టించుకోకుండా రెండో వివాహం చేసుకున్నారు. రెండో భార్య అనారోగ్యంతో మృతి చెందగా పావని అనే మహిళను మూడో వివాహం చేసుకొని ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం రెవెన్యూ పరిధిలోని కేకే ఫామ్ హౌస్‌లో నివాసం ఉంటున్నాడు. ఇటీవల పావని పేరుమీద రూ.16 కోట్ల విలువచేసే 10 భవనాలు, హైదరాబాద్‌లోని కేకే గార్డెన్ ఫంక్షన్ హాల్‌ను రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ విషయమై తండ్రితో మొదటి భార్య కుమారుడు శివ గొడవపడ్డాడు. ఆస్తి మొత్తం మూడో భార్యకు ఇస్తాడని భావించి తండ్రిని హత్య చేసేందుకు పథకం వేశాడు. తండ్రికి బాడీగార్డ్‌గా ఉన్న రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం కాళీమందిర్ డిఫెన్స్ ఎంప్లాయీస్ కాలనీకి చెందిన టీక్యుంద బాబాశివానంద్‌ని కలిశాడు. తన తండ్రిని హత్య చేస్తే రూ. 25 లక్షల నగదు, ఓ ఇల్లు సుపారిగా ఇస్తానని చెప్పాడు. దీంతో బాబాశివానంద్ బండ్లగూడ జాగీర్‌కు చెందిన జంగర్ల గణేశ్, అజయ్‌తో పాటు మరో బాలుడితో కలిసి హత్యకు పథకం వేశారు. ఈ నెల 10న కేకే ఫామ్ హౌస్‌లో ఉన్న కమ్మరి కృష్ణ వద్దకు చేరుకున్నారు. బాడీగార్డ్ కమ్మరి కృష్ణ గొంతు కోయగా, మిగతా ఇద్దరు చేతులు పట్టుకున్నారు. హత్య చేసిన అనంతరం పారిపోయారు. గమనించిన పావని తన భర్తను శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు అక్కడి వైద్యులు నిర్ధారించారు. పావని ఫిర్యాదు మేరకు పోలీసులు కమ్మరి శివ, జంగర్ల గణేశ్ అలియాస్ లడ్డు అజయ్, బాలుడిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని ఒప్పుకొన్నారు. వారి నుంచి రెండు కార్లు, ద్విచక్ర వాహనం, మూడు కత్తులు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. తండ్రి ఆస్తిని ఇతరులకు ఇస్తున్నాడనే కోపంతోనే శివ ఈ హత్య చేయించాడని స్పష్టం చేశారు. కేసును ఛేదించిన సీఐలు విజయ్‌కుమార్, రామిరెడ్డి, ప్రమోద్‌కుమార్, పోలీస్ సిబ్బందికి డీసీపీ రివార్డులను అందజేసి అభినందించారు.

ట్రంప్‌కు మస్క్ భారీ విరాళం

వాషింగ్టన్, జూలై 13: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు టెస్లా అధినేత, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ భారీ విరాళం అందించారు. ఆయన ట్రంప్‌నకు నేరుగా విరాళం ఇవ్వనప్పటికీ ఆయన తరఫున ప్రచారం చేస్తున్న పొలిటికల్ యాక్షన్ కమిటీ (పీఏసీ)కి దానిని అందజేశారు. అయితే ఎంత మొత్తం ఇచ్చినదీ వెల్లడి కాలేదు. అయితే తాము సేకరించే విరాళాల గురించి పీఏసీ సోమవారం ప్రకటించాల్సి ఉంది. దాంతో ఎలాన్ మస్క్ ఎంత ఇచ్చిందీ ఆ రోజు వెల్లడయ్యే అవకాశం ఉంది. ట్రంప్‌నకు భారీ విరాళం ఇచ్చినప్పటికీ ఈ ఎన్నికల్లో ఎవరి అభ్యర్థిత్వానికి మస్క్ బహిరంగంగా మద్దతు ప్రకటించ లేదు.

మేడిగడ్డకు స్వల్పంగా తగ్గిన వరద

ఇన్‌ఫ్లో 41,200 క్యూసెక్కులు

మహదేవపూర్/కాళేశ్వరం/అయిజ, జూలై 13 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలోని మేడిగడ్డ (లక్ష్మి) బరాజ్‌కు వరద ప్రవాహం కొనసాగుతున్నది. బరాజ్‌కు శుక్రవారం 43,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, శనివారం 41,200 క్యూసెక్కులకు తగ్గింది. బరాజ్‌లోని మొత్తం 85 గేట్లు తెరిచి అంతే మొత్తంలో వరదను దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం రివర్‌బెడ్ నుంచి 1.50 మీటర్ల ఎత్తులో వరద ప్రవహిస్తున్నది. కాగా కాళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం తగ్గుతున్నది. వారం రోజులుగా ప్రాణహిత నదికి వరద పెరిగినా, శనివారం సాయంత్రం వరకు తగ్గడంతో పుష్కరఘాట్ వద్ద 49 వేల క్యూసెక్కుల నుంచి 40 వేల క్యూసెక్కులకు తగ్గింది. ప్రస్తుతం 05.01 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తున్న గోదావరి లక్ష్మీ బరాజ్ వైపు పరుగులు తీస్తున్నది.

తుంగభద్రకు ఇన్‌ఫ్లో

కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంలోకి వరద వచ్చి చేరుతున్నది. శనివారం ఇన్‌ఫ్లో 11,400 క్యూసెక్కులు ఉండగా.. ఔట్‌ఫ్లో 210 క్యూసెక్కులుగా నమోదైంది. డ్యాం గరిష్ఠ నీటినిల్వ 105.855 టీఎంసీల సామర్థ్యానికిగాను ప్రస్తుతం 30.690 టీఎంసీల నీరు నిల్వ ఉండగా.. పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులకుగాను 1606.21 అడుగులకు చేరినట్టు డ్యాం సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.

నవరత్న ఆయిల్, గోల్డ్ టర్మరిక్ క్రీమ్ ఔషధాలే

హైకోర్టు స్పష్టీకరణ

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): హిమానీ, ఇమామీ కంపెనీలకు చెందిన నవరత్న ఆయిల్, గోల్డ్ టర్మరిక్ ఆయుర్వేదిక్ క్రీమ్ ఔషధ ఉత్పత్తుల క్యాటగిరీలోకే వస్తాయని హైకోర్టు తీర్పునిచ్చింది. వాటితోపాటు బోరోప్లస్ యాంటీ సెప్టిక్ క్రీమ్, బోరో ప్లస్ ప్రిక్లీహీట్ పౌడర్, సోనా చండీ చవన్‌ప్రాశ్ లాంటి ఉత్పత్తులు కూడా ఔషధ ఉత్పత్తుల పరిధిలోకే వస్తాయని స్పష్టం చేసింది. అవి సౌందర్య ఉత్పత్తుల క్యాటగిరీలోకి వస్తాయన్న వాదనను తోసిపుచ్చుతూ.. ఔషధ ఉత్పత్తులపై పన్నులు వేసే జీఎస్టీనే వాటికీ వర్తింపజేయాలని జస్టిస్ పీ శ్యాంకోశీ, జస్టిస్ ఎన్ తుకారాంజీ ధర్మాసనం ఇటీవల తీర్పు వెలువరించింది. తద్వారా 20 ఏండ్ల నుంచి కొనసాగుతున్న వివాదానికి తెర దించింది.

మైనార్టీ గురుకులాల్లో బదిలీ మార్గదర్శకాలపై స్టే

అమలును 18 వరకు నిలిపివేసిన హైకోర్టు

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): మైనారిటీ గురుకులాల్లో బోధన, బోధనేతర సిబ్బంది బదిలీ నిమిత్తం ఈ నెల 6న ఆ శాఖ కార్యదర్శి జారీ చేసిన మార్గదర్శకాల అమలుపై హైకోర్టు స్టే విధించింది. గురుకులాల సర్వీస్ నిబంధనలకు విరుద్ధంగా ఈ మార్గదర్శకాలను జారీ చేశారంటూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ పుల్లా కార్తీక్ ఇటీవల విచారణ జరిపారు. గురుకులాల సిబ్బందిని తెలంగాణ పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ సర్వీస్ నిబంధనల పరిధిలోకి తీసుకొస్తూ 2022 జూలై 7న ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల అమలును నిలిపివేస్తూ గతంలో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని పిటిషనర్ల తరఫు న్యాయవాది తెలిపారు. వాటిని పరిగణనలోకి తీసుకోకుండా బదిలీ మార్గదర్శకాలను జారీ చేయడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. దీంతో ఆ మార్గదర్శకాలపై ఈ నెల 18 వరకు స్టే విధిస్తున్నట్టు న్యాయమూర్తి ప్రకటించారు.


ధర్నాలో మాట్లాడుతున్న సొసైటీ నేతలు వెంకటేశ్వర్లు, జీబీ రెడ్డి

మా ప్లాట్లకు రక్షణ కల్పించాలి

- ప్రభుత్వానికి కృష్ణానగర్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ సొసైటీ నేతల విజ్ఞప్తి
- మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు దురాగతాలపై ధర్నా

చిక్కడపల్లి, జూలై 13: మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, ఆయన బావమరిది ఎస్ సత్యనారాయణరావు, వారి గుండాల దౌర్జన్యాల నుంచి తమ ఇండ్ల స్థలాలకు రక్షణ కల్పించాలని కృష్ణానగర్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు. భూ బకాసురుడైన ప్రేమ్‌సాగర్‌రావుకు మద్దతు ఇవ్వకుండా తమలాంటి పేద, మధ్యతరగతి ప్రజలకు న్యాయం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. శనివారం ఇందిరాపార్కు వద్ద బాధితులు నిర్వహించిన ధర్నాలో సొసైటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి జీబీ రెడ్డి మాట్లాడుతూ.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా రాజా గ్రామ పంచాయతీ పరిధిలో తాము 639/1,643/1,644/1,647/1,648,654 సర్వే నంబర్లలో పట్టాదారుల నుంచి 61 ఎకరాల భూమిని కొనుగోలు చేసి, 708 ప్లాట్లుగా విభజించుకున్నామని వివరించారు. వాటిలో కొన్ని ప్లాట్లను తప్పుడు అగ్రిమెంట్లతో ప్రేమ్‌సాగర్‌రావు ఆక్రమించాడని, ఆ ప్లాట్ల చుట్టూ తాము కట్టుకున్న ప్రహరీ గోడలను కూల్చివేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. మరికొందరు ఓనర్లను బెదిరించి దాదాపు 150 ప్లాట్లను అతి తక్కువ ధరకే తీసుకున్నట్టు తెలిపారు. మిగిలిన 556 మంది ఓనర్లు తమ ప్లాట్లను అమ్మకపోవడంతో ప్రేమ్‌సాగర్‌రావు అక్రమ కేసు పెట్టాడని, తద్వారా ఆ ప్లాట్లలో ఇండ్లు కట్టుకోనీయకుండా ఓనర్లను మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని వాపోయారు. 'ప్రజావాణి'లో అధికారులకు విన్నవించినా ఇప్పటివరకు ఎవరూ స్పందించలేదని తెలిపారు. ప్రేమ్‌సాగర్‌రావు, ఆయన అనుచరుల దురాగతాలను అడ్డుకుని తమ ప్లాట్లలో ఇండ్లు కట్టుకునేందుకు వీలుకల్పించాలని రాచకొండ పోలీస్ కమిషనర్‌ను కోరారు.

మీ కాళ్లు మొక్కుతా.. నా కాళ్లు మొక్కొద్దు!

- కాళ్లకు దండం పెట్టే సంస్కృతిని ప్రజలు, పార్టీ శ్రేణులు వీడాలి
- తల్లిదండ్రులు, గురువులు, దేవుడి కాళ్లకు మాత్రమే దండం పెట్టాలి
- విజయవాడలో ఏపీ సీఎం చంద్రబాబు విజ్ఞప్తి

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): ప్రజలు, పార్టీ కార్యకర్తలు, నాయకులు తన కాళ్లు మొక్కొద్దని ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు కోరారు. ఎవరైనా తన కాళ్లకు నమస్కరిస్తే తాను కూడా వారి కాళ్లకు నమస్కరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలతో కాళ్లకు నమస్కారం పెట్టించుకొనే సంస్కృతి మంచిది కాదని అభిప్రాయపడ్డారు. తల్లిదండ్రులు, గురువులు, దేవుడి కాళ్లకు మాత్రమే మొక్కాలని, నాయకులకు కాదని పేర్కొన్నారు. రాజకీయ నాయకులు కూడా ఈ సంస్కృతికి దూరంగా ఉండాలని సూచించారు. ఏపీ మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌కు శనివారం వచ్చిన చంద్రబాబు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కొందరు వినతిపత్రాలు సమర్పించి కాళ్లు మొక్కే ప్రయత్నం చేయగా, వారిని వారించారు. వినకుండా కాళ్లకు మొక్కితే.. తాను కూడా వాళ్ల కాళ్లకు మొక్కుతానని తెలిపారు. తన సూచనను, విజ్ఞప్తిని అందరూ అర్థం చేసుకొని సహకరించాలని సీఎం కోరారు.

వాణిజ్యం




డీ-మార్ట్ లాభం 774 కోట్లు

న్యూఢిల్లీ, జూలై 13: డీ-మార్ట్ పేరుతో రిటైల్ అవుట్‌లెట్లను నిర్వహిస్తున్న అవెన్యూ సూపర్‌మార్ట్స్ లిమిటెడ్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.773.68 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. అమ్మకాలు పెరగడం వల్లనే గతేడాది ఇదే త్రైమాసికంలో సమోదైన రూ.658.71 కోట్ల లాభంతో పోలిస్తే 17.45 శాతం వృద్ధిని కనబరిచింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 18.57 శాతం ఎగబాకి రూ.11,865.44 కోట్ల నుంచి రూ.14,069.14 కోట్లకు చేరుకున్నది. నిర్వహణ ఖర్చులు 18.62 శాతం పెరిగి రూ.13,056.61 కోట్లకు చేరాయి. ఈ సందర్భంగా అవెన్యూ సూపర్‌మార్ట్స్ సీఈవో, ఎండీ నెవిల్లి నోరోన్హా మాట్లాడుతూ..గత త్రైమాసికంలో కొత్తగా ఆరు స్టోర్లను ప్రారంభించడంతో మొత్తం సంఖ్య 371కి చేరుకున్నాయన్నారు.

5.74 లక్షల కోట్లకు ప్రత్యక్ష పన్ను వసూళ్లు

న్యూఢిల్లీ, జూలై 13: ప్రత్యక్ష పన్ను వసూళ్లలో రెండంకెల వృద్ధి నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు ప్రత్యక్ష పన్ను వసూళ్లలో 19.54 శాతం పెరిగి రూ.5.74 లక్షల కోట్లు వసూలైనట్టు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు(సీబీడీటీ) వెల్లడించింది. కార్పొరేట్ సంస్థలు అధికంగా అడ్వాన్స్ ట్యాక్స్ చెల్లింపులు జరపడం



ఇందుకు కారణమని తెలిపింది. అడ్వాన్స్ ట్యాక్స్ వసూళ్లు 27.34 శాతం ఎగబాకి రూ.1.48 లక్షల కోట్లకు చేరాయి. దీంట్లో కార్పొరేషన్ ఆదాయ పన్ను(సీఐటీ) వసూళ్లు 1.14 లక్షల కోట్లు కాగా, వ్యక్తిగత ఆదాయ పన్ను (పీఐటీ) రూ.34,470 కోట్లని పేర్కొంది. ఈ నెల 11 నాటికి నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.5,74,357 కోట్లు కాగా, వీటిలో సీఐటీ రూ.2,10,274 కోట్లు, పీఐటీ రూ.3,46,036 కోట్లని తెలిపింది. అలాగే రూ.70,902 కోట్లను రిఫండ్ రూపంలో చెల్లించింది.

లైఫ్ సైన్సెస్ పాలసీ ఎప్పుడో?

4 నెలలు దాటినా ఊసేలేని కొత్త విధానం
లైఫ్ సైన్సెస్ గ్రిడ్ స్ట్రాటజీపై తీవ్ర నిర్లక్ష్యం
ఫార్మా విలేజ్‌ల ఏర్పాటుకు భూముల కొరత



హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): దేశ ఔషధ రాజధానిగా హైదరాబాద్‌కు ఉన్న ఖ్యాతి రాష్ట్ర ప్రభుత్వ ఉదాసీనత వల్ల మసకబారే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో ఫార్మా రంగాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ప్రగల్భాలు పలుకుతున్న రాష్ట్ర ప్రభుత్వం.. చేతల్లో మాత్రం ఏమీ చేయలేకపోతున్నది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సిద్ధం చేసిన ఫార్మాసిటీని రద్దు చేసి, 9 చోట్ల ఫార్మా విలేజ్‌లను నెలకొల్పుతామని రేవంత్ సర్కారు ప్రకటించినప్పటికీ వాటి జాడ ఎక్కడా కానరావడం లేదు. లైఫ్ సైన్సెస్ పాలసీని ప్రవేశపెడతామని ప్రకటించి 4 నెలలు దాటినా ఇంతవరకు దాని ఊసే లేదు. కనీసం ఆ దిశగా కసరత్తు జరుగుతున్న దాఖలాలు కూడా లేవు. ఈ నెల 5న హైదరాబాద్‌లో ప్రారంభమైన ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్‌లో ఈ పాలసీని విడుదల చేస్తారని అందరూ భావించినప్పటికీ నిరాశే ఎదురైంది. ప్రస్తుతం ఆ పాలసీపై మాట్లాడేందుకు అధికారులు నిరాకరిస్తున్నారు. తమకు ఎలాంటి సమాచారం లేదని చెప్తున్నారు. వాస్తవానికి ఫార్మా రంగంలో హైదరాబాద్‌కు ఎన్నో అనుకూలతలు ఉన్నాయి. వాటికి తోడుగా గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి చేసిన ఎకోసిస్టంవల్ల పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయి. అనేక ఆర్‌అండ్‌డీ కేంద్రాలు ఏర్పాటవుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి లైఫ్ సైన్సెస్ రంగంలో మరింత ఉజ్వల భవిష్యత్తు ఉండటంలో ఎలాంటి సందేహం లేదు. కానీ, రేవంత్ ప్రభుత్వం నుంచి ఈ రంగానికి ఆశించిన స్థాయిలో ప్రోత్సాహం అందడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గ్రిడ్ స్ట్రాటజీపై నిర్లక్ష్యం

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని లైఫ్ సైన్సెస్ హబ్‌గా తీర్చిదిద్దాలని సంకల్పించింది. రానున్న పదేండ్లలో లైఫ్ సైన్సెస్ ఎకో సిస్టంను 100 బిలియన్ డాలర్ల స్థాయికి పెంచాలని, తద్వారా 4 లక్షల ఉద్యోగాలు కల్పించాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా లైఫ్ సైన్సెస్ గ్రిడ్ స్ట్రాటజీని ప్రకటించింది. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దీన్ని కూడా నిర్లక్ష్యం చేస్తున్నది. రాష్ట్రంలో 10 గ్రీన్‌ఫీల్డ్ ఫార్మా విలేజ్‌లను ఏర్పాటు చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్.. తొలుత నల్లగొండ, మెదక్, వికారాబాద్‌లో సుమారు 1000 నుంచి 2000 ఎకరాల విస్తీర్ణంలో వీటిని ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇది జరిగి 4 నెలలు దాటినా ఎలాంటి పురోగతి లేదు. క్షేత్ర స్థాయిలో మాత్రం భూముల కొరత వెంటాడుతున్నది. నల్లగొండ, మెదక్‌లో భూములు లేవని కలెక్టర్లు స్పష్టం చేయడంతో వికారాబాద్, జహీరాబాద్‌లో ల్యాండ్ పూలింగ్ విధానంలో ఫార్మా విలేజ్‌లు ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. గతంలో ప్రభుత్వం హైదరాబాద్ శివార్లలో ఫార్మాసిటీని అభివృద్ధి చేసేందుకు దాదాపు 19 వేల ఎకరాలు సేకరించింది. దీనికి కేంద్రం నుంచి పర్యావరణ అనుమతులు కూడా రావడంతో భూముల కోసం అనేక కంపెనీలు దరఖాస్తు చేసుకున్నాయి. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఫార్మాసిటీని రద్దు చేయడం, కొత్త ఫార్మా విలేజ్‌లు ఇంకా కార్యరూపం దాల్చకపోవడంతో పరిశ్రమ వర్గాలు అయోమయ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి.

నయా కార్లు వచ్చేస్తున్నాయ్..

న్యూఢిల్లీ, జూలై 13: కొనుగోలుదారులను ఆకట్టుకోవడానికి దేశీయ ఆటోమొబైల్ దిగ్గజాలు నయా మాడళ్లను అందుబాటులోకి తీసుకొస్తున్నాయి. ప్రస్తుత నెలలో కూడా సరికొత్త మాడళ్లను ప్రవేశపెట్టబోతున్నాయి. వీటిలో టాటా, నిస్సాన్, హ్యుందాయ్, మెర్సిడెజ్, బీఎండబ్ల్యూ వంటి అగ్రగామి సంస్థలు తమ కొత్త మాడళ్లను విడుదల చేయబోతున్నాయి. దీంట్లో ప్రీమియం సెడాన్, లగ్జరీ హ్యాచ్‌బ్యాక్, పలు ఎస్‌యూవీలతోపాటు ఎలక్ట్రిక్ కార్లు కూడా ఉన్నాయి. వీటి వివరాలు..



టాటా కర్వ్ ఈవీ

టాటా మోటర్స్ ఈవీల పరిధిని మరింత విస్తరించడంలో భాగం మరో మాడల్‌ను విడుదల చేయడానికి రెడీ అయ్యింది. టాటా కర్వ్ ఈవీ పేరుతో విడుదల చేయనున్న ఈ మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 500 కిలోమీటర్ల వరకు ప్రయాణిం ఇవ్వనున్నది. ఈ కారు ధర రూ.20 లక్షల కంటే అధికంగా ఉంటుందని అంచనా. 12.3 అంగుళాల టచ్‌స్క్రీన్, 10.25 అంగుళాల డిజిటల్ డ్రైవర్ డిస్‌ప్లే, అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్ వంటి ఫీచర్స్‌తో తీర్చిదిద్దింది. ఈ మాడల్‌నే ఈ నెల చివర్లో అందుబాటులోకి తీసుకురావాలని చూస్తున్నది.

నిస్సాన్ ఎక్స్-ట్రైల్

దేశీయ మార్కెట్లోకి అడుగుపెట్టి దశాబ్దకాలం పూర్తైన సందర్భంగా నిస్సాన్..ఫోర్త్ జనరేషన్ అవతార్ మాడల్‌ను ప్రవేశపెట్టడానికి సిద్ధమైంది. ప్రీమియం టచ్ ఇన్‌సైడ్, 12.3 అంగుళాల టచ్‌స్క్రీన్, అడాస్, 1.5 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్, 8 స్పీడ్ సీవీటీ ఆటోమేటిక్‌గా ఈ మాడల్‌ను రూపొందించింది.

హ్యుందాయ్ అల్కాజర్ నయా..

అల్కాజర్‌లో నయా మాడల్‌ను మార్కెట్లోకి విడుదల చేయడానికి సిద్ధమైంది హ్యుందాయ్ మోటర్. ఈ నెల చివర్లో అందుబాటులోకి రానున్న ఈ కారు ధర రూ.17 లక్షల స్థాయిలో ఉంటుందని అంచనా. పెట్రోల్, డీజిల్ ఇంజిన్‌తో తయారైన ఈ మాడల్‌లో 10.25 ఇంచుల స్క్రీన్, డ్యూయల్-జోన్ క్లైమెట్ కంట్రోల్, వైర్‌లెస్ ఫోన్ చార్జర్, ఏడు ఎయిర్ బ్యాగ్‌లు వంటి ఫీచర్స్ ఉన్నాయి.

బీఎండబ్ల్యూ 5 సిరీస్

జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ బీఎండబ్ల్యూ.. ఎనిమిదో జనరేషన్ 5 సిరీస్ మాడళ్లను మార్కెట్లోకి విడుదల చేయబోతున్నట్టు ప్రకటించింది. ఇప్పటికే ఈ మాడళ్లు అంతర్జాతీయ మార్కెట్లో లభ్యమవుతున్నాయి. డ్యూయల్ డిజిటల్ స్క్రీన్, 4-జోన్ క్లైమెట్ కంట్రోల్, ఏడీఏఎస్, పెట్రోల్, డీజిల్‌తోపాటు హైబ్రిడ్ కూడా తయారు చేసింది.

బీఎస్ఎన్ఎల్ బాస్‌గా రాబర్ట్

న్యూఢిల్లీ, జూలై 13: ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పీకే పుర్వార్ పదవి కాలాన్ని కేంద్ర ప్రభుత్వం పొడిగించలేదు. దీంతో టెలికం అధికారి రాబర్ట్ జే రవికి కంపెనీ సీఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించింది. 2019 జూలైలో పదవి బాధ్యతలు స్వీకరించిన పుర్వార్.. ఐదేండ్ల పాటు విధులు నిర్వహించినప్పటికీ, పదవీకాలాన్ని పొడిగించాలని దరఖాస్తు చేసుకున్నారు. కానీ కేంద్ర సర్కార్ ఆయన ప్రతిపాదనను తిరస్కరించింది. ఇండియన్ టెలికం సర్వీసు అధికారైన రవి.. టెలికం రంగంలో 34 ఏండ్లకు పైగా అనుభవం ఉన్నది.

తెలుగు రాష్ర్టాలతో దోస్తీ..

హైదరాబాద్, జూలై 13: తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పనిచేయనున్నట్టు అసోచామ్ తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ చైర్మన్ కే రవి కుమార్ రెడ్డి తెలిపారు. నూతన కమిటీ సమావేశంపై..ఇరు ప్రభుత్వాలకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించనున్నట్టు, వృద్ధిని మరింత పరుగులు పెట్టించడానికి ఒప్పందాలు కూడా కుదుర్చుకోనున్నట్టు చెప్పారు. స్థిరత్వం, సాధికారత, వ్యవస్థాపకత, డిజిటలైజేషన్ వంటి విభాగాల్లో దూసుకుపోతున్నాయన్నారు.



టీ కన్సల్ట్‌ను ప్రారంభిస్తున్న కంపెనీ సీఈవో సందీప్ మక్తల తదితరులు

టీజీఐపీని ప్రారంభించిన టీ కన్సల్ట్

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 13 (నమస్తే తెలంగాణ): తెలుగు స్టార్టప్‌లకు అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు అందించడమే లక్ష్యంగా ఏర్పాటైన టీ కన్సల్ట్.. తొలిసారిగా గ్లోబల్ ఇన్వెస్టర్ పూల్‌ను ప్రారంభించింది. ఈ విషయాన్ని కంపెనీ సీఈవో సందీప్ మక్తల తెలిపారు. దుబాయ్ వ్యాపారవేత్త బూ అబ్దుల్లాతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్టు, తద్వారా మన వ్యాపారాలకు అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలను అందిపుచ్చుకోవడానికి వీలుంటుందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన అబ్దుల్లా కంపెనీతో టీ కన్సల్ట్ ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా ఎంతో మేలు చేయనున్నదని, ముఖ్యంగా ఆవిష్కరణ రంగంలో ప్రత్యేక నైపుణ్యాలను కలిగివున్న తెలుగు వారికి అంతర్జాతీయ అవకాశాలను సొంతం చేసుకునేందుకు ఇది మంచి వేదికని సందీప్ మక్తల తెలిపారు.

బీఎస్ఎన్ఎల్-ఎంటీఎన్ఎల్ విలీనం లేనట్టే!



న్యూఢిల్లీ, జూలై 13: ప్రభుత్వరంగ టెలికం సంస్థలైన బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్‌లను విలీనం చేసే ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకున్నట్టు తెలుస్తున్నది. కేవలం మహానగర్ టెలిఫోన్ నిగం లిమిటెడ్(ఎంటీఎన్ఎల్)కి చెందిన కార్యకలాపాలను బీఎస్ఎన్ఎల్‌కు అప్పగించేయోచనలో సర్కార్ ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నట్టు ప్రభుత్వ వర్గాల ద్వారా తెలుస్తున్నది. ప్రస్తుతం ఆ దిశగా చర్చలు జరుగుతున్నాయని, దీనికి మరో నెల రోజుల సమయం పట్టే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతున్న ఎంటీఎన్ఎల్‌ను బీఎస్ఎన్ఎల్‌లో విలీనం చేయడం ఎంతమాత్రం సమంజసం కాదని ఆ వర్గాలు భావిస్తుండటం వల్లనే కార్యకలాపాలు మాత్రమే మార్చాలని యోచిస్తున్నది. తొలుత సెక్రటరీల కమిటీ ఈ ప్రతిపాదనను ఆమోదించిన తర్వాత క్యాబినెట్ ఆమోదానికి పంపిస్తారని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఈ నెల 20న ఎంటీఎన్ఎల్ బాండ్ల ద్వారా సేకరించిన నిధులకు వడ్డీలను చెల్లించాల్సి ఉన్నది. ప్రస్తుతం ఎంటీఎన్ఎల్..ఢిల్లీ, ముంబైలలో మాత్రమే టెలికం సేవలు అందిస్తుండగా, బీఎస్ఎన్ఎల్ మిగతా దేశవ్యాప్తంగా అందిస్తున్నది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఎంటీఎన్ఎల్ రూ.3,267.5 కోట్ల నష్టం వచ్చింది.

పేటీఎం నుంచి సాఫ్ట్‌బ్యాంక్ ఎగ్జిట్

న్యూఢిల్లీ, జూలై 13: ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ పేటీఎం నుంచి జపాన్‌కు చెందిన సాఫ్ట్‌బ్యాంక్ విజన్ ఫండ్ పూర్తిగా వైదొలిగింది. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ 150 మిలియన్ డాలర్ల నష్టం రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నది. పేటీఎంకు చెందిన మాతృ సంస్థ వన్97 కమ్యూనికేషన్స్‌లో సాఫ్ట్‌బ్యాంక్ 2017 నుంచి పలుదఫాలుగా 1.5 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు పెట్టింది. 2021లో పేటీఎంలో సాఫ్ట్‌బ్యాంక్‌కు 18.5 శాతం వాటా ఉండగా, అలాగే ఎస్‌వీఎఫ్ ఇండియా హోల్డింగ్స్ లిమిటెడ్‌కు 17.8 శాతం, ఎస్‌వీఎఫ్ ప్యాంథర్(కేమ్యాన్) లిమిటెడ్‌కు 1.2 శాతం వాటా ఉన్నది. ప్యాంథర్ లిమిటెడ్ తన పూర్తి వాటాను ఐపీవోలో భాగంగా రూ.1,689 కోట్లకు విక్రయించింది. పేటీఎం ఐపీవో పూర్తైన తర్వాత 24 నెలలకు వైదొలుగుతామని సాఫ్ట్‌బ్యాంక్ గతంలో ప్రకటించింది. దీనికి అనుగుణంగా ఇప్పుడు వైదొలిగినట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఇప్పటి పరిస్థితులను సాఫ్ట్‌బ్యాంక్ ముందుగా ఊహించలేకపోవడం నష్టాలకు ప్రధాన కారణంగా తెలుస్తున్నది. ఒక్కో షేరును రూ.800 చొప్పున సాఫ్ట్‌బ్యాంక్ కొనుగోలు చేసింది. ఇష్యూ ధర రూ.2,150 కాగా, 9 శాతం డిస్కౌంట్‌తో రూ.1,995 వద్ద పేటీఎం షేర్లు లిస్టయ్యాయి. పేటీఎం పేమెంట్ బ్యాంక్ లిమిటెడ్ లావాదేవీలను నియంత్రిస్తూ రిజర్వు బ్యాంక్ ఆదేశాలు జారీ చేయడంతో కంపెనీ షేరు ధర చారిత్రక కనిష్ఠ స్థాయి రూ.310కి పడిపోయింది. ఈ జనవరి-మార్చిలో రూ.550 కోట్ల నష్టం వచ్చింది.

రాజ్‌తరుణ్ ప్రియురాలు
లావణ్య ఆత్మహత్యాయత్నం?

- నా చావుకు కారణం రాజ్‌తరుణ్, మాల్వీనే అని లాయర్‌కు మెసేజ్
- లాయర్ అలర్ట్‌తో పోలీసుల రంగప్రవేశం
- లావణ్యకు నార్సింగి పోలీసుల కౌన్సెలింగ్

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ)/మణికొండ : నటుడు రాజ్‌తరుణ్ ప్రియురాలు లావణ్య ఆత్మహత్యాయత్నం చేసింది. శుక్రవారం అర్ధరాత్రి తన లాయర్‌తో చాటింగ్ చేసిముందు ఆత్మహత్యకు యత్నిస్తున్నట్టు తెలుపడంతో... ఆయన హుటాహుటిన డయల్ 112కు కాల్ చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న నార్సింగి పోలీసులు ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చారు. లావణ్యకు రక్షణ కల్పించాలని, రాజ్‌తరుణ్, అతని తల్లిదండ్రులు, ప్రియురాలు మాల్వీ మల్హోత్రాపై చర్యలు తీసుకోవాలని శనివారం లావణ్య న్యాయవాది డీసీపీ జితేందర్‌ను కలిశారు. కేసును త్వరగా పరిష్కరించాలని డీజీపీ ఉన్నతాధికారులకు ఆదేశించారు. లావణ్య ఆత్మహత్యాయత్నం చేస్తూ.. 'ఈ లోకంలో నా పయనం పూర్తి చేశా. అందుకే వెళ్లిపోతున్నా. నేను ఎంతో తెలిసిన మనుషులే నన్ను తప్పుబట్టారు. రాజ్‌తరుణ్ చేతిలో మోసపోయా. మైండ్ గేమింగ్, గాసిప్స్‌తో విసిగిపోయా. మస్తాన్ కేసులో నేను కీలుబొమ్మనయ్యా. ప్రతిదీ పథకం ప్రకారం జరిగింది. నా చావుకు కారణం రాజ్‌తరుణ్, అతని తల్లిదండ్రులు, మాల్వీ మల్హోత్రా' అంటూ తన లాయర్‌కి మెసేజ్ చేసింది. రాజ్‌తరుణ్ తనని పెండ్లి చేసుకొని, మరొకరితో డేటింగ్‌లో ఉన్నాడని, తనకు న్యాయం చేయాలని లావణ్య ఇటీవల పోలీసులను ఆశ్రయించిన సంగతి తెలిసిందే.

ఐదు యూట్యూబ్ చానళ్లను రద్దు చేయించాం

'మా' అసోసియేషన్ ప్రకటన

హైదరాబాద్, జూలై 13(నమస్తే తెలంగాణ): సినీ తారలపై అసభ్యకర వ్యాఖ్యలు చేస్తూ వారి కుటుంబ, వ్యక్తిగత విషయాలపై దుష్ప్రచారం చేస్తున్న ఐదు యూట్యూబ్ చానళ్లను రద్దు చేయించినట్టు మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ శనివారం ఎక్స్ వేదికగా ప్రకటించింది. ఫస్ట్ వాచ్ టీవీ, బ్రోకర్రాజా, బదినా లలిత్, హైదరాబాద్ కుర్రాడు, ఎక్స్‌ప్లైజెడ్ ఎడిట్స్ 007 చానళ్లు ఈ జాబితాలో ఉన్నాయి. ఇది ఆరంభం మాత్రమేనని, ముందుముందు మరిన్ని చర్యలుంటాయని 'మా' పేర్కొంది. నటీనటుల వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించే చానళ్లు పద్ధతి మార్చుకోవాలని, 48 గంటల్లో అసభ్యకర వీడియోలను తొలగించకపోతే చర్యలు తీసుకుంటామని 'మా' అధ్యక్షుడు మంచు విష్ణు క్రితం సోషల్‌మీడియాలో హెచ్చరించారు. సదరు చానళ్ల శైలిలో మార్పు రాకపోవడంతో 'మా' అసోసియేషన్ యూట్యూబ్ సంస్థకు ఫిర్యాదు చేయగా, వారి విధానాలకు అనుగుణంగా చర్యలు తీసుకున్నది.

చొప్పదండి యువకుడి హత్యపై రీ ఎంక్వైరీ

'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ) : కరీంనగర్ జిల్లా చొప్పదండికి చెందిన మండా విను అనే యువకుడు జనవరి 22న అనుమానాస్పదంగా చనిపోయిన కేసును కరీంనగర్ ఇంటెలిజెన్స్ పోలీసులు రహస్యంగా విచారిస్తున్నారు. పాత కక్షల నేపథ్యంలో అతని స్నేహితులే మేడారం జాతరకు తీసుకెళ్లి చంపేశారని, స్థానిక పోలీసులు తమకు న్యాయం చేయడం లేదని ఆరోపిస్తూ.. బాధిత కుటుంబ సభ్యులు గత మంగళవారం డీజీపీ ఆఫీసుకు వచ్చి వినతిపత్రం ఇచ్చారు. దీనిపై 'న్యాయం కోసం డీజీపీ ఆఫీసుకు' శీర్షికన నమస్తే తెలంగాణ కథనం ప్రచురించింది. దీంతో నాటి డీజీపీ రవిగుప్తా ఆ కేసును తక్షణమే విచారించాలని మల్టీ జోన్-1 ఐజీకి ఆదేశించారు. ఆయన సూచనల మేరకు కరీంనగర్ సీపీ నేతృత్వంలో ఇంటెలిజెన్స్ పోలీసులు నిందితుల వివరాలతో మరోసారి విచారణ చేస్తున్నారు. నిందితుల్లోని కొందరు కాంగ్రెస్ నాయకులు అండతో తమకు అన్యాయం చేస్తున్నారని బాధితులు విలపిస్తున్నారు. పోస్ట్ మార్టం రిపోర్టులు మాయం చేసి సమాచారాన్నంతా డిలీట్ చేసిన నిందితులు.. విను రోడ్డు ప్రమాదంలో చనిపోయినట్టు చిత్రీకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరికి సివిల్ పోలీసులు వంతపాడుతూ కేసును కొట్టివేసే ప్రయత్నం చేస్తున్నారని, డీజీపీ తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

కేయూలో ఊడిపడిన స్లాబ్ పెచ్చులు

విద్యార్థినులకు తప్పిన ప్రమాదం

- పోతన గర్ల్స్ హాస్టల్‌లో ఘటన

హనుమకొండ చౌరస్తా, జూలై 13 : వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీ పోతన గర్ల్స్ హాస్టల్ స్లాబ్ పెచ్చులు భారీగా ఊడిపడ్డాయి. శుక్రవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగిన సమయంలో ఆ గదిలో విద్యార్థినులు లేకపోవడంతో ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ఘటనను నిరసిస్తూ విద్యార్థినులు శనివారం పోతన హాస్టల్ ఎదుట ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పెరటి మల్లారెడ్డి అక్కడికి చేరుకుని విద్యార్థినులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వారు వినలేదు. పెచ్చులూడిన సమయానికి తాము లేకపోవడం ప్రాణాలతో బయటపడ్డామని లేకుంటే ఘోరం జరిగేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఒకదశలో మల్లారెడ్డిని బంధించేందుకు యత్నించారు. కేయూలో వర్షాకాలంలో తమ బాధలు పట్టించుకునే వారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కొద్దిరోజుల క్రితమే సీలింగ్ ఫ్యాన్ కిందపడటంతో ఓ విద్యార్థిని తీవ్రంగా గాయపడింది. వరుస ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తున్నది. తమ ప్రాణాలకు ఏమైనా జరిగితే ఎవరు బాధ్యులని విద్యార్థినులు ప్రశ్నిస్తున్నారు.



స్లాబ్ శిథిలాలను చూపుతున్న విద్యార్థినులు

పెద్ద ప్రమాదం తప్పింది



మెస్‌కు వెళ్లి వస్తుంటే పాము, కుక్కలు కనిపించాయి. వాటి గురించే మాట్లాడుకుంటూ గదికి వచ్చాం. అదే భయంతో అందరం పక్కనున్న బెడ్‌పై మా స్నేహితులు కూర్చున్నారు. నేను పక్క బెడ్‌పై పడుకుని ఫోన్ చూస్తుంటే పెద్ద బండ పడటంతో వెంటనే లేచి ఫ్యాన్ ఆఫ్ చేశా. అప్పుడే ఒకటి తర్వాత పెద్ద పెచ్చులూడి బెడ్‌పై పడ్డాయి. ఆ బెడ్‌పై పడుకునే అమ్మాయి ఉదయమే వాళ్ల ఇంటికి వెళ్లింది. లేకుంటే ఆమె ప్రాణానికే ప్రమాదం జరిగేది. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదు.

-అనూష, విద్యార్థిని

హాస్టల్‌ను షిఫ్ట్‌చేసే ఆలోచనలో ఉన్నాం..

పోతన హాస్టల్ నుంచి విద్యార్థులను షిఫ్ట్‌చేసే ఆలోచనలో ఉండగానే ప్రమాదవశాత్తు పెచ్చులూడిపడ్డాయి. ప్రత్యామ్నాయంగా విద్యార్థులను మరో హాస్టల్‌కు తరలిస్తాం. కొన్ని సంవత్సరాలుగా హాస్టల్ విద్యార్థుల సంఖ్య పెరిగింది. గతంలో పద్మాక్షి హాస్టల్ ఒక్కటే ఉండేది. బాయ్స్ హాస్టల్ అమ్మాయిలకు కేటాయించాం. పది రోజుల క్రితం ఫ్యాన్ కిందపడి రెక్కతగలడంతో విద్యార్థినికి గాయమైంది. ప్రభుత్వం నుంచి నిధులు వస్తే యూనివర్సిటీని అభివృద్ధి చేస్తాం.

- ప్రొఫెసర్ పెరటి మల్లారెడ్డి, రిజిస్ట్రార్

• ఖానాపూర్‌లో స్వర్ణకారుల ఆందోళన



తాము చేసిన బంగారు ఆభరణాలు నకిలీ అని ఖానాపూర్ ముత్తూట్ ఫైనాన్స్ నిర్వాహకులు తమ వినియోగదారులకు సూచించారని ఆరోపిస్తూ ఖానాపూర్‌లోని స్వర్ణకారులు శనివారం ఆందోళనకు దిగారు. పట్టణానికి చెందిన ఓ వ్యక్తి శుక్రవారం బంగారం కుదువ పెట్టి లోన్ తీసుకునేందుకు స్థానిక ముత్తూట్ ఫైనాన్స్ వెళ్లగా నకిలీ బంగారం అని వారు నిరాకరించారంటూ స్వర్ణకారులు నిరసన చేపట్టారు.

-ఖానాపూర్ టౌన్

• గురుకులం తీరుపై తల్లిదండ్రుల ఆందోళన



ఖమ్మం జిల్లా వైరా మండలం రెబ్బవరంలోని పూలే బాలికల గురుకుల పాఠశాలలో మౌలిక వసతులు సరిగా లేవని, మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని ఆరోపిస్తూ విద్యార్థినుల తల్లిదండ్రులు రెబ్బవరం ప్రధాన రహదారిపై శనివారం బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హాస్టల్‌లో తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేకపోవడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అధికారుల హామీతో ఆందోళన విరమించారు.

- వైరాటౌన్



• మా పిల్లలతో టాయిలెట్లు కడిగిస్తారా?

మెదక్ జిల్లా రామాయంపేట శివారులోని గురుకుల హాస్టల్‌లో మూడురోజుల క్రితం ఎలుకలు కరవడంతో విద్యార్థినులు గాయపడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై విద్యార్థినుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తంచేశారు. శనివారం గురుకుల హాస్టల్ వద్దకు చేరుకుని విద్యార్థుల తల్లిదండ్రులు ధర్నా నిర్వహించారు. పిల్లలను ఎలుకలు కరిచినా తమకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని ప్రశ్నించారు. తమ పిల్లలతో టాయిలెట్లు కడిగిస్తారా? ఇంత అధ్వానంగా బాత్‌రూంలు ఉంటే ఎలా పిల్లలను చదివించాలని హాస్టల్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

- రామాయంపేట

కొనసాగుతున్న 'గ్రూప్-4' వెరిఫికేషన్

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): గ్రూప్-4 పోస్టుల భర్తీకి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కొనసాగుతున్నది. అభ్యర్థుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో టీజీపీఎస్సీతో పాటు తెలుగు యూనివర్సిటీలో కూడా వెరిఫికేషన్ నిర్వహిస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఆగస్టు 21 వరకు వెరిఫికేషన్ కొనసాగుతుందని వెబ్‌నోట్‌లో పేర్కొన్నారు. వెరిఫికేషన్ పూర్తయిన దివ్యాంగ అభ్యర్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. వెరిఫికేషన్ త ర్వాత వెల్లడించే తుది జాబితా కంటే ముందుగానే అభ్యర్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్టు అధికారులు తెలిపారు.

'అర్హులకే పదోన్నతులు కల్పించాలి'

హైదరాబాద్, జూలై13 (నమస్తే తెలంగాణ): యూజీసీ, గురుకుల సర్వీస్ రూల్స్, నిబంధనల ప్రకారం అన్నివిధాలా అర్హులైన డిగ్రీ లెక్చరర్లకే ప్రిన్సిపాల్‌గా పదోన్నతులు కల్పించాలని గురుకుల డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు శారద, ప్రధాన కార్యదర్శి సత్యశ్రీదేవి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పీజీలో 55 శాతం మార్కులతో పాటు, పీహెచ్‌డీ అర్హత ఉండాలని, డీఎడ్‌గా ఐదేండ్ల బోధనానుభవంతో పాటు డిపార్ట్‌మెంటల్ పరీక్షలు పాసై ఉన్నవారే డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొందడానికి అర్హులని పేర్కొన్నారు.

నేటి నుంచి సమగ్ర కులగణన సాధన యాత్ర

విజయవంతం చేయాలని జాజుల శ్రీనివాస్ పిలుపు

హైదరాబాద్, జూలై 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టి బీసీల రిజర్వేషన్లు పెంచాలనే డిమాండ్‌తో సమగ్ర కులగణన సాధన యాత్ర చేపట్టనున్నట్టు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం నుంచి ఈ నెల 31 వరకు కామారెడ్డి నుంచి కరీంనగర్ వరకు 18 రోజులపాటు 10 జిల్లాల్లో యాత్ర నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. యాత్రలో పార్టీలకతీతంగా పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078. Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9, Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: Thigulla Krishna Murthy. Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.